కపిల్ చిట్స్ మీ వెంట ఆనందం మీ ఇంట
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us:
www.kapilchits.com
46 Years
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

ESTD: 1999

www.voodayam.com

వుదయం

కపిల్ చిట్స్ మీ వెంట ఆనందం మీ ఇంట
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us:
www.kapilchits.com
46 Years
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

సంపుటి : 27
సంచిక : 252 | హైదరాబాద్ | 17-11-2026 మంగళవారం | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal | Follow us on



పేదల సొంతింటి హక్కుకు భరోసా

హైదరాబాద్, నవంబర్ 16 (వుదయం) : హైదరాబాద్: గతంలో ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల ద్వారా ఇళ్లు నిర్మించుకున్న పేదలకు వారి ఇంటి పట్టాలు, స్వాధీన ధ్రువీకరణ పత్రాలను తిరిగి అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అమలైన వివిధ గృహ నిర్మాణ పథకాల లబ్ధిదారులకు ఈ నిర్ణయంతో ప్రయోజనం కలగనుంది. సుమారు ఏడు లక్షల మంది లబ్ధిదారులకు ఊరట కల్పించేలా అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సూచనల మేరకు పేదల సొంతింటిపై హక్కులను మరింత భద్రం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో గృహ నిర్మాణ పథకాల కింద ఇళ్లు పొందిన వారికి సంబంధించిన పట్టాలు, స్వాధీన ధ్రువీకరణ పత్రాలు ప్రభుత్వ కార్యాలయాల్లోనే ఉండిపోయాయని, వాటి కోసం లబ్ధిదారులు చాలాకాలంగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తనకు అనేక విజ్ఞప్తులు అందడంతో ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు వివరించారు. ప్రస్తుతం భూముల రికార్డులకు సంబంధించిన 22ఎ అంశంపై సమీక్ష జరుగుతున్నసమయంలో తహసీల్దార్ కార్యాలయాల్లో పేదల ఇళ్లకు సంబంధించిన పట్టాలు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు ముఖ్యమంత్రి దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే వాటిని సంబంధిత లబ్ధిదారులకు తిరిగి అప్పగించాలని ముఖ్యమంత్రి ఆదేశించడంతో, ఆ మేరకు జిల్లా కలెక్టర్లకు సూచనలు జారీ చేసినట్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. 2014కు ముందు అమలైన గృహ నిర్మాణ పథకాలలో ప్రభుత్వ రాయితీతోపాటు లబ్ధిదారుల వాటా, బ్యాంకు రుణాల ద్వారా ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించేవారు. బ్యాంకు రుణాలు పొందే సమయంలో లబ్ధిదారుల ఇంటి పట్టాలను హామీ పత్రాలుగా తనఖా పెట్టించుకునేవారు. రుణ వాయిదాలను పూర్తిగా చెల్లించిన అనంతరం ఆ పత్రాలను తిరిగి లబ్ధిదారులకు అందించాల్సి ఉండేది. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం నిలిచిపోవడంతో పలువురికి సంబంధించిన ఇంటి పట్టాలు తిరిగి అందలేదు. రుణాలు చెల్లించినప్పటికీ వివిధ కారణాలతో కొంతమంది లబ్ధిదారుల పత్రాలు ప్రభుత్వ కార్యాలయాల్లోనే ఉండిపోయాయి. దీంతో సొంత ఇళ్లకు సంబంధించిన హక్కు పత్రాలు లేక వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న పట్టాలు, స్వాధీన ధ్రువీకరణ పత్రాలను గుర్తించి సంబంధిత లబ్ధిదారులకు తిరిగి అప్పగించాలని నిర్ణయించింది.

సముద్ర భద్రత, వాణిజ్య బంధాల
బలోపేతమే లక్ష్యం

న్యూఢిల్లీ, నవంబర్ 16 (ఎఎంస్) : మనీలా: ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన ఖల్సా దివాన్ గురుద్వారా పునరాభివృద్ధి పనుల ప్రారంభ కార్యక్రమంలో మంగళవారం పాల్గొననున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఈ గురుద్వారా అపారమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగినదని, గురు సాహిబుల బోధనల స్ఫూర్తితో సిక్కు సమాజం ప్రపంచవ్యాప్తంగా సేవా కార్యక్రమాల్లో ముందుంటూ మెరుగైన ప్రపంచ నిర్మాణానికి కృషి చేస్తోందని ఆయన సామాజిక మాధ్యమ వేదికలో పేర్కొన్నారు. ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ సోమవారం మనీలాలో ఏర్పాటు చేసిన విందులో ప్రధాని మోదీ పాల్గొన్నారు. మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం సోమవారం రాజధానికి చేరుకున్న ఆయన, 23వ ఆసియాన్‌భారత్ సదస్సు, 21వ తూర్పు ఆసియా సదస్సులో పాల్గొననున్నారు. ఈ సమావేశాల్లో ప్రాంతీయ సముద్ర భద్రతను బలోపేతం చేయడం, ఆర్థిక భాగస్వామ్యాలను విస్తరించడం వంటి అంశాలపై భారత్ ప్రధానంగా దృష్టి సారించనుంది. నవంబర్ 16 నుంచి 18 వరకు మోదీ పర్యటన కొనసాగనుంది. 11 దేశాల సమాఖ్య అయిన ఆగ్నేయాసియా దేశాల సంఘం (ఆసియాన్)కు కీలకమైన సమయంలో ఈ పర్యటన జరుగుతోంది. 49వ ఆసియాన్ శిఖరాగ్ర సమావేశం, అనుబంధ సదస్సులకు ఫిలిప్పీన్స్ అతిథ్యమిస్తోంది. 'భవిష్యత్తును దిశానిర్దేశం చేయడం' అనే ఇతివృత్తంతో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నారు. మనీలా వేదికగా జరిగే క్వాడ్ నాయకుల సమావేశంలో ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భేటీ అయ్యే అవకాశం ఉంది. ఆగ్నేయాసియా దేశాల నాయకులతో సమావేశం కోసం ట్రంప్ మంగళవారం ఫిలిప్పీన్స్‌కు చేరుకోనున్నారు. అనంతరం బుధవారం చైనా పర్యటనకు వెళ్లి ఆసియాపసిఫిక్ ఆర్థిక సహకార సదస్సులో పాల్గొంటారు. ఈ ఏడాది చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో మూడోసారి ముఖాముఖి సమావేశం కానున్న ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను కూడా కలవనున్నారు.



వాణిజ్యం, పెట్టుబడులకు ప్రాధాన్యం

భారత్‌ఆసియాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సమీక్షించడంలో ప్రధాని మోదీ కీలక పాత్ర పోషించనున్నారు. ముఖ్యంగా వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణపై చర్చలు జరగనున్నాయి. 20262030 కాలానికి సంబంధించిన భారత్‌ఆసియాన్ కార్యాచరణ ప్రణాళికను నాయకులు సమీక్షించనున్నారు. పెట్టుబడుల పెంపు, ప్రాంతీయ అనుసంధానత, పటిష్ఠమైన సరఫరా వ్యవస్థల అభివృద్ధి వంటి కొత్త సహకార రంగాలను గుర్తించనున్నారు. భారత్‌ఆసియాన్ వస్తు వాణిజ్య ఒప్పందం సమీక్షను త్వరగా పూర్తి చేయాలని భారత్ పట్టుదలతో ఉంది. తద్వారా మార్కెట్ అవకాశాలను విస్తరించుకోవడంతో పాటు వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయాలని భావిస్తోంది. సముద్ర భద్రత, రక్షణ సహకారంపై దృష్టి మోదీ పర్యటనలో సముద్ర భద్రత ప్రధాన చర్చనీయాంశంగా ఉండనుంది. సముద్ర భద్రత, నీలి ఆర్థిక వ్యవస్థలో పరస్పర సహకారాన్ని పెంపొందించేందుకు భారత్, ఆసియాన్ దేశాలు 2026ను సముద్ర సహకార సంవత్సరంగా నిర్వహిస్తున్నాయి. చైనాతో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో సముద్ర రంగంలో సహకారాన్ని విస్తరించాలని ఫిలిప్పీన్స్ కోరుతోంది.

ప్రాంతీయ భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు ఆసియాన్ దేశాలతో రక్షణ సంబంధాలను మరింత బలోపేతం చేయాలని భారత్ భావిస్తోంది. గస్తీ నౌకలు, రాడార్లు, వైమానిక రక్షణ వ్యవస్థలు, హెలికాప్టర్లు, మానవరహిత విమానాలు, ఇతర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల రంగాల్లో సహకారం పెంపొందించే అంశాలు చర్చకు రానున్నాయి.

విద్యార్థుల భవిష్యత్తుకు
పీఆర్ఎస్ఐ చేయూత

హైదరాబాద్, నవంబర్ 16 (వుదయం) : పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) హైదరాబాద్ విభాగం, యూసుఫ్‌గూడలోని సెయింట్ మేరీస్ కళాశాల మధ్య నలంద విద్యార్థుల వేదిక ప్రాజెక్టు కింద కుదిరిన అవగాహన ఒప్పందాన్ని నవంబర్ 2026 నుంచి మరో రెండేళ్లపాటు పొడిగించారు. ఈ మేరకు పీఆర్ఎస్ఐ హైదరాబాద్ విభాగం ఛైర్మన్ డా. కె. యాదగిరి, సెయింట్ మేరీస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జైమోల్ క్రాస్ కళాశాల ప్రాంగణంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డా. జె. మైఖేల్ ప్రీతమ్, సహాయ ఆచార్యుడు శ్రీ శివకుమార్ రెడ్డి, నలంద విద్యార్థుల వేదిక కన్వీనర్ శ్రీ కృష్ణ బాజీ, పీఆర్ఎస్ఐ మాజీ ఛైర్మన్ శ్రీ కె. గోవిందరాజ్ పాల్గొన్నారు. విద్యార్థుల విద్యా, వృత్తిపరమైన అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని పీఆర్ఎస్ఐ హైదరాబాద్ విభాగం ఇప్పటికే జంట నగరాల్లోని 14 కళాశాలలతో అవగాహన ఒప్పందాలు చేసుకుంది.



నీటి కొరత లేదంటారు..
ట్యాంకర్లు ఎందుకు సరఫరా చేస్తున్నారు?



హైదరాబాద్, నవంబర్ 16 (వుదయం) : హైదరాబాద్: నగరంలో తాగునీటి సమస్య లేదని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించడం వాస్తవాలకు విరుద్ధమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరులు ఎక్కడ మాట్లాడినా ప్రజలకు ధైర్యంగా అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరానికి నీటి కొరత లేదంటూ ఉత్తమ్ కుమార్ రెడ్డి బహిరంగంగా ప్రకటించడం సరికాదన్నారు. నగరానికి రోజుకు 750 ఎంజీడీల నీరు అవసరమవుతుండగా, ప్రస్తుతం కేవలం 500 ఎంజీడీలు మాత్రమే సరఫరా అవుతోందని వివరించారు. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తగా నీటిని వినియోగించాలని చెబుతుంటే, మరోవైపు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటి ఎద్దడి లేదని ప్రకటిస్తున్నారని పేర్కొన్నారు. వీరిద్దరిలో ఎవరి మాటలను ప్రజలు విశ్వసించాలని ప్రశ్నించారు. నగరంలో 2,30,000 నీటి ట్యాంకర్లను సరఫరా చేసినట్లు అధికారులు చెబుతున్నారని, అదే సమయంలో నీటి కొరత లేదని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. నీటి సమస్య లేనప్పుడు ఇన్ని ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన అవసరం ఏమిటని నిలదీశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో
మీడియా పాత్ర కీలకం

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మీడియా కమిషన్ అవసరం

వాస్తవాలు, విశ్వసనీయతే జర్నలిజానికి ప్రాణం

హైదరాబాద్, నవంబర్ 16 (వుదయం) : మారుతున్న మీడియా రంగం, సామాజిక మాధ్యమాల విస్తరణ నేపథ్యంలో పాత్రికేయులు, మీడియా సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర అధ్యయనం చేసేందుకు మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సామాజిక మాధ్యమాల పోటీని తట్టుకుంటూ ప్రధాన వార్తా సంస్థలు ప్రజలకు వేగంగా, కచ్చితమైన, వాస్తవాధారిత సమాచారాన్ని అందించాల్సిన బాధ్యతను గుర్తించాలని శాసనమండలి సభ్యుడు, ప్రొఫెసర్ కోదండరాం సూచించారు. నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ కార్యాలయంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టులు, తెలంగాణ మీడియా అకాడమీ సంయుక్తంగా జాతీయ పత్రికా దినోత్సవాన్ని నిర్వహించాయి. మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాత్రికేయ రంగంలోని పరిణామాలు, సవాళ్లపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. దేశంలో తొలి పత్రికా కమిషన్ ఏర్పాటు అనంతరం, వర్కింగ్ జర్నలిస్టులు, వార్తాపత్రికలు, వాటికి సంబంధించిన చట్టాల రూపకల్పనపై అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ సూచనల మేరకు 1966 నవంబర్ 16న భారత పత్రికా మండలి ఏర్పాటైందని వక్తలు గుర్తుచేశారు. భారత పత్రికా మండలి ఆవిర్భవించిన రోజును జాతీయ పత్రికా దినోత్సవంగా నిర్వహించడం అనవాయితీగా కొనసాగుతోందని పేర్కొన్నారు.



ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలి



శాసనమండలి సభ్యుడు, ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మీడియా రంగంలో మార్పులు, పునర్వ్యవస్థీకరణలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాన వార్తా మాధ్యమాలైన పత్రికలు, దృశ్య మాధ్యమాలు ప్రజల విశ్వాసాన్ని క్రమంగా కోల్పోతున్నాయని, ఈ పరిస్థితుల్లో సామాజిక మాధ్యమాలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని పేర్కొన్నారు.

కొన్ని మీడియా సంస్థలు ప్రభుత్వ పెద్దల మద్దతు పొందడానికే ప్రాధాన్యం ఇస్తూ వార్తల స్వరూపాన్ని మార్చివేస్తున్నాయని విమర్శించారు. సంచలన కథనాలకే పరిమితం కాకుండా, సమాజానికి అవసరమైన వార్తలను గుర్తించి ప్రజలకు ఎంతవరకు మేలు చేస్తున్నాయో మీడియా సంస్థలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. వాస్తవాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో అందించడం ప్రధాన బాధ్యతగా భావించాలన్నారు.

నైతిక విలువలతో వార్తా సేకరణ అవసరం

మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా 'జర్నలిజం, ప్రజాకర్షణ, బాధ్యత' అనే అంశంపై ప్రసంగించారు.

కళాకారుల డిజిటల్
హక్కుల రక్షణకు చిరంజీవి చొరవ

హైదరాబాద్, నవంబర్ 16 (వుదయం) : హైదరాబాద్: కృత్రిమ మేధ దుర్వినియోగాన్ని అరికట్టి, సినీ కళాకారుల ముఖచిత్రం, గొంతు, సృజనాత్మకతకు పటిష్ఠమైన చట్టపరమైన రక్షణ కల్పించాలని మెగాస్టార్ చిరంజీవి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి అధికారిక వినతిపత్రాన్ని అందజేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర హోం, సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖలకు ఉద్దేశించిన ఈ విజ్ఞప్తిలో డిజిటల్ వ్యక్తిత్వ దుర్వినియోగాన్ని నియంత్రించేందుకు పలు కీలక చర్యలను ప్రతిపాదించారు.



చిత్ర పరిశ్రమకు కష్టకాలంలో అండగా నిలవడంలో చిరంజీవి ఎప్పుడూ ముందుంటారు. కరోనా మహమ్మారి సమయంలో సినీ కార్మికులకు సహాయం అందించడం, ఆరోగ్య కార్డులు, వైద్య సేవలు, ఆర్థిక తోడ్పాటు వంటి కార్యక్రమాల ద్వారా పరిశ్రమ సంక్షేమానికి విశేష కృషి చేశారు. రక్తదానం, నేత్రదానం వంటి సేవా కార్యక్రమాలతో సామాజిక బాధ్యతను సైతం చాటుకున్నారు. తాజాగా కళాకారుల గౌరవం, వృత్తిపరమైన హక్కులు, జీవనోపాధికి ముప్పుగా మారుతున్న కృత్రిమ మేధ దుర్వినియోగంపై స్పందిస్తూ మరోసారి తన చొరవను ప్రదర్శించారు. ఇటీవల అమిత్ షాతో జరిగిన సమావేశంలో కృత్రిమ మేధ ఆధారిత నకిలీ చిత్రాలు, స్వరాల సృష్టి వల్ల సినీ, టెలివిజన్ రంగాలకు చెందిన కళాకారుల ప్రతిష్ఠకు కలుగుతున్న నష్టాన్ని చిరంజీవి వివరించారు. ఈ సమస్యపై లిఖితపూర్వకంగా వినతిపత్రం సమర్పించాలని అమిత్ షా సూచించడంతో, తాజాగా కిషన్ రెడ్డికి దానిని అందజేశారు. సంబంధిత మంత్రిత్వ శాఖలతో చర్చించి, వినతిలో పేర్కొన్న అంశాలపై సమన్వయం చేస్తానని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు.

కళాకారుల ముఖం, గొంతు, వ్యక్తిగత గుర్తింపును వారి అనుమతి లేకుండా వినియోగించకుండా చట్టపరమైన రక్షణ కల్పించాలని చిరంజీవి కోరారు. డిజిటల్ రూపంలో వ్యక్తులను పునఃసృష్టించే ముందు వారి సమ్మతి తప్పని సరి చేయాలని, దురుద్దేశంతో రూపొందించిన కంటెంట్‌పై కఠిన శిక్షలు విధించాలని సూచించారు. చట్టవిరుద్ధమైన సమాచారాన్ని నిర్ణీత సమయంలో తొలగించే విధానం, సృజనాత్మక హక్కుల పరిరక్షణ, ప్రత్యేక ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటువంటి దుర్వినియోగానికి అవకాశం కల్పించే వేదికలు, సేవల సంస్థల బాధ్యతలను కూడా స్పష్టంగా నిర్ధారించాలని పేర్కొన్నారు.






ప్రాచీన నాటక కళను కాపాడుకుందాం

కేశంపేట (వుదయం ప్రతినిధి నవంబర్ 16)

కనుమరుగవుతున్న ప్రాచీన కళ అయిన స్టేజి నాటక ప్రదర్శనను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదనిసంగెం గ్రామ సర్పంచ్ గన్నోజు వేణుగోపాల్ చారి అన్నారు. సోమవారం గ్రామంలో నిర్వహించనున్న సింధోల్ల 'జాంబవంతుని కథ' స్టేజి నాటక ప్రదర్శన కోసం ఆయన తన వంతు సహాయంగా నిర్వాహకులకు రూ. 50,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేణుగోపాల్ చారి మాట్లాడుతూ.. తాము చిన్నతనంలో ఇలాంటి స్టేజి నాటకాలను ఎంతో ఆసక్తిగా చూసేవారమని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఇంత సుదీర్ఘ కాలం తర్వాత గ్రామస్తులంతా కలిసి మళ్ళీ స్టేజి నాటక ప్రదర్శనను ప్రదర్శించడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. ప్రాచీన కళారూపాలను భావితరాలకు అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భారీ ఆర్థిక సాయం అందించి ప్రోత్సహించిన సర్పంచ్ వేణుగోపాల్ చారికి నాటక నిర్వాహకులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కళాకారులు పాల్గొన్నారు...

రెండేళ్లుగా నత్తనడకన నాగారం రోడ్డు పనులు..
ప్రజలకు తప్పని తిప్పలు!

- 30 శాతానికే పరిమితమైన విస్తరణ పనులు.. అధికారుల నిర్లక్ష్యంపై అసహనం
- పనులు వేగవంతం చేసి వెంటనే పూర్తి చేయాలి:
- మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి



వుదయం ప్రతినిధి, కీసర, నవంబర్ 16:

నాగారం గ్రామంలో రెండేళ్లుగా నత్తనడకన సాగుతున్న రోడ్డు విస్తరణ పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు ట్రాఫిక్ కష్టాలను తొలగించాలని కోరుతూ మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘట్‌కేసర్ డివిజన్ పరిధిలోని నాగారం గ్రామంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమై దాదాపు రెండేళ్లు గడుస్తున్నా నేటికీ పూర్తికాకపోవడం బాధాకరమన్నారు.ఇప్పటివరకు కేవలం 30 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయని,మిగిలిన పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.చర్లపల్లి నుంచి కరీంగూడ ఔటర్ రింగ్ రోడ్డు వరకు,నాగారం ఎక్స్‌రోడ్ నుంచి యమ్నంపేట్ వరకు,నాగారం పాత విలేజ్ నుంచి జవహర్‌నగర్ వైపు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు అసంపూర్తిగా ఉండటంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు.ఉద్యోగులు,విద్యార్థులు,మహిళలు,వృద్ధులు,వ్యాపారులు ట్రాఫిక్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.అసంపూర్తి రోడ్ల కారణంగా వాహనదారులకు ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.కాంట్రాక్టర్ నిర్లక్ష్యం,అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా రెండేళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పనుల్లో ఆశించిన పురోగతి లేకపోవడం బాధాకరమన్నారు. రోడ్డు విస్తరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత కాంట్రాక్టర్‌కు నిర్దిష్ట గడువు విధించి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయించాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు.పనుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు తక్షణమే స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేసి నాగారం ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని కౌకుంట్ల చంద్రారెడ్డి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నక్క కిషోర్ గౌడ్,మెరుగు శ్రీనివాస్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



మిడ్జిల్ మండలంలో 437 మందికి

చేయూత పెన్షన్ ప్రాసీడింగ్స్ పంపిణీ

- **మిడ్జిల్ మండలంలో 437 మందికి చేయూత పెన్షన్ ప్రాసీడింగ్స్ పంపిణీ**
- **అర్హులైన పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోంది: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

మిడ్జిల్, నవంబర్ 16: వుదయం

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, ఇతర వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జడ్పర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. ఆదివారం మిడ్జిల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన నూతనంగా చేయూత పింఛన్లు మంజూరైన 437 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పింఛన్ ప్రొసీడింగ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సంక్షేమం, సామాజిక భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులైన నిరుపేదలకు చేయూత పింఛన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. వృద్ధాప్యం, అనారోగ్యం, దివ్యాంగత్వం తదితర కారణాలతో ఇబ్బందులు పడుతున్న వారికి ప్రభుత్వం అందించే పింఛన్ ఆర్థిక భరోసాగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన వారు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిడ్జిల్ మండలంలో ఒకేసారి 437 మందికి నూతనంగా చేయూత పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.తమకు పింఛన్లు మంజూరు చేసిన ప్రభుత్వానికి, కృషి చేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో

ఘనంగా ఈ-కిడ్స్ ఆటలపోటీలు





షాద్‌నగర్, నవంబర్ 16,(వుదయం):

చిన్నారులలో చిన్న వయసు నుంచే క్రీడాస్ఫూర్తిని, శారీరక దృఢత్వాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో షాద్ నగర్ పట్టణంలోని నారాయణ పాఠశాలలో ఈకిడ్స్ ఆటలపోటీలను ఘనంగా నిర్వహించారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ క్రీడా సంబరాల్లో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల కోసం నిర్వహించిన పరుగు పందాలు, వివిధ వినోదాత్మక క్రీడలు, ఆసక్తికరమైన ఆటల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. చిన్నారుల చిరునవ్వులు, కేరింతలతో పాఠశాల ప్రాంగణమంతా సందడిగా మారింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏజీఎం వెంకటరెడ్డి, కోఆర్డినేటర్ మాధురి, ఈ కిడ్స్ ఆర్ అండ్ డి సంగీత, ప్రిన్సిపల్ మాధవి, వైస్ ప్రిన్సిపల్ అనసూయ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువుతో పాటు చిన్నప్పటి నుంచే పిల్లలకు క్రీడలపై ఆసక్తి కల్పించడం ద్వారా వారిలో శారీరక, మానసిక వికాసం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. అనంతరం పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేసి అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సమష్టి కృషితో ఈ క్రీడా వేడుక విజయవంతంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు.

దూల్మిట్ట హాస్టల్ పూర్వ మిత్ర బృందం ఆత్మీయ సమ్మేళనం
విజయవంతం చేసిన వారందరికీ అభినందనలు అధ్యక్షులు గంధమల్ల యాదగిరి

ధూళిమిట్ట(వుదయం) నవంబర్ 16,

సిద్దిపేట జిల్లా, దూలిమిట్ట మండలం, ఖాతా గ్రామం మహాదేవుని గుట్ట ప్రాంగణంలో

నిన్న జరిగిన దూల్మిట్ట హాస్టల్ పూర్వ విద్యార్థుల మిత్ర బృందం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి వచ్చిన మిత్రులందరికీ పేరుపేరునా నమస్కారములు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గంధమల యాదగిరి మాట్లాడుతూ...మనము అనుకున్న సమయానికి హాజరు కాలేకపోయినందున అందరూ క్షుప్తంగా మాట్లాడలేకపోయారు దూర ప్రాంతం నుండి అంటే కారులో వచ్చే వారి కంటే బైకుల పైన హైద్రాబాద్, హనుమకొండ ,జనగామ , బచ్చన్నపేట సిద్దిపేట నుండి వచ్చిన మిత్రులందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు ఈ కార్యక్రమానికి ఖాతా గ్రామము తోర్నాల గ్రామ మిత్రులు ప్రతి పనికి నా ఇంటి ఫంక్షన్ గా భావించి పని చేసిన మిత్రులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు.

రిటైర్మెంట్ అయిన వారికి , మనతో దూల్మిట్ట హాస్టల్లో ఉండి చదువుకొని ఇదే గ్రామ దూలిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు హెడ్మాస్టర్(DHM) గా విధులు నిర్వహిస్తున్న చిలుక వెంకటయ్య గారిని ఘనంగా సన్మానించడం జరిగింది. హాస్టల్ సీనియర్ చంద్ర మౌళి అన్న, కొంకటి వెంకటన్న, కోడి మంజుల, దాసారం శ్రీనివాస్, కుటిగల్ సర్పంచ్ దాసారం బాలకృష్ణ, మాజీ సర్పంచులకు సన్మానం చేయడం చాలా సంతోషం .అలాగే కమిటీ సభ్యులకు సన్మానం చేయడం జరిగింది. ప్రత్యేకంగా ఈ కార్యక్రమంలోమొదటి నుండి అడుగడుగునా ఫోటోలు వీడియోలు తీసిన మిత్రులకు నమస్కారం ముఖ్యంగా ఈ కార్యక్రమానికి DHM గారు ఎన్నో పనులు ఉన్న వాటన్నిటిని వదులుకొని ముందుండి కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపించినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు . అలాగే కార్యక్రమానికి డబ్బులు చెల్లించిన వారు ఈ కార్యక్రమానికి వీలుపడకు రానటువంటి మిత్రులకు ధన్యవాదాలు తెలుపుచున్నాను. ఈ యొక్క కార్యక్రమంలో ఎలాంటి తప్పులున్న లోటుపాట్లు ఉన్న మంచి మనసుతో క్షమిస్తారని గుర్తుచేస్తూ అందరూ బాగుండాలని అందులో మనము బాగుండాలని , అందరు కలిసి మెలిసి ఎప్పుడు ఇలానే ఉండాలని ప్రతి ఒక్కరికీ పేరుపేరున మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.


న్యాయవాదిగా ఎన్‌రోల్ అయిన బొషేటి సాయి కుమార్

బషీరాబాద్ (వుదయం నవంబర్ 16):

వికారాబాద్ జిల్లా బషీరాబాద్‌కు చెందిన బొషేటి సాయి కుమార్ న్యాయవాద వృత్తిలోకి అడుగుపెట్టారు. హైదరాబాద్‌లోని పదాల రామారెడ్డి లా కళాశాలలో ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో ఐదేళ్ల బి.ఏ. ఎల్.ఎల్.బి. కోర్సును విజయవంతంగా పూర్తిచేసిన ఆయన తాజాగా న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. చిన్ననాటి నుంచే న్యాయరంగంపై ఆసక్తి పెంచుకున్న సాయి కుమార్, తన లక్ష్య సాధన కోసం పట్టుదలతో చదువుకొని న్యాయ విద్యను పూర్తి చేశారు. కుటుంబంలో తొలి న్యాయవాదిగా గుర్తింపు పొందడం పట్ల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. న్యాయవాదిగా తన ప్రస్థానాన్ని ప్రారంభిస్తున్న సాయి కుమార్ భవిష్యత్తులో న్యాయరంగంలో మంచి పేరు సంపాదించాలని, అణగారిన వర్గాలు, పేదలు, సామాన్య ప్రజలకు న్యాయం అందించడంలో తన వంతు పాత్ర పోషించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తండ్రి రాములు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్థులు సాయి కుమార్‌ను అభినందించారు.

సగరులను బీసీ 'ఎ' లోకి మార్చేవరకు ఉద్యమిస్తాం





- కలెక్టరేట్ ముందు నిరసన చేపట్టిన జిల్లా సగర సంఘం
- న్యాయమైన డిమాండ్ల ను నెరవేర్చాలని కలెక్టర్ కు వినతి

హైదరాబాద్,వుదయం

సమాజంలోని అన్ని రంగాలలో అత్యంత వెనుకబాటుకు గురైన సగరులను బిసి 'డి' నుంచి 'ఎ' లోకి మార్చే వరకు ఉద్యమిస్తామని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర అన్నారు. సోమవారం గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం అధ్యక్షుడు మోడల రవి సగర ఆధ్వర్యంలో వందలాదిమంది సగరులు హైదరాబాద్ కలెక్టరేట్ ముందు నిరసనకు దిగారు. సగరులను బీసీ డి నుంచి ఏ లోకి మార్చాలని, సగర ఫెడరేషన్ ను కార్పొరేషన్ గా మార్చి పాలకమండలి ఏర్పాటుతో పాటు నిధులను కేటాయించాలని, 59 జీవోను సవరణ చేసి కూలీలుగా కొనసాగుతున్న సగరులు కాంట్రాక్టర్లుగా ఆర్థికంగా ఎదగడానికి రిజర్వేషన్ సంఖ్య పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేయాలని, 95 శాతం సగరులు నిర్మాణరంగ కార్మికులుగా ఉండటంతో ఆరోగ్య భద్రత కార్డు తో పాటు 50 సంవత్సరాల వయసు పైబడిన సగరులకు పెన్షన్ పథకం అమలు చేయాలని, లోక కళ్యాణార్థం ఒంటి కాలుపై కఠోర దీక్ష చేసి గంగను దివి నుంచి భువికి తీసుకువచ్చిన చరిత్రకారుడు సగర భగీరథ మహర్షి విగ్రహాన్ని రాష్ట్ర రాజధాని ట్యాంక్ బండ్ పై ప్రతిష్టించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన దీక్ష అనంతరం కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర మీడియాతో మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా నిర్మాణరంగ కార్మికులుగా ఆర్థికంగా చతికిల బడి అత్యంత దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని అన్నారు. ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా నాడు జారీ చేసిన 166జీవోను వెంటనే పునరుద్ధరించాలని, లేదా మరో జీ ఓ ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సగరుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర సగర సంఘం ఆధ్వర్యంలో రాబోయే రోజులలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి సానుకూలంగా స్పందిస్తుందనే నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం అధ్యక్షుడు మోడల రవి సగర మాట్లాడుతూ ప్రభుత్వం సగరుల జీవనస్థితిగతులను మెరుగుపరిచేందుకు తమను బిసి ఎ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. శాంతియుత నిరసనల ద్వారా తమ న్యాయమైన డిమాండ్ల ను సాధించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షులు మోడల ఆంజనేయులు సగర, రాష్ట్ర మహిళా సంఘం కోశాధికారి అస్కాని గాయత్రి సగర,లక్ష్మి సగర,చంద్రకళ,గ్రేటర్ కోశాధికారి మర్క సతీష్ సగర, గ్రేటర్ హైదరాబాద్ యువజన సంఘం మాజీ అధ్యక్షుడు ఎర్రంశెట్టి సీతారాం సగర,అంజయ్య నగర్ సగర సంఘం అధ్యక్షుడు దిండి చెన్నయ్య సగర,సలహాదారులు మోడల నరసింహ సగర, బాల స్వామి సగర, మహిళా సంఘం అధ్యక్షరాలు చిలుక రాధా సగర,శివమ్మ,అనిత,మణికొండ సగర సంఘం అధ్యక్షుడు గుంటి వెంకటేష్ సగర,దేవేందర్ సగర, రాయదుర్గం అధ్యక్షుడు బాలరాజు సగర,వేముల రవి,మన్యం,మహిళా సంఘం అధ్యక్షురాలు పద్మ సగర,ఫిల్మ్ నగర్ అధ్యక్షుడు ఈశ్వర్ సగర, ప్రధాన కార్యదర్శి బీచుపల్లి సగర,లింగంపల్లి అధ్యక్షుడు మోడల వెంకటేష్ సగర,ప్రధాన కార్యదర్శి మాదంశెట్టి చంద్రశేఖర్ సగర,కోశాధికారి భీమయ్య సగర,శ్రీరాం నగర్ కాలనీ చిలుక శ్రీకాంత్ సగర,అధ్యక్షుడు ఆవుల బీచుపల్లి సగర,ప్రధాన కార్యదర్శి లింగస్వామి సగర, కోశాధికారి నాగారాజు సగర,మీర్ పేట్ అధ్యక్షుడు దన్ రాజ్ సగర,ప్రవీణ్, ఓం దేవ్ సగర,బాబు రావు సగర,లక్ష్మిగూడ అధ్యక్షుడు శ్రీనివాసులు సగర,ఎల్లమ్మ బండ అధ్యక్షుడు మోడల భీమయ్య సగర,గౌరవ సలహాదారులు రమేష్ సగర,కార్వాన్ ప్రధాన కార్యదర్శి అంబటి అనిల్ సగర,ముఖేష్ సగర,దేవేందర్ నగర్ అధ్యక్షుడు ఉప్పరి రామచందర్ సగర,నరసింహ సగర,తదితర ప్రాంతీయ సగర సంఘాల ప్రతినిధులు, నాయకులు,సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులకు అండగా

నిలిచిన ముప్పు శ్రీనివాస్ రెడ్డి!



వుదయం ప్రతినిధి,కీసర నవంబర్ 16,

ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ లో తెలంగాణ ఉద్యమకారులు చేపట్టిన శాంతియుత నిరసన కార్యక్రమానికి సోమవారం నాగారం డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి సంఘీభావం తెలిపారు.ఉద్యమకారులు చేపట్టిన నిరసన విషయం తెలుసుకున్న ఆయన నిరసన ప్రదేశానికి చేరుకొని వారి ఆందోళనకు మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ఉద్యమకారుల తో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.వారి సమస్యలను మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి,సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరిగేలా తన వంతు ప్రయత్నం చేస్తానని ముప్పు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

బాలానగర్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులు, జాతీయ

రహదారి వంతెన పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ (ఎల్‌బీ)





మహబూబ్ నగర్

బాలానగర్ గ్రామం మరియు మండల పరిధిలో జరుగుతున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులు, జాతీయ రహదారి వంతెన నిర్మాణ పనులను సోమవారం అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) మధుసూదన్ నాయక్ పరిశీలించారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు జరుగుతున్న సమయంలో ప్రజా రవాణాకు ఎలాంటి అంతరాయం కలగకుండా, సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, డిసెంబర్ మొదటి వారం నుంచి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకువస్తామని సంబంధిత వంతెన కాంట్రాక్టర్ హామీ ఇచ్చారు.

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేతుల మీదుగా పింఛన్ల పత్రాల పంపిణీ

నవాబుపేట, నవంబర్ 16: వుదయం

ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మంగళవారం నవాబుపేట మండలంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత పథకంలో భాగంగా నూతనంగా పింఛన్లు మంజూరైన అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు నవాబుపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేష్ తెలిపారు. నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులందరూ సకాలంలో హాజరై పింఛన్ మంజూరు పత్రాలను స్వీకరించాలని ఆయన కోరారు. అదేవిధంగా మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాల నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సురేష్ విజ్ఞప్తి చేశారు.



సిద్దిపేటపై వివక్ష చూపొద్దు

- సీఎం రేవంత్ ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి
- రూ.1,070 కోట్ల అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలి
- రైతు రుణమాఫీ, రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

వుదయం, సిద్దిపేట ప్రతినిధి

సిద్దిపేట జిల్లాపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతో వివక్ష చూపుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. సోమవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 19న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్దిపేట పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ప్రజల పక్షాన పలు డిమాండ్లు చేస్తున్నట్లు తెలిపారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, 45 రోజుల్లో ఇస్తామన్న రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిద్దిపేటకు మంజూరైన వెటర్నరీ కళాశాలను పునరుద్ధరించడంతో పాటు, రద్దు చేసిన, నిలిపివేసిన రూ.1,070 కోట్ల అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించాలని కోరారు. మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, గౌరవెల్లి, ఇర్కోడ్ లిఫ్ట్ ఇరిగేషన్ తదితర సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ పనులను పూర్తి చేసి రైతులకు నీరందించాలని అన్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు పెండింగ్ పరిహారం చెల్లించాలని, అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.రూ.4 వేల పెన్షన్, మహిళలకు నెలకు రూ.2,500, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెయ్యి పడకల ఆసుపత్రి, ఆయుష్ ఆసుపత్రి, రింగ్ రోడ్డు, శిల్పారామం తదితర పెండింగ్ పనులను పూర్తి చేయాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించిన హరీశ్‌రావు, ముఖ్యమంత్రి తనపై రాజకీయ కక్ష ఉంటే తనపైనే చూపాలని, సిద్దిపేట ప్రజలపై చూపవద్దని అన్నారు. ప్రత్యేక ప్రాధాన్యత కోరడం లేదని, ఇప్పటికే ప్రారంభించిన అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.కార్యక్రమంలో ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



బూరుగుపల్లిలో 32 మందికి నూతన పింఛన్ పత్రాల పంపిణీ తోపాటు, స్మార్ట్ రేషన్ కార్డులు అందజేత



కోయిలకొండ, నవంబర్ 16: వుదయం

మండలం బూరుగుపల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన 32 మంది లబ్ధిదారులకు పింఛన్ ప్రొసీడింగ్స్‌తో పాటు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు పింఛన్ పత్రాలు, స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటయ్య, వార్డు సభ్యులు రామకృష్ణ గౌడ్, దూల నర్సింలు, ప్రతాప్ రెడ్డి, వడ్డే నారాయణ, ఎల్ల గౌడ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. నూతనంగా పింఛన్లు, స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.



గ్రేటర్ హైదరాబాద్





సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన కాంగ్రెస్ నాయకులు

- **సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన కాంగ్రెస్ నాయకులు**

కుత్బుల్లాపూర్, నవంబర్ 16,(వుదయం ప్రతినిధి),

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో బాధితులుకు సీఎం సహాయనిధి ద్వారా శస్త్రచికిత్సలు, వైద్య చికిత్సల నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. బాచుపల్లి లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా లబ్దిదారులు బుల్లె ఐలయ్య రూ. 60,000/, గొల్ల మల్లేష్ రూ. 30,000/, ఎస్.రవి బాబు రూ. 45,000/, కాసారానేని శేషగిరి రావు రూ.60,000/, నూర్ మహమ్మద్ రూ.40,000/, మహమ్మద్ యాకుబీ రూ.51,000/, విలువ గల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తోందని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్సలు పొందలేని నిరుపేదలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమం, ఆరోగ్య భద్రతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ సెక్రటరీ పండరి రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మా రెడ్డి, రషీద్, ప్రసన్న కుమార్, డప్పు నరేందర్, మహమ్మద్ గఫ్ఫార్ తదిత రులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిది

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




కేశంపేట (వుదయం ప్రతినిధి
నవంబర్ 16)

అనారోగ్యానికి గురైన పేద ప్రజలకు సీఎం సహాయనిధి వరంలా పని చేస్తుందని ఎమ్మెల్యే విర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన రూ.4,66,500 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ

పేద ప్రజలకు అండగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తూ,అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసా కల్పిస్తుందన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిలుస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనుమగల్ల రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, సర్పంచ్ లు నరేందర్ రెడ్డి, సర్పంచ్ సువర్ణ నర్సింలు,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పిప్పళ్ళ శ్రీనాథ్,ఎన్సీ సెల్ అధ్యక్షుడు భీమయ్య, కిసాన్ సెల్ అధ్యక్షుడు కోడూరు రాములు, వార్డు సభ్యులు నర్సింహులు, అంజయ్య, మల్లేష్, గణేష్ తదితర నాయకులు పాల్గొన్నారు

శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే మల్లారెడ్డి



- **ఆలయ ప్రాంగణంలో ఏకబిల్వం,ఉసిరి మొక్కలు నాటిన ఎమ్మెల్యే**

వుదయం ప్రతినిధి కీసర,
నవంబర్ 16:

కార్తీక మాసం,చివరి కార్తీక సోమవారం సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే,మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి కీసర మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా స్వామివారికి సతీస మేతంగా అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఆలయ అర్చకుల ఆశీర్వచనాలు స్వీకరించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి భక్తితో పూజలు నిర్వహించారు.ప్రతి ఇంట ఉసిరి.. ప్రతి గుడిలో బిల్వం

మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా రూపొందించిన 'ప్రతి ఇంట ఉసిరి.. ప్రతి గుడిలో బిల్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఏకబిల్వం,ఉసిరి మొక్కలను నాటారు.


భక్తి మార్గమే ముక్తి మార్గం ... మరో మారు తన దైవభక్తిని చాటుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్..

- **ఆలయ నిర్మాణానికి రూ.70 లక్షల సొంత నిధులు కేటాయింపు..**
- **సుల్తాన్పూర్ లో ఘనంగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి, రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం..**
- **భవిష్యత్తులోనూ ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం..**

అమీన్పూర్ నవంబర్ 16 వుదయం

పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మరోమారు తన దైవభక్తిని చాటుకున్నారు. పటాన్చెరు నియోజకవర్గ వ్యాప్తంగా పరమత సహనాన్ని పెంపొందిస్తూ.. సొంత నిధులతో ఆలయాలు, చర్చిలు, మసీదులు నిర్మిస్తూ ప్రతి ఒక్కరిలో దైవభక్తిని పెంపొందిస్తున్నారు. తాజాగా పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ డివిజన్ పరిధిలోని సుల్తాన్పూర్ గ్రామంలో 70 లక్షల రూపాయల సొంత నిధులతో శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి, రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయాలను నిర్మించి మరోపారు తన దైవభక్తిని చాటుకున్నారు.సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించిన దేవత విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి, అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని భక్తులతో మమేకమయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు దేవాలయాలు ప్రతీకలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా ప్రజల్లో భక్తిభావాన్ని, సామాజిక ఐక్యతను పెంపొందించే పవిత్ర ప్రదేశాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణం, అభివృద్ధి ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించవచ్చని తెలిపారు.



సుల్తాన్పూర్ గ్రామంలో భక్తుల చిరకాల ఆకాంక్ష మేరకు 70 లక్షల రూపాయలతో నూతన దేవాలయాలు నిర్మించినట్లు తెలిపారు. భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణం పూర్తి చేసుకొని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహించుకోవడం సంతోషకరమని అన్నారు.

రాబోయే రోజుల్లోనూ దేవాలయ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం అందిస్తానని, ఆలయానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలందరూ భక్తి, ఐకమత్యంతో ముందుకు సాగుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ ఛైర్మన్ నరసింహ గౌడ్, మాజీ సర్పంచ్ రాజు, పాండు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ నియోజకవర్గంలో 1,459 మందికి నూతనంగా పెన్షన్లు మంజూరు

సికింద్రాబాద్ కంటోన్మెంట్ 16 : వుదయం

సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమం బాలం రాయిలోని లీ ప్యాలెస్ లో నిర్వహించారు. తిరుమలగిరి మండల పరిధిలో 833 మందికి,మారేడ్‌పల్లి మండలంలో 161 మందికి, సికింద్రాబాద్ మండలంలో 465 మందికి కలిపి మొత్తం 1,459 మందికి నూతనంగా పెన్షన్లు మంజూరయ్యాయి.

ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల, కంటోన్మెంట్ శాసన సభ్యులు శ్రీగణేష్, నామినేటెడ్ సభ్యులు భానుక నర్మదా మల్లికార్జున్ హాజరయ్యారు...ఎమ్మెల్యే శ్రీగణేష్ లబ్ధిదారులకు కలెక్టర్ గారితో కలిసి మంజూరైన పెన్షన్ పత్రాలను అందజేశారు...

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం నిరంతరం ఆలోచించే వ్యక్తి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని, అర్హులైన పేదలకు నూతనంగా పెన్షన్లు మంజూరు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజా పాలనలో అర్హులైన ప్రతి పేద వారికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.



పెన్షన్ అనేది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, అది ప్రతి లబ్ధిదారుడికి ఆత్మగౌరవం, ఆర్థిక భరోసా అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మహిళల పట్ల ఎంతో గౌరవం ఉందని, అందుకే మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ పథకాలకు ఇందిరమ్మ పేరును పెడుతున్నారని అన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను అప్పులపాలు చేసిందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఒక్కొక్కటిగా హామీలను అమలు చేస్తోందని తెలిపారు.

కంటోన్మెంట్ నియోజకవర్గంలో సుమారు 2,000 మంది నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోగా, అర్హత కలిగిన 1,459 మందికి పెన్షన్లు మంజూరు కావడం సంతోషకరమని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సాయిరామ్, తిరుమలగిరి ఎమ్మార్వో బిక్షపతి, సికింద్రాబాద్ ఎమ్మార్వో పాండు నాయక్ మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు



ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత – జిల్లా కలెక్టర్

రంగారెడ్డి జిల్లా ,నవంబర్ 16 వుదయం



ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ప్రజావాణి ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తును సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి అర్జీలు సమర్పించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా, ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 96 ఫిర్యాదులు అందగా, వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 54, ఇతర శాఖలకు సంబంధించి 42 దరఖాస్తులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారద దేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 21 రోజుల సైక్లింగ్ యాత్ర

దేశభక్తి, ఆరోగ్యం, డ్రగ్స్ రహిత భారత్ మా లక్ష్యం!
కాప్రా (వుదయం ప్రతినిధి)
నవంబర్ 16, హైదరాబాద్

దేశభక్తి, ఆరోగ్యంపై అవగాహన, మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ (HCG) ఆధ్వర్యంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైక్లింగ్ యాత్ర నిర్వహించనున్నారు. నవంబర్ 19న కాశ్మీర్‌లో ప్రారంభం కానున్న ఈ యాత్రలో తొమ్మిది మంది సైక్లిస్టులు పాల్గొని, 21 రోజుల పాటు సుమారు దేశమంతటా ప్రయాణించి కన్యాకుమారికి చేరుకోనున్నారు. HCG మార్గదర్శకులు శ్రీ రవీందర్ నందనూరి నేతృత్వంలో ఇప్పటికే మూడు విజయవంతమైన ఎడిషన్లు నిర్వహించగా, ఇది నాలుగో ఎడిషన్ కావడం విశేషం. భారత సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లకు నివాళులర్పించడం ఈ యాత్ర ప్రధాన ఉద్దేశం. అదేవిధంగా, భారత ప్రభుత్వ 'నషా ముక్త్ భారత్ అభియాన్' లో భాగంగా యువతకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తూ, "డ్రగ్స్‌కు నో చెప్పండి - ఆరోగ్యానికి, క్రీడలకు, మంచి భవిష్యత్తుకు యస్ చెప్పండి" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు.



సైక్లింగ్ ద్వారా శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, మానసిక ఆరోగ్యం పెంపొందించుకోవచ్చని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఈ బృందం పిలుపునిస్తోంది."మా ప్రయాణం సైక్లింగ్ కోసం మాత్రమే కాదు... వీర జవాన్లకు నివాళి, యువతకు స్ఫూర్తి, డ్రగ్స్ రహిత భారతదేశం కోసం మా సంకల్పం!"అనే నినాదంతో ఈ తొమ్మిది మంది తమ సాహస యాత్రను ప్రారంభించనున్నారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు నేమూరి మహేష్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గంప కృష్ణ, ఎంకిరాల నర్సింహా, యాదగిరి, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు

ఎల్లమ్మ తల్లి జాతరకు ప్రజాప్రతినిధులకు ఆహ్వానం

గుమ్మడిదల, నవంబర్ 16 (వుదయం):

గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామ పరిధిలో ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించనున్న ఎల్లమ్మ తల్లి మూడో వార్షికోత్సవ వేడుకలకు హాజరుకావాలని ఆలయ నిర్వాహకులు మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, కమిషనర్ దశరథ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యతో పాటు వార్డు కౌన్సిలర్లను కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, వార్షికోత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

TUWJ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా వి. ఆనంద్ ఎన్నిక

గుమ్మడిదల, నవంబర్ 16 (వుదయం):



తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (TUWJ143) నూతన జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన వి. ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో తెలంగాణ జర్నలిస్టుల గొంతుక వినిపించేందుకు, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ ఎన్నికలో సహకరించిన సంగారెడ్డి జిల్లా నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో పత్రికా రంగం పాత్ర అభినందనీయం: చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

గుమ్మడిదల, నవంబర్ 16 (వుదయం):



జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా పాత్రికేయులందరికీ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా రంగం నాలుగో స్తంభంగా కీలక పాత్ర పోషిస్తోందని, ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ నిజాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తున్న పాత్రికేయుల సేవలు ప్రశంసనీయమని అన్నారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు, సమాజ అభివృద్ధికి పత్రికా రంగం మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.


IN THE COURT OF THE HON'BLE XXI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT ,AT: HYDERABAD
O.S.No. 3229 OF 2026
Between :
Sri. Lalith Kumar & 3 Others ...Plaintiffs
AND
1.The Mandal Revenue Officer, Ameerpet, Hyderabad. 2.All Concerned. ...Defendants
To the public at large and whomsoever concerned.
WHEREAS the above named Plaintiffs have filed O.S.No.3229 of 2026, before this Court, praying to declare them as the only legal heirs of Late.Smt. Pushpalata, who expired on 04.02.2025, who are the Class-I, Legal Heirs. WHEREAS this Court ordered notice by publication in News Paper, concerning public at large and whosoever concerned. IT IS HEREBY informed that if anybody having objections with regard to the above said suit, they may put forth their claim before the above said Hon'ble Court by 10:30 AM on 08.12.2026, if objections are not received by then, the matter will be heard and decided Ex Parte in your absence IF ANYBODY wants information in this regard they can have such information from the Advocate whose particulars are mentioned hereunder:
(BY ORDER OF THE COURT)
Sd/-
Sri T.NATRAJ,
K.RAJANI,
K.Abhishek,
Advocates
Plot No.5, Phase-I, Kamalapuri Colony, Hyderabad-500 073.
Mobile: 8885928245

IN THE COURT OF THE HON'BLE IV ADDL. JUNIOR CIVIL JUDGE-CUM-XV ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS : MEDCHAL-MALAKAJGIRI DISTRICT : AT KUKATPALLY
O.S. No. 1352 OF 2022
Between :
State Bank of India, Kukatpally Branch ...PLAINTIFF
AND
Mr. SATYA SAI RAM DEVARAPU ...DEFENDANT
To
Mr. SATYA SAI RAM DEVARAPU C/o. The Chennai Shopping Mall, Empl ID 9460, Kukatpally, Hyderabad, Ranga Reddy Dist - 500 072
Please take notice that the above mentioned Plaintiff filed above Suit for Recovery of Money of Rs. 3,39,900/- against Defendant, and the matter is posted for your appearance on 07-12-2026. Therefore, make it convenient to appear before the above said Hon'ble Court on 07-12-2026 at 10-30 a.m. either in person or through counsel or else the matter will be heard as per law in your absence
// BY ORDER OF THE COURT //
Sd/-
SAKA MOHAN RAO,
Advocate No. 4-4-3/6, Abhudaya Nagar Colony, Bandlaguda Jagir, Hyderabad. Cell : 9440543623

IN THE COURT OF THE HONOURABLE CHAIRMAN MACT - -CUM - III ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD
M.V. O.P. No. 272 of 2025
Between :
Rupani Naveen Kumar ... Petitioner/Claimant
AND
1. Bontha Shiva & anor., ... Respondents
NOTICE
To
Bontha Shiva s/o Eshwar, aged about 30 yrs, occ: working as Driver in L & T Company, R/o H.NO. 12-15-88/B, Manikeshwar nagar, OU- Campus, Tarnaka, Hyderabad
TAKE NOTICE that the above-named Petitioner/claimant has filed the above MVOP no. 272 of 2025 against you and another before the above Hon'ble Court. You are hereby informed that the said case is posted on 01-12-2026 at 10:30 A.M.
You are hereby directed to appear before the Hon'ble III ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD on the said date and time, either in person or through a duly authorized counsel. In the event of your failure to appear, the Hon'ble Court shall proceed to pass appropriate orders in your absence, as deemed fit. Hence this notice.
// BY ORDER OF THE HON'BLE COURT //
Sd/-
A.SAMPATH KUMAR
Advocate
H.No.1-3-183/40/21/48, Gandhinagar, HYDERABAD, TELANGANA-80
Cell no.9848281019

IN THE COURT OF THE HON'BLE II ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURT, AT: HYDERABAD
I.A.No. 1506 OF 2026
IN
O.S. NO. 68 OF 2022
Between :
J. Prasad ...Petitioner/Defendant No.2
AND
1. B. Kavita ... Respondent No.1/Plaintiff No.1
2. G. Deepa Yadav ...Respondent No.2/ Plaintiff No.2
3. J. Saraswathi ...Respondent No.3/ Defendant No.1
4. A. Varalakshmi ...Respondent No.4/ Defendant No.3
5. Mancha Prema ...Respondent No.5/ Proposed defendant No.4
6. Gaddam Sunitha ... Respondent No.6/ Proposed defendant No. 5
7. Ragam Anitha ... Respondent No.7/ Proposed defendant No.6
8. Godha Padma ...Respondent No.8/ Proposed defendant No.7
9. Gellaboina Madhavilatha ...Respondent No.9/ Proposed defendant No.8
The Hon`ble court passed orders in I.A. No. 1506/2026 on 04-11-2026 against the Gellaboina Madhavilatha, Respondent No.9/ Proposed defendant No.8 to intimate the date of hearing in IA No. 1506/2026 is posted on 15-12-2026. You are hereby informed to appear before the Hon`ble court.
//By order of the court//
Sd/-
Counsel for the petitioner/ Defendant No.2
Sri B.V.V.S. Murthy
Sri P. Pradeep Kumar
Advocates 3-4-226/4 & 5 Lingampally, Kachiguda, Hyderabad

IN THE COURT OF III SENIOR CIVIL JUDGE : C.C.C.: AT: SECUNDERABAD
S.O.P.No. 22 of 2026
Between :
1. Anne Vijaya Kumar 2. Annay Ravi Kumar 3. Anne Ashok Kumar 4. Smt.Latha Kishore ....Petitioners
AND
1. Smt. A.Padmavathi 2. Akshaya 3. Smt. A.Bhagyavathi 4. A. Sanyal 5. A. Shilpa 6. A. Swetha 7. Canara Bank Patny Circle,R.P.Road,Sec'bad. Rep. by its Bank Manager. 8. All Concerned ..Respondents
To,
All concerned
Take notice that the above named Petitioners have filed S.O.P. for the grant of succession certificate in respect of the debt/amount lying in the Savings A/c. No. 30182010066679, Canara Bank # Secunderabad Patny circle, Rashtrapathi Road, Secunderabad-500003, for an amount of Rs.6,88,886.49/-standing in the name of Late.Jaya surya Anne. Any person having any manner of right, claim or interest over the afore-said debts or objection for grant of succession in favour of petitioners, is required to attend the Hon'ble III Senior civil Judge, At: Secunderabad., either in person or through an Advocate on 28-12-2026 at 10.30. am to put forward his/ her claim in the above S.O.P lest the matter will be decided basing on the material available on record .
//By Order of Hon'ble court//
Sd/-
M/s.Y.Sudershan Reddy
C.Naresh
K.Sudeep Reddy Advocates .
[Counsel for Petitioners.]




యువత క్రమంగా సోషల్ మీడియాకు బానిసలు అవుతున్నారు. సామాజిక మాధ్యమాల వాడకం విపరీతంగా పెరుగుతున్నది. చివరకు అవి ఓ వ్యసనంలా మారిపోతాయి. వీటి వల్ల యువతలో ఉన్న నైపుణ్యాలు, సృజనాత్మకత, చైతన్యం వంటివి మరుగున పడిపోతున్నాయి. అవసరం మేరకే సోషల్ మీడియాను వినియోగించాలి. ప్రజల్లో కులం, మతం పేరుతో అంతర్గత కలహాలను రెచ్చగొట్టి దేశాన్ని విభజించడానికి కొందరు జాతివ్యతిరేకులు ప్రయత్నిస్తున్నారు. ఇవి బ్రిటిష్ పాలనలోని విభజించు పాలించు అనే విధానంలా ఉన్నాయి.

- మోహన్ భాగవత్, ఆర్ఎస్ఎస్ చీఫ్

వే'మన' పద్యం

ఉప్ప లేని కూర హీనంబు రుచులకు
పప్పలేని తిండి ఫలములేదు
యప్పలేనివాడె యధిక సంపన్నుండు
విశ్వదాభిరామ వినురవేమ




సంపాదకీయం

ప్రశ్నించే గొంతుకలపై ఎందుకీ కక్ష?

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరం కాదు.. పాలకులను నిలదీయడం పౌరుల హక్కు. ప్రభుత్వ విధానాలను విమర్శించడం, అధికారంలో ఉన్నవారిని జవాబుదారీగా నిలబెట్టడం స్వేచ్ఛాయుత సమాజానికి ప్రాణాధారం. కానీ ప్రశ్నించే గొంతుకలనే లక్ష్యంగా చేసుకుంటే ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. ప్రస్తుతం భారత్‌లో పత్రికా స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ చుట్టూ నెలకొన్న పరిణామాలు ఇలాంటి ఆందోళనలనే రేకెత్తిస్తున్నాయి. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌కు 70 దేశాల నుంచి దాదాపు వెయ్యిమంది ప్రతినిధులను ఆహ్వానించినప్పటికీ, 315 మంది విదేశీ ప్రతినిధులకు వీసాలు నిరాకరించారన్నవార్తలు తీవ్ర చర్చకు దారితీశాయి. వీరిలో నార్వేకు చెందిన జర్నలిస్టు హెల్లే లీంగ్ స్టెన్‌సెన్ కూడా ఉండటం మరింత వివాదాస్పదమైంది. 'మీడియా భవిష్యత్తు.. పత్రికా స్వేచ్ఛ' అనే అంశంపై ప్రసంగించాల్సిన ఆమె వీసా చివరి నిమిషంలో రద్దు కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. వీసా రద్దుకు గల కారణాలను అధికారికంగా వెల్లడించకపోవడం ఈ వివాదాన్ని మరింత తీవ్రం చేసింది.ప్రధాని నరేంద్ర మోదీని ప్రశ్నించినందుకే తనపై ఈ చర్య తీసుకున్నారని ఆమె ఆరోపిస్తున్నారు. 2026 మే 18న నార్వే రాజధాని ఓస్లోలో జరిగిన మీడియా కార్యక్రమంలో ప్రధాని మోదీ, నార్వే ప్రధాని జోనాస్ గార్ స్టోర్‌తో కలిసి పాల్గొన్న సందర్భంలో మీడియా ప్రశ్నలకు ఎందుకు సమాధానాలు ఇవ్వడం లేదని ఆమె నిలదీశారు ఈ రెండింటి మధ్య సంబంధం ఉందన్న ఆరోపణలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. 2014 నుంచి దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించిన అనేక పరిణామాలు చర్చనీయాంశమవుతున్నాయి. 2019లో కశ్మీర్‌లో ఇంటర్నెట్ సేవల నిలిపివేత ప్రజల సమాచార హక్కుపై తీవ్ర ప్రభావం చూపింది. 2023లో గుజరాత్ అల్లర్లపై బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీ ప్రసారంపై ఆంక్షలు విధించడం, ఆ సంస్థ కార్యాలయాల్లో ఆదాయపు పన్ను శాఖ తనిఖీలు నిర్వహించడం విమర్శలకు దారితీశాయి. జాతీయ భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో ప్రభుత్వాలు తీసుకునే చర్యలు రాజ్యాంగబద్ధమైనవేనా? వాటి అమలులో పౌర హక్కులకు తగిన రక్షణ ఉందా? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాలి. భారత దేశం భిన్న మతాలు, భాషలు, సంస్కృతుల సమ్మేళనం. ఇలాంటి వైవిధ్యభరిత సమాజంలో భిన్నాభిప్రాయాలకు గౌరవం ఇవ్వడం అత్యంత అవసరం. ఈ అంశాల్లో ప్రభుత్వానికి బాధ్యతలు ఉన్నప్పటికీ, ఆంక్షలు అవసరమైనవేనా? అవి సముచితమైనవేనా? వాటి కాలపరిమితి ఎంత? అనే అంశాలపై పారదర్శకత ఉండాలి. ఫ్రీడమ్ హౌస్ వంటి అంతర్జాతీయ సంస్థలు భారతదేశంలో ఆన్‌లైన్ స్వేచ్ఛపై ఆంక్షలను ప్రస్తావించడం కూడా ఈ చర్చకు ప్రాధాన్యతను చేకూరుస్తోంది. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం కూడా మీడియా రంగంలో చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత సమాచార పరిరక్షణ ప్రతి పౌరుడి హక్కు. అయితే అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగంపై పరిశోధనాత్మక కథనాలు ప్రచురించే జర్నలిస్టులకు ఈ చట్టం ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది కీలక ప్రశ్న. సమాచార సేకరణ, పరిశోధన, ప్రజా ప్రయోజనాల కోసం వివరాల ప్రచురణ వంటి అంశాల్లో స్పష్టమైన రక్షణలు లేకపోతే పరిశోధనాత్మక జర్నలిజం బలహీనపడే ప్రమాదం ఉంది. వ్యక్తిగత గోప్యతను కాపాడటం ఎంత ముఖ్యమో, ప్రజా ప్రయోజనాల కోసం అధికార వ్యవస్థను ప్రశ్నించే మీడియాకు రక్షణ కల్పించడం కూడా అంతే ముఖ్యం. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు శాశ్వతం కావు. కానీ రాజ్యాంగ విలువలు, పౌర హక్కులు, భావ ప్రకటనా స్వేచ్ఛ శాశ్వతంగా కొనసాగాలి. పాలకులు విమర్శలను శత్రుత్వంగా భావించకూడదు. జర్నలిస్టులు అడిగే ప్రశ్నలను వ్యక్తిగత అవమానంగా తీసుకోకూడదు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం దేశద్రోహం కాదు.. అది ప్రజాస్వామ్య బాధ్యత. భారత్ వంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం అంతర్జాతీయ వేదికలపై తన ప్రజాస్వామ్య విలువలను గర్వంగా చాటుకుంటోంది. అలాంటప్పుడు దేశంలోనూ విమర్శలకు, స్వతంత్ర జర్నలిజానికి, భిన్నాభిప్రాయాలకు సమానమైన గౌరవం లభించాలి. ఒక జర్నలిస్టు వీసా రద్దు వివాదమైనా, మీడియా సంస్థలపై చర్యలైనా, సామాజిక మాధ్యమాలపై ఆంక్షలైనా.. ప్రతి అంశంలోనూ పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరి.

రచనలు పంపండి




వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

బాలసాహిత్యంలో మరో వేకువ కిరణం.. సాగర్ల శ్రీ

"బాల్యం ఒక రంగుల ప్రపంచం".ఆ ప్రపంచంలో ప్రతి ఆలోచన ఒక ప్రశ్నగా మొలకెత్తుతుంది. ప్రతి ప్రశ్న ఒక అన్వేషణకు నాంది పలుకుతుంది. పిల్లల మనసు స్వచ్ఛమైన సరస్సు వంటిది. అందులో కనిపించే ప్రతి దృశ్యం ఒక కొత్త ఆలోచనకు ప్రేరణనిస్తుంది. ముఖ్యంగా బాల్యంలో ప్రకృతిని పరిశీలించడం, సమాజంలోని పరిణామాలను గమనించడం, వాటి వెనుక ఉన్న కారణాలను తెలుసుకోవాలనే ఆసక్తి పిల్లల్లో సహజంగా కనిపిస్తుంది. అలాంటి బాలల సహజ జిజ్ఞాసకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సరైన దిశానిర్దేశం చేస్తే ప్రతి బాలుడు సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరుడిగా ఎదుగుతాడు. ఈ ఆలోచనలకు అక్షరరూపమే సాగర్ల శ్రీ వర్ధన్ రచించిన 'రంగుల కలలు'బాలల కథల సంపుటి.బాల్యంలోనే తన చుట్టూ ఉన్న కుటుంబ వాతావరణం, గురువుల మార్గదర్శకత్వం, ప్రకృతి సౌందర్యం, సామాజిక పరిస్థితులు, పండుగలు, సంప్రదాయాలు, దేశభక్తి వంటి అనేక అంశాలను పరిశీలించి, వాటి నుంచి తాను నేర్చుకున్న అనుభవాలను కథలుగా మలచడం శ్రీ వర్ధన్ సృజనాత్మక ప్రతిభకు నిదర్శనం. ఇంట్లో సాహిత్య వాతావరణం ఉండటం ఒక ప్రేరణ అయితే, ఆ ప్రేరణను తన స్వీయ ఆలోచనాశక్తితో సాహిత్య సృజనగా మలచుకోవడం అతని ప్రత్యేకత. కుటుంబంపై ప్రేమ, గురువుల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యత, చదువుపై ఆసక్తి, ప్రకృతిపై మమకారం, దేశం పట్ల భక్తి వంటి భావాల సమాహారమే అతని కథా రచనలకు పునాదిగా నిలిచిందని ఈ సంపుటిని పరిశీలిస్తే అర్థమవుతుంది.

"చదువే జీవితానికి వెలుగుబాట'.'రంగుల కలలు' సంపుటిలోని పదిహేడు కథలు బాలల మనస్తత్వానికి దగ్గరగా ఉంటూనే, సమాజంలోని వాస్తవ పరిస్థితులను ఆలోచింపజేసేలా సాగుతాయి. ముఖ్యంగా 'చదివే లక్ష్యం'కథలో విద్య యొక్క ప్రాధాన్యతను హృద్యంగా ఆవిష్కరించాడు రచయిత. చదువుకోవాలనే తపన ఉన్న పిల్లలకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారుతుంటే, చదువుకునే అవకాశం, ఆర్థిక స్థోమత ఉన్న కొందరిలో చదువుపై ఆసక్తి కొరవడటం సమాజంలోని వైరుధ్యాన్ని తెలియజేస్తుంది. విద్య అనేది కేవలం ఆర్థిక స్థోమతతో లభించేది కాదని, దానికి ఆసక్తి, పట్టుదల, లక్ష్యం అవసరమని ఈ కథ సందేశాన్నిస్తుంది. చదువుకోవాలనే ఆకాంక్ష ఉన్నప్రతి బాలుడికి సమాజం అండగా నిలవాలనే అంతర్లీన సామాజిక సందేశం ఇందులో కనిపిస్తుంది.నేటి సాంకేతిక నాగరికత మనిషికి ఎన్నో సౌకర్యాలను



అందిస్తున్నప్పటికీ, ప్రకృతికి దూరం చేస్తోంది. పట్టణీకరణ, రియల్ ఎస్టేట్ వ్యాపారం, అపార్ట్‌మెంట్ల నిర్మాణం పేరుతో చెట్లను నరికివేయడం, పచ్చదనాన్ని కనుమరుగు చేయడం పర్యావరణ సమతుల్యతకు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రచించిన 'ప్రకృతి సౌందర్యం'కథలో ప్రకృతితో మానవ జీవితానికి ఉన్న విడదీయలేని అనుబంధాన్ని రచయిత చక్కగా తెలియజేశాడు.ప్రకృతి నశిస్తే మనిషిమనుగడ కూడా ప్రశ్నార్థకమవుతుందని, చెట్లు, పక్షులు, పూలు, పచ్చని పొలాలు, స్వచ్ఛమైన గాలి మన జీవితానికి ఎంత అవసరమో బాలల మనసులకు అర్థమయ్యే రీతిలో వివరించాడు. పర్యావరణ పరిరక్షణ అనేది పెద్దల బాధ్యత మాత్రమే కాదని, బాల్యం నుంచే ప్రతి ఒక్కరిలో ఆ స్పృహ కలగాలని ఈ కథ సూచిస్తుంది.బాలల వ్యక్తిత్వ వికాసంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనది. 'తనీష్'అనే విద్యార్థి బడికి వెళ్లకుండా తిరగడం, బడికి తీసుకువచ్చే పిల్లలను కొట్టడం, తిట్టడం, అల్లరి చేయడం వంటి ప్రవర్తనతో ఉంటాడు. అలాంటి బాలుడిని శిక్షించడం ఒక్కటే పరిష్కారం కాదని, ప్రేమతో, సహనంతో, మంచి కథల ద్వారా అతనిలో మార్పు తీసుకురావచ్చని ఆనంద్ సారు పాత్ర ద్వారా రచయిత తెలియజేశాడు. చదువు విలువను, జీవిత లక్ష్యాన్ని అర్థమయ్యేలా చెప్పి తనీష్‌ను మంచి విద్యార్థిగా తీర్చిదిద్దడం గురువు యొక్క గొప్పతనాన్ని చాటుతుంది. పిల్లల ప్రవర్తన వెనుక ఉన్న కారణాలను అర్థం చేసుకొని, వారి ఆలోచనలకు సానుకూల దిశ చూపగలిగినప్పుడే ఉపాధ్యాయ వృత్తికి సార్థకత చేకూరుతుందని ఈ కథ తెలియజేస్తుంది.పండుగలు మన సంస్కృతికి ప్రతిబింబాలు. అయితే కాలక్రమంలో పండుగల అసలు స్ఫూర్తి కనుమరుగవుతూ, కృత్రిమ రంగులు, రసాయన పదార్థాలు, పర్యావరణానికి హాని కలిగించే వస్తువులు వాటి స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. 'హోలీ'కథలో యశ్వంత్ తన స్నేహితులతో కలిసి రసాయన రంగులతో హోలీ ఆడటం వల్ల కళ్లకు అనారోగ్యం కలుగుతుంది. ఈ సంఘటన ద్వారా రసాయన రంగుల వల్ల కలిగే ప్రమాదాన్ని రచయిత తెలియజేశాడు. యశ్వంత్ నాయనమ్మ పూలు, ఆకుల నుంచి సహజమైన రంగులను తయారుచేసుకొని హోలీ జరుపుకునే సంప్రదాయాన్ని వివరిస్తుంది.ప్రకృతిలో లభించే పూల రంగులతో పండుగలు జరుపుకోవడం ఆరోగ్యానికి, పర్యావరణానికి మేలు చేస్తుందని తెలియజేయడం ఈ కథలోని విశిష్టత. సంప్రదాయాలను కాపాడుకోవడమంటే వాటి వెనుక ఉన్న ప్రకృతి హితమైన జీవన విధానాన్ని కూడా కొనసాగించడమేనని రచయిత గుర్తుచేస్తున్నాడు.భక్తి అనేది మనిషికి ఆత్మవిశ్వాసాన్ని, మానసిక ప్రశాంతతను అందించే గొప్ప భావన. అయితే భక్తి పేరుతో మూఢత్వానికి, అర్థరహిత ఆచారాలకు ప్రాధాన్యత ఇవ్వడం సమాజ అభివృద్ధికి ఆటంకం. శివరాత్రి కథ ద్వారా భక్తిలోని మూఢనమ్మకాలను ప్రశ్నిస్తూ, ఆలోచనాత్మక దృక్పథాన్ని పిల్లల్లో పెంపొందించే ప్రయత్నం చేశాడు రచయిత. భక్తి వెనుక జ్ఞానం ఉండాలి, ఆచారాల వెనుక అర్థం ఉండాలి అనే భావన ఈ కథలో అంతర్లీనంగా కనిపిస్తుంది.భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశం. రైతు కష్టం మీదే సమాజపు ఆహార భద్రత ఆధారపడి ఉంది. అయినప్పటికీ రైతు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, ప్రకృతి వైపరీత్యాలు, పంట నష్టాలు, సామాజిక సమస్యలు అనేకం.రైతుల బాధలను ఇతివృత్తంగా తీసుకొని రచించిన కథ ద్వారా వ్యవసాయం పట్ల గౌరవాన్ని, రైతు శ్రమ పట్ల కృతజ్ఞతను బాలలలో పెంపొందించే ప్రయత్నం కనిపిస్తుంది. రైతు కష్టాన్ని అర్థం చేసుకోవడం, ఆహారాన్ని వృథా చేయకుండా ఉండటం, వ్యవసాయానికి గౌరవం ఇవ్వడం వంటి విలువలను బాలలకు పరిచయం చేయడం ఈ కథలోని సామాజిక ప్రయోజనం.

వినాయక చవితి సందర్భంగా ప్లాస్టిక్ తో కెమికల్ కలర్స్ తో తయారుచేసిన విగ్రహాలు, రసాయన రంగులు, ఇతర హానికర పదార్థాల వినియోగం వల్ల చెరువులు, నదులు కలుషితమవుతున్నాయి. పండుగల పేరుతో ప్రకృతికి హాని కలిగించకూడదనే సందేశాన్ని మరో కథ ద్వారా రచయిత అందించాడు. మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించడం, పర్యావరణానికి అనుకూలమైన పద్ధతుల్లో పండుగలు జరుపుకోవడం వంటి అంశాలను బాలలకు తెలియజేయడం ద్వారా పర్యావరణ స్పృహను పెంపొందిస్తున్నాడు. పండుగల ఆనందం ప్రకృతికి నష్టం కలిగించకుండా ఉండాలనే సందేశం నేటి సమాజానికి ఎంతో అవసరం.ఈ కథా సంపుటికి ప్రముఖ బాలసాహితీవేత్త గరిపల్లి అశోక్ 'ప్రవరథమానం.. శ్రీ వర్ధన్'అనే శీర్షికతో పరిచయ వ్యాసాన్ని అందించారు. బాల రచయితలోని సృజనాత్మకతను, ఆలోచనా పరిణతిని ప్రస్తావిస్తూ ప్రోత్సాహాన్ని అందించారు. అలాగే సృజన సాహితీ అధ్యక్షులు పెరుమాళ్ల ఆనంద్ 'కథ వర్ధనం'అనే శీర్షికతో రాసిన వ్యాసంలో నల్లగొండ నేలతో తెలుగు కథా సాహిత్యానికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేశారు. తెలుగు తొలి కథా రచయిత్రిగా బండారు అచ్చమాంబను ప్రస్తావిస్తూ, అదే కథా సాహిత్య పరంపరలో నేడు సాగర్ల శ్రీ వర్ధన్ తన కథలతో ముందుకు రావడాన్ని అభినందించారు.అలాగే శీలం భద్రయ్య తన అభిప్రాయంలో సాహిత్యం మనిషికి సారథిగా, బయట ప్రపంచానికి వారధిగా నిలుస్తుందని పేర్కొంటూ, బాల్యంలోనే ఏర్పడే ఆలోచనలు భావి జీవితానికి మార్గదర్శకాలని తెలియజేశారు. ఈ ముగ్గురి అభిప్రాయాలు బాల రచయితకు ప్రోత్సాహాన్ని అందించడమే కాకుండా, బాలసాహిత్యానికి ఉన్న సామాజిక ప్రాధాన్యతను కూడా గుర్తుచేస్తున్నాయి.బాలసాహిత్యం అంటే కేవలం పిల్లలను వినోదపరిచే కథల సమాహారం కాదు. వారి ఆలోచనలకు పదును పెట్టే సాధనం. మంచి చెడులను విశ్లేషించే విచక్షణను కలిగించే మార్గం. ప్రకృతిని ప్రేమించడం, గురువులను గౌరవించడం, రైతు శ్రమను గుర్తించడం, పర్యావరణాన్ని కాపాడటం, మూఢనమ్మకాలను ప్రశ్నించడం, చదువు విలువను తెలుసుకోవడం వంటి అనేక జీవన విలువలను పిల్లలకు చేరవేసే శక్తి బాలసాహిత్యానికి ఉంది.ఆ కోణంలో చూస్తే సాగర్ల శ్రీ వర్ధన్ రచించిన 'రంగుల కలలు' కేవలం పదిహేడు కథల సంపుటి మాత్రమే కాదు. బాలల మనసుల్లో మంచి ఆలోచనల విత్తనాలు నాటే ప్రయత్నం. చిన్న వయసులోనే తన చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలించి, తన అనుభవాలను కథలుగా మలచడం అభినందనీయం. కథల్లోని పాత్రలు, సంఘటనలు, సందేశాలు బాలల ప్రపంచానికి దగ్గరగా ఉంటూ వారిని ఆలోచింపజేస్తాయి.

భవిష్యత్తులో మరింత విస్తృతమైన పఠనం, లోతైన పరిశీలన, జీవితానుభవం, భాషా పరిణతి తోడైతే శ్రీ వర్ధన్ కలం నుంచి మరెన్నో విలువైన బాలసాహిత్య రచనలు వెలువడే అవకాశం ఉంది. నేటి బాలలే రేపటి పౌరులు అన్నమాటకు సాగర్ల శ్రీ వర్ధన్ ఒక స్ఫూర్తిదాయక ఉదాహరణగా నిలుస్తున్నాడు.'రంగుల కలలు'అనే శీర్షికలోనే ఒక ఆశావహమైన జీవన సందేశం ఉంది. ఆ రంగులు పిల్లల కలల్లోనే కాకుండా వారి ఆలోచనల్లో, ఆచరణలో, భవిష్యత్తులోనూ ప్రతిఫలించాలి. బాల్యం నుంచి సమాజాన్ని అర్థం చేసుకుంటూ, ప్రకృతిని ప్రేమిస్తూ, మానవీయ విలువలను ఆచరిస్తూ ఎదిగే తరాన్ని నిర్మించడంలో ఈ పుస్తకం తనవంతు పాత్ర పోషిస్తుందని ఆశిద్దాం.బాల్యంలో వికసించిన ఆలోచన.. అక్షరాల్లో రూపుదిద్దుకున్న కథ.. సమాజానికి దిశానిర్దేశం చేసే సందేశం.. ఇదే సాగర్ల శ్రీ వర్ధన్ 'రంగుల కలలు' కథా సంపుటి ప్రత్యేకత.



డా. పూసపాటి వేదాద్రి
9912197694

పల్లెకు ప్రాణం పోసిన చేతివృత్తులు.. నేడు కనుమరుగయ్యే దశలో!

చాకలి నుంచి మంగలి వరకు.. కుమ్మరి నుంచి కమ్మరి వరకు.. ప్రతి వృత్తి వెనుక ఒక చరిత్ర! మేర ధాన్యంతో సాగిన జీవనం.. యంత్రాల రాకతో మారిన బతుకులు.. ఉపాధి కోసం పట్టణాల బాట!

భారతదేశ ఆత్మ పల్లెల్లో ఉందన్న మాట వెనుక గొప్ప చరిత్ర ఉంది. ఒకప్పుడు పల్లె అంటే కేవలం ఇళ్ల సముదాయం కాదు. అది ఒక స్వయం సమృద్ధి ఆర్థిక వ్యవస్థ. రైతు పంట పండిస్తే కమ్మరి పనిముట్లు తయారు చేసేవాడు. వడ్రంగి నాగలి, ఎద్దుల బండి నిర్మించేవాడు. కుమ్మరి మట్టి కుండలు అందించేవాడు. మేదరి బుట్టలు అల్లేవాడు. చాకలి బట్టలు ఉతికేవాడు. మంగలి క్షవరం చేసేవాడు. సాలెవాడు వస్త్రాలు నేసేవాడు. మత్స్యకారుడు చేపలు పట్టేవాడు. ఇలా ఒక్కొక్క వృత్తి గ్రామజీవితంలో ఒక్కొక్క అవసరాన్ని తీర్చేది. డబ్బు కంటే ధాన్యానికి ప్రాధాన్యం ఉన్నరోజుల్లో పరస్పర సహకారంతో గ్రామీణ జీవనం సాగేది. కాలం మారింది. యంత్రాలు వచ్చాయి. పట్టణాలు విస్తరించాయి. ఆధునిక వస్తువులు మార్కెట్‌ను ఆక్రమించాయి. ఫలితంగా అనేక సంప్రదాయ వృత్తులు ఆదరణ కోల్పోయాయి. కొన్ని వృత్తులు ఆధునిక రూపం సంతరించుకోగా మరికొన్ని కనుమరుగయ్యే పరిస్థితికి చేరుకున్నాయి. అయితే పాత వ్యవస్థలో కుల ఆధారిత వృత్తి నిర్బంధాలు, సామాజిక అసమానతలు కూడా ఉండేవి. అందువల్ల ఆనాటి నైపుణ్యాలను గౌరవిస్తూనే వివక్షను తిరస్కరించాలి. నేడు చేతివృత్తుల పరిస్థితి ఏమిటి? వాటిని కాపాడాల్సిన బాధ్యత ఎవరిది? గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వృత్తిదారులకు మళ్లీ అవకాశాలు కల్పించగలమా? అన్న ప్రశ్నలు సమాజం ముందున్నాయి.

చాకలి వృత్తి..పల్లె జీవితంలో విడదీయరాని అనుబంధం

ఒకప్పుడు రజకులు లేని పల్లెను ఊహించడం కష్టమే. ప్రతి ఇంటి బట్టలు సేకరించి చెరువులు, వాగుల వద్ద ఉతికి, ఆరబెట్టి తిరిగి అందించేవారు. వందలాది బట్టలు ఒకేచోట ఉన్నప్పటికీ ఏ బట్ట ఎవరిదో గుర్తుపట్టే నైపుణ్యం వారికి ఉండేది. అందుకే వారి జ్ఞాపకశక్తిని ప్రశంసిస్తూ గ్రామీణ నానుడులు పుట్టుకొచ్చాయి. కొన్నిప్రాంతాల్లో రజక మహిళలు ఇంటింటికి వెళ్లి అన్నం, కూరలు సేకరించేవారు. వివిధ ఇళ్ల నుంచి వచ్చిన కూరల మిశ్రమాన్ని ఉద్దేశించి 'చాకలి కూర' అనే పదప్రయోగం వాడుకలోకి వచ్చింది. వివాహాలు, పండుగలు, జాతరలు, కుటుంబ సంప్రదాయాల్లో రజకులకు ప్రత్యేక బాధ్యతలు ఉండేవి. కొన్ని ప్రాంతాల్లో దీవిటీలు పట్టడం, పందిళ్ల ఏర్పాటులో సహకరించడం వంటి పనులు నిర్వహించేవారు. సంవత్సరానికి నిర్ణయించిన ధాన్యాన్ని 'మేర'గా పొందేవారు. నేడు వాషింగ్ మెషీన్లు, ఆధునిక లాండ్రీలు, డ్రైక్లీనింగ్ కేంద్రాలు విస్తరించాయి. సంప్రదాయ రజక సేవల స్వరూపం మారింది. అయితే ఇస్త్రీ కేంద్రాలు, వాణిజ్య లాండ్రీల ద్వారా కొత్త ఉపాధి అవకాశాలు కూడా ఏర్పడ్డాయి. ఆధునిక పరికరాలు, రుణాలు, పని ప్రదేశాలు అందిస్తే ఈ వృత్తికి మరింత భవిష్యత్తు ఉంటుంది.



మంగలి వృత్తి.. క్షవరం నుంచి మంగళవాద్యాల వరకు

గ్రామీణ సమాజంలో నాయీ బ్రాహ్మణుల పాత్ర ప్రత్యేకమైనది. ఇంటింటికి వెళ్లి క్షవరం చేయడం, జుట్టు కత్తిరించడం, గడ్డం చేయడం వంటి సేవలు అందించేవారు. సంవత్సరాంతంలో రైతుల నుంచి ధాన్యం రూపంలో మేర పొందేవారు. వివాహాలు, పుట్టువెంట్రుకలు, ఇతర కుటుంబ ఆచారాల్లో వీరి సేవలు అవసరమయ్యేవి. కొన్ని కుటుంబాలు సన్నాయి, నాదస్వరం, డోలు వంటి మంగళవాద్యాలను వాయిస్తూ జీవనం సాగించేవి. శుభకార్యాల్లో మంగళవాద్యాల శబ్దం ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. కాలక్రమేణా ఆధునిక సెలూన్లు, బ్యూటీ పార్లర్లు విస్తరించాయి. సంప్రదాయ క్షురక వృత్తి ఆధునిక సేవారంగంగా మారింది. కానీ గ్రామీణ ప్రాంతాల్లో చిన్న సెలూన్లు నిర్వహించే వారికి పెట్టుబడి, అద్దెలు, విద్యుత్ ఖర్చులు భారంగా మారుతున్నాయి. నైపుణ్య శిక్షణ, ఆధునిక పరికరాల సహాయం అందిస్తే ఈ వృత్తిలో యువతకు అవకాశాలు పెరుగుతాయి.

కుమ్మరి చక్రం.. మట్టిలో పుట్టిన అద్భుత కళ

మట్టిని మలిచి మనిషి అవసరాలకు అనుగుణంగా పాత్రలు తయారు చేయడం కుమ్మరుల ప్రత్యేక నైపుణ్యం. ఒకప్పుడు ప్రతి ఇంట్లో మట్టి కుండలు, కడవలు, చట్లు, మూకుళ్లు, ముంతలు ఉండేవి. మంచినీటి నిల్వ నుంచి వంట వరకు మట్టిపాత్రలే ఆధారం. వివాహాల్లో ఉపయోగించే ఐరేణి కుండలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండేది. కుమ్మరులు పాత్రలను తయారు చేసి రైతులకు అందించి ధాన్యం రూపంలో ప్రతిఫలం పొందేవారు. అదనపు పాత్రలను సంతల్లో విక్రయించేవారు. ప్లాస్టిక్, స్టీల్, అల్యూమినియం పాత్రల వినియోగం పెరగడంతో మట్టిపాత్రలకు ఆదరణ తగ్గింది. అయితే పర్యావరణహిత వస్తువులపై ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో మట్టికుండలు, దీపాలు, అలంకరణ వస్తువులకు కొత్త అవకాశాలు ఉన్నాయి. కుమ్మరి కళను కాపాడాలంటే నాణ్యమైన మట్టి, ఆధునిక చక్రాలు, సురక్షిత బట్టీలు, మార్కెటింగ్ సదుపాయాలు అవసరం. మట్టితో అద్భుతాలను సృష్టించే కళాకారుడికి గిట్టుబాటు ధర లభించాలి.

వడ్రంగి చేతిలో రూపుదిద్దుకున్న వ్యవసాయ పనిముట్లు

వ్యవసాయానికి అవసరమైన నాగలి, కాడిమాను, ఎద్దుల బండి వంటి పరికరాల తయారీలో వడ్రంగుల పాత్ర కీలకం. ఇళ్ల నిర్మాణంలో తలుపులు, కిటికీలు, మంచాలు, బల్లలు తయారు చేసేవారు. యాంత్రీకరణతో కలప నాగళ్ల వినియోగం తగ్గింది. ట్రాక్టర్లు, ఆధునిక వ్యవసాయ యంత్రాలు ఎద్దుల బండ్ల స్థానాన్ని ఆక్రమించాయి. అయినప్పటికీ వడ్రంగి వృత్తి పూర్తిగా అంతరించలేదు. ఫర్నిచర్ తయారీ, ఇంటీరియర్ డిజైన్, మాడ్యులర్ కిచెన్లు, అలంకరణ వస్తువుల తయారీలో అవకాశాలు పెరిగాయి. అయితే ఆధునిక యంత్రాలు కొనుగోలు చేయలేని చిన్న వృత్తిదారులు పోటీలో వెనుకబడుతున్నారు. ఉమ్మడి యంత్రశాలలు, వృత్తి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తే గ్రామీణ వడ్రంగులకు ఉపాధి పెరుగుతుంది.

మేదరి బుట్ట.. పల్లె వ్యవసాయానికి మరో ఆధారం

వెదురు బద్దలతో బుట్టలు, తట్టలు, చాటలు, ధాన్యం నిల్వ చేసే వస్తువులు తయారు చేయడం మేదరుల సంప్రదాయ నైపుణ్యం. పంట కోత సమయంలో ధాన్యం మోసుకెళ్లడానికి బుట్టలు, ధాన్యం చెరగడానికి చాటలు అవసరమయ్యేవి. వెదురును చీల్చి అందమైన ఆకృతుల్లో అల్లడం ఎంతో శ్రమతో కూడుకున్న కళ. ప్లాస్టిక్ వస్తువులు మార్కెట్‌లో విస్తరించడంతో వెదురు ఉత్పత్తులకు ఆదరణ తగ్గింది. అయితే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతున్న ఈ సమయంలో వెదురు వస్తువులకు కొత్త మార్కెట్ ఏర్పడే అవకాశం ఉంది. అలంకరణ వస్తువులు, గృహోపకరణాలు, బహుమతి పెట్టెల తయారీలో మేదరి నైపుణ్యాన్ని వినియోగించవచ్చు. ముడిసరుకు, డిజైన్ శిక్షణ, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తే ఈ కళకు మళ్లీ ఆదరణ పెరుగుతుంది.

కమ్మరి కొలిమి.. వ్యవసాయానికి అండగా నిలిచిన శ్రమ

ఒకప్పుడు గ్రామాల్లో కమ్మరి కొలిమి నిరంతరం పనిచేసేది. కొడవళ్లు, గొడ్డళ్లు, పారలు, గడ్డపారలు, నాగలి ఇనుప భాగాలు తయారు చేసేవారు. వ్యవసాయ పనిముట్లు పాడైతే రైతులు కమ్మరి వద్దకు తీసుకెళ్లి మరమ్మతులు చేయించుకునేవారు. కొలిమిలో ఇనుమును వేడి చేసి సుత్తితో కొట్టి అవసరమైన ఆకృతిలోకి మార్చడం ప్రత్యేక నైపుణ్యం. కర్మాగారాల్లో తయారయ్యే పరికరాలు మార్కెట్‌లోకి రావడంతో గ్రామీణ కొలిమిల సంఖ్య తగ్గింది. అయినప్పటికీ



జాతీయం-అంతర్జాతీయం




ఉగ్రవాదులు హతం



జమ్మూకశ్మీర్‌లోని కులగామ్ జిల్లా లారూలో సైన్యం ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఈ ఇద్దరూ సీఆర్పీఎఫ్ పోస్టుపై దాడి చేసిన వారని భావిస్తున్నారు. ఆ దాడిలో ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. ఎన్‌కౌంటర్ సమయంలో ఆ ప్రాంతంలోని పాఠశాలల నుంచి పిల్లలను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. కశ్మీర్ జోన్ పోలీసులు క్ష్ లో వెల్లడించిన ప్రకారం, మరణించిన వారిలో ఒకరు లష్కరే తొయ్యబా కమాండర్ లతీఫ్ భట్. అతని సహచరుడు ఉమర్ కూడా చనిపోయాడు. భద్రతా సంస్థలు ఉమర్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నాయి. లతీఫ్ మృతదేహం ఇంకా దొరకలేదు. కొన్ని మీడియా కథనాల ప్రకారం అతను గాయపడి ఎక్కడో దాక్కుని ఉండవచ్చు. సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. ఉగ్రవాదుల సమాచారం అందిన తర్వాత పోలీసులు, భద్రతా బలగాల జాయింట్ టీమ్ ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టింది. తనిఖీల సమయంలో అనుమానాస్పద స్థావరం దగ్గరకు వెళ్లగానే దాక్కున్న ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. రెండు వైపులా కాల్పులు మొదలయ్యాయి. సుమారు 3 గంటల పాటు సాగిన ఎన్‌కౌంటర్ తర్వాత వారిని మట్టుబెట్టారు. సీఆర్పీఎఫ్ బలగాలపై 5 రోజుల క్రితం దాడి జరిగింది. నవంబర్ 11న నౌపొరా అఖ్రూన్‌లో జరిగిన ఈ దాడిలో ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. 15 సెకన్లలో 30 రౌండ్ల కాల్పులు జరిగాయని సీసీటీవీ ఫుటేజ్ చూపుతోంది. దాడి తర్వాత సుమారు 6 నెలలుగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గాయపడిన జవాన్లను హెడ్ కానిస్టేబుల్ సోమవీర్, కానిస్టేబుల్ సంతానో, రాకేష్ దాస్‌గా గుర్తించారు. ముగ్గురూ సీఆర్పీఎఫ్ 46వ బెటాలియన్‌లో పనిచేస్తున్నారు. గత ఆరు నెలల్లో కశ్మీర్‌లో లష్కరే తొయ్యబాకు చెందిన నాలుగో కమాండర్ హతమయ్యాడు. అతనితో పాటు జాకిర్ అహ్మద్ గనీ, యాసిర్, మూసా ఉర్ఫ్ ఆసిఫ్ ఫౌజీ కూడా మరణించారు. జాకిర్ అహ్మద్ గనీ జులై 8, 2026న బడ్గామ్‌లో మరణించాడని అధికారులు తెలిపారు. యాసిర్ సెప్టెంబర్ 4న ఆపరేషన్ అసధర్‌లో, మూసా సెప్టెంబర్ 30న ఆపరేషన్ షీరువాలిలో హతమయ్యారు. 2024 నుంచి ఇప్పటివరకు కశ్మీర్‌లో 548 ఉగ్రవాద ఘటనలు జరిగాయి. ఈ ఘటనల్లో 45 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. అదే సమయంలో 138 మంది ఉగ్రవాదులు మృతిచెందారు. సెర్చ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది, లతీఫ్ భట్ ఆచూకీ కోసం గాలింపు సాగుతోంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సీసీటీవీ ఫుటేజ్ ఆ దాడి దృశ్యాలను చూపుతోంది. ఉగ్రవాదుల చివరి ఆచూకీ కోసం భద్రతా బలగాలు గాలింపు కొనసాగిస్తున్నాయి.

ఫ్రాన్స్ సూపర్‌మార్కెట్ శీతలీకరణ వ్యవస్థలపై సైబర్ దాడి ఆరోపణతో ఇరాన్‌పై ఆంక్షలకు పిలుపు



ఫ్రాన్స్ సూపర్‌మార్కెట్ల శీతలీకరణ వ్యవస్థలపై జరిగిన సైబర్ దాడికి ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (IRGC) కారణమని ఆరోపించింది. ఈ ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సోమవారం యూరోపియన్ యూనియన్ (EU) మంత్రులకు సమర్పించనున్నట్లు ఫ్రాన్స్ తెలిపింది. దాడిపై టెహ్రాన్‌పై కొత్త ఆంక్షలు విధించాలని పారిస్ ప్రయత్నిస్తోందని రాయిటర్స్ నివేదించింది. ఫ్రెంచ్ విదేశాంగ మంత్రి జీన్ నోయెల్ బారో బ్రస్సెల్స్‌లో జరగనున్న నెలవారీ EU విదేశాంగ మంత్రుల సమావేశానికి ముందు విలేకరులతో మాట్లాడారు. ఈ దాడి వివరాలను యూరోపియన్ సహచరులతో పంచుకుంటామని ఆయన చెప్పారు. ఒక నెలలోపు కొత్త వ్యక్తులు, సంస్థలపై ఆంక్షల జాబితాను సిద్ధం చేయాలని ఫ్రాన్స్ లక్ష్యంగా పెట్టుకుందని బారో అన్నారు. ఫ్రాన్స్ అంతకుముందు ఈ సైబర్ దాడి వెనుక ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ఉన్నారని గుర్తించినట్లు ప్రకటించింది. అక్టోబర్‌లో వందలాది సూపర్‌మార్కెట్ల శీతలీకరణ వ్యవస్థలకు అంతరాయం కలిగింది. అక్టోబర్ 1112 తేదీల మధ్య రాత్రి, ఫ్రాన్స్ అంతటా సుమారు 700 సూపర్‌మార్కెట్ ప్రదేశాల్లో రిఫ్రిజిరేటర్ వ్యవస్థలపై దాడులు జరిగాయని ఫ్రెంచ్ అధికారులు తెలిపారు. హ్యాకర్లు ఫ్రిజ్‌లు, ఫ్రీజర్లు, చల్లని ఆహార క్యాబినెట్ల డిజిటల్ నియంత్రణలకు రిమోట్ యాక్సెస్ పొందారని నివేదికలు చెబుతున్నాయి. వాటి ఉష్ణోగ్రత సెట్టింగులు మార్చి అసాధారణ డీఫ్రాస్ట్ చక్రాల్లోకి నెట్టారని సమాచారం. కొన్ని చోట్ల ఉష్ణోగ్రత 50 డిగ్రీల సెల్సియస్‌ను దాటినట్లు నివేదికలు తెలిపాయి. దీంతో పెద్ద మొత్తంలో పాడైపోయే ఆహార పదార్థాలు చెడిపోయాయి. పలు సూపర్‌మార్కెట్లు తమ ఆహార నిల్వలను పారేయాల్సి వచ్చింది. కొన్ని ప్రదేశాల్లో తీవ్ర ఉష్ణోగ్రత పెరుగుదల మంటలకు దారి తీసిందని కూడా చెబుతున్నారు. ఈ ఘటన రిటైల్ వ్యాపారులకు గణనీయమైన ఆర్థిక నష్టాన్ని కలిగించింది. లే మోండ్ నివేదిక ప్రకారం, ఈ దాడి ఇంటర్నెట్‌కు అనుసంధానించిన శీతలీకరణ పరికరాల్లోని భద్రతా లోపాలను బయటపెట్టింది. కొంతమంది సూపర్‌మార్కెట్ నిర్వాహకులకు తమ కూలింగ్ వ్యవస్థలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయన్న విషయం తెలియదని సమాచారం. పాత సాఫ్ట్‌వేర్, బలహీన పాస్‌వర్డ్‌లు ఈ పరికరాలను హ్యాకింగ్‌కు గురయ్యేలా చేశాయని నివేదిక పేర్కొంది. ఈ దాడి సాధారణ వాణిజ్య పరికరాలనే ప్రభావితం చేసిందని నివేదికలు చెబుతున్నాయి. నవంబర్ 9న ఫ్రాన్స్ ఈ దాడికి ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌ను బాధ్యురాలిగా ప్రకటించింది. పారిస్‌లో జరిగిన గ్7 విదేశాంగ మంత్రుల సమావేశం సందర్భంగా బారో ఈ విషయాన్ని వెల్లడించారు. ఫ్రెంచ్ ప్రభుత్వ సంస్థలు IRGC బాధ్యతను నిర్ధారించాయని ఆయన చెప్పారు. ఈ దాడి పరిమాణం, దూకుడు అసాధారణమని బారో అభివర్ణించారు.


కోట్ల ఖర్చుతో యమునా కాలుష్యం పెరిగిందని సుప్రీంకోర్టు ఆగ్రహం

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలికి ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతం, జిల్లాలో యమునా ప్రవేశ, నిష్క్రమణ బిందువుల వద్ద నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సుప్రీంకోర్టు కఠిన ఆదేశాలు జారీ చేసింది. ఏ రాష్ట్రం లేదా జిల్లాలో నీటి నాణ్యత దెబ్బతిన్నా, సంబంధిత అధికార సంస్థ బాధ్యత వహించాలని, జరిమానా విధిస్తామని కోర్టు స్పష్టం చేసింది



సుప్రీంకోర్టు యమునా నదిలో పెరుగుతున్న కాలుష్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. నది శుభ్రత కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసినా పరిస్థితి మెరుగుపడలేదని కోర్టు పేర్కొంది. కాలుష్యం ఇంకా పెరిగిందని జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మనమోహన్ ధర్మాసనం ఎత్తి చూపింది. ఈ పరిస్థితిపై బెంచ్ కఠినంగా స్పందించింది. నదిని ఇంత దయనీయ స్థితిలో చూడటం సహించలేనిదని కోర్టు స్పష్టం చేసింది. యమునాలో కలుస్తున్న 520 నాలాలు నది దుస్థితికి ప్రధాన కారణమని కోర్టు పేర్కొంది. ఈ నాలాలు తీర ప్రాంత నగరాలు, పట్టణాల్లోని పరిపాలన సరిగా పనిచేయడం లేదని చూపిస్తున్నాయని కోర్టు అభిప్రాయపడింది. ఈ లోపాలను సరిచేయకపోతే కాలుష్యం కొనసాగుతుందని బెంచ్ హెచ్చరించింది. అందుకే సంబంధిత అధికార సంస్థలు బాధ్యత తీసుకోవాలని కోర్టు సూచించింది. నది పరిశుభ్రతకు పాలనా వ్యవస్థ పూర్తి స్థాయిలో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపింది. సుప్రీంకోర్టు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ)కి కఠిన ఆదేశాలు ఇచ్చింది. ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతం, జిల్లాలో యమునా ప్రవేశ, నిష్క్రమణ బిందువుల వద్ద నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సీపీసీబీని కోరింది. ఏ రాష్ట్రం లేదా జిల్లా గుండా ప్రవహించేటప్పుడు నీటి నాణ్యత దెబ్బతిన్నా సంబంధిత అధికార సంస్థను వెంటనే బాధ్యులుగా పరిగణిస్తామని కోర్టు తెలిపింది. అలాంటి సంస్థలపై జరిమానా కూడా విధిస్తామని హెచ్చరించింది. యమునా యాక్షన్ ప్లాన్ (వైఏపీ)లో నమోదైన సమాచారంపై సుప్రీంకోర్టు తీవ్ర సందేహాలు వ్యక్తం చేసింది. ప్లాన్‌లో ఢిల్లీ జోన్ 'ఓ'లోని 35 నీటి వనరులు, వెట్‌ల్యాండ్స్ ఆక్రమణ లేకుండా ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ సొంత పత్రాల్లో ఈ 35 ప్రదేశాల్లోనూ ఆక్రమణలు నమోదై ఉన్నాయి. ఈ వైరుధ్యంపై కోర్టు తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఇలాంటి తప్పుడు సమాచారం ప్రణాళిక విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తుందని బెంచ్ అభిప్రాయపడింది. కాలుష్య నియంత్రణ ప్రయత్నాలను బలోపేతం చేసి జవాబుదారీతనం నిర్ధారించేందుకు కోర్టు కొత్త చర్యలు ఆదేశించింది. అన్ని సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్టీపీ), కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (సీఈటీపీ)లో ఒక నెలలోపు ట్యాంపర్ ప్రూఫ్ స్మార్ట్ ఎనర్జీ మీటర్లు అమర్చాలని ఆదేశించింది. ఈ మీటర్ల లైవ్ డేటాను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం తప్పనిసరి చేసింది. దీంతో ప్లాంట్ల పనితీరును నిజసమయంలో పర్యవేక్షించవచ్చని కోర్టు భావించింది. అంతేకాదు ప్రతి మూడు నెలలకోసారి ఈ ప్లాంట్లపై సీపీసీబీ ఆకస్మిక తనిఖీ చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. ఈ చర్యల లక్ష్యం యమునాలో కాలుష్యం నివారించడానికి ప్రభావవంతమైన బాధ్యత నిర్ణయించడం. పూర్తి జవాబుదారీతనం ఉండేలా చూడటమే ఈ ఆదేశాల ఉద్దేశమని కోర్టు పేర్కొంది. ఈ ఆదేశాల అమలుపై రాబోయే రోజుల్లో అందరి దృష్టి ఉండనుంది. యమునా పరిశుభ్రతపై సుప్రీంకోర్టు ఆదేశాల అమలు ఎలా ఉంటుందో తదుపరి దశలో స్పష్టమవుతుంది.

అక్వాన్ తుపాను నవంబర్ 20న ఆంధ్ర తీరాన్ని తాకే అవకాశం




బంగాళాఖాతంలో ఏర్పడనున్న అక్వాన్ తుపాను నవంబర్ 20 మధ్యాహ్నం ఆంధ్రప్రదేశ్ తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం తెలిపింది. ఐఎండీ అంచనా ప్రకారం ఇది అత్యంత తీవ్రమైన తుపానుగా తీరం దాటనుంది. తీరం వద్ద గాలుల వేగం గంటకు 120130 కిలోమీటర్లు ఉండొచ్చు. ఈ గాలులు గంటకు 145 కిలోమీటర్ల వేగం వరకు వీచే అవకాశం ఉంది. తుపాను ప్రభావం 500 కిలోమీటర్ల తీరప్రాంతంపై ఉంటుంది. ఇది ఆంధ్రప్రదేశ్ 1,053 కిలోమీటర్ల తీరంలో దాదాపు సగానికి సమానం. నెల్లూరు, ఒంగోలు ప్రాంతాల మధ్య తీరం దాటే అవకాశం ఉంది. ప్రస్తుతం వాయుగుండం చెన్నైకు 800 కిలోమీటర్లు, విశాఖపట్నంకు 700 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది ఉత్తరవాయవ్య దిశగా కదులుతోంది. తుపాను ఇంకా దిశ మార్చుకునే అవకాశం ఉన్నందున వాతావరణ నిపుణులు పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నారు. వాయుగుండం గంటకు 06 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ఐఎండీ ప్రకారం సోమవారం సాయంత్రానికి ఇది తుపానుగా మారే అవకాశం ఉంది. నవంబర్ 17 సాయంత్రానికి ఇది తీవ్ర తుపానుగా బలపడవచ్చని అంచనా. అధికారులు తీరప్రాంత జిల్లాల్లో అప్రమత్తతను పెంచారు. మత్స్యకారులు నవంబర్ 17 వరకు సముద్రంలోకి వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. 173 చేపల పడవలు ఇంకా తిరిగిరాలేదని అధికారులు తెలిపారు.

నలుగురు అధికారులను ప్రశ్నించేందుకు సుప్రీంకోర్టు అనుమతి కోరిన ప్రతిపక్షం




న్యూఢిల్లీ, నవంబర్ 16: ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర పునర్విమర్శ (ఎస్ఐఆర్), అలాగే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పనితీరును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌కు సంబంధించి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నాయకులు సుప్రీంకోర్టులో తాజా అఫిడవిట్ దాఖలు చేశారు. విచారణకు ఒక రోజు ముందు దాఖలు చేసిన ఈ అఫిడవిట్‌లో, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు, ఎన్నికల కమిషన్ ఐటీ విభాగం డైరెక్టర్ జనరల్‌ను వ్యక్తిగతంగా ప్రశ్నించేందుకు అనుమతి ఇవ్వాలని ప్రతిపక్ష నాయకులు కోరారు. ఇందుకోసం భారత ఎన్నికల కమిషన్‌ను అడగాల్సిన 48 ప్రశ్నల జాబితాను వారు సిద్ధం చేశారు. ఓటు చోరీ, ఓటరు జాబితాల పునర్విమర్శకు సంబంధించి లేవనెత్తిన కీలక ప్రశ్నలకు ఎన్నికల కమిషన్ అఫిడవిట్ సమాధానం ఇవ్వలేదని ఇండియా కూటమి ఆరోపించింది. ఓటు చోరీపై లేవనెత్తిన ఒక్క ప్రశ్నకూ సుప్రీంకోర్టులో ఎన్నికల కమిషన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లో సమాధానం లేదని పేర్కొంది. ఎస్ఐఆర్‌లోని భారీ లోపాలు ఓటు చోరీకి మార్గం సుగమం చేశాయని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు, ఐటీ డైరెక్టర్ జనరల్‌ను వ్యక్తిగతంగా ప్రశ్నించే ఇంటరాగేటరీకి అనుమతి ఇవ్వాలని ఇండియా కూటమి నాయకులు సుప్రీంకోర్టును కోరారు. ప్రశ్నలలో కొన్ని: ప్రధాన ఎన్నికల కమిషనర్ నిర్ణయాలతో మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఎన్నిసార్లు విభేదించారు? దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహించాలని ఎవరు నిర్ణయించారు? ఫారం 6ను మార్చాలని ఎవరు నిర్ణయించారు? ఈరోనెట్, ఈసినెట్‌లను కేంద్రీకరించి, ఓటరు జాబితాలకు ప్రాప్యతను కేంద్రంగా నియంత్రించాలని ఎవరు నిర్ణయించారు? ఇండియా కూటమి సిద్ధం చేసిన మొత్తం 48 ప్రశ్నల్లో, ఓటరు జాబితాల పునర్విమర్శను మొదట ఎవరు ఆదేశించారు, దానికి ప్రమాణాలు ఏమిటి, ఓటు చోరీ ఆరోపణలకు నేపథ్యం ఏమిటి వంటి ప్రశ్నలు ఉన్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి, అలాగే ఎన్నికల కమిషన్ ఐటీ విభాగం డైరెక్టర్ జనరల్‌ను ప్రశ్నించేందుకు వారు అనుమతి కోరారు. ఎస్ఐఆర్‌కు ముందు ఉన్న పాత ఓటరు జాబితాలతో జీబీఏ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ సుప్రీంకోర్టును కోరింది. ఓటరు జాబితాల పునర్విమర్శ పారదర్శకతపై లేవనెత్తిన తీవ్రమైన ప్రశ్నలకు తాను గతంలో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌లో ఎన్నికల కమిషన్ తగిన సమాధానాలు ఇవ్వలేదని ఇండియా కూటమి ఆరోపించింది. ఇతర కమిషనర్ల సమ్మతి లేకుండా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని, ఫారం 6 నిబంధనలను మార్చారని ప్రతిపక్షం తన ఆరోపణను పునరుద్ఘాటించింది. ఎన్నికల కమిషన్ మరియు ముగ్గురు కమిషనర్లు ప్రతిపక్ష ఆరోపణలకు ప్రతిస్పందనగా ఇప్పటికే సుమారు 250 పేజీల అఫిడవిట్ దాఖలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలోని అన్ని ప్రధాన నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నామని వారు స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు వర్తించే రాజ్యాంగపరమైన విధానం మినహా, ప్రధాన ఎన్నికల కమిషనర్ తన విధులు నిర్వర్తించకుండా అడ్డుకోవడం లేదా పదవి నుంచి తొలగించడం సాధ్యం కాదని కూడా కమిషన్ తెలిపింది. విచారణకు ఒక రోజు ముందు ఇండియా కూటమి తాజా అఫిడవిట్ దాఖలు చేసింది.

బ్రిటన్ ఆన్‌లైన్ చైల్డ్ సేఫ్టీ నియమాలు కఠినతరం



బ్రిటన్ మీడియా నియంత్రణ సంస్థ ఓఫ్కామ్ సోమవారం ఆన్‌లైన్ బాల భద్రతా నిబంధనలను మరింత కఠినతరం చేసింది. కొత్త నిబంధనల ప్రకారం ప్లాట్‌ఫామ్‌లు బాల లైంగిక దోపిడీ సామగ్రి మరియు గ్రూమింగ్‌పై గట్టి చర్యలు తీసుకోవాలి. ఈ చర్యలు 16 ఏళ్లలోపు పిల్లలపై ప్రతిపాదిత సోషల్ మీడియా నిషేధానికి ముందే వస్తున్నాయి. ఓఫ్కామ్ ఈ కొత్త బాధ్యతలు 2027 ప్రారంభం నుంచి అమలులోకి రావచ్చని భావిస్తోంది. అయితే ఈ నిబంధనలు పార్లమెంట్ ఆమోదానికి లోబడి ఉన్నాయి. ఈ మార్పులు సోమవారం ప్రకటించిన ఓఫ్కామ్ చర్యల్లో కీలకమైనవి. కొత్త బాధ్యతలు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు, ఫైల్‌షేరింగ్ సేవలు, పోర్న్ సైట్‌లు మరియు ఇతర ఆన్‌లైన్ సేవలకు వర్తిస్తాయి. బాల లైంగిక దోపిడీ సామగ్రిని సృష్టించే, అప్‌లోడ్ చేసే లేదా షేర్ చేసే వినియోగదారులను ఈ సంస్థలు నిషేధించాలి. తెలిసిన అక్రమ చిత్రాలను గుర్తించి తొలగించేందుకు సాంకేతికత వినియోగాన్ని విస్తరించాలని కూడా కంపెనీలను ఆదేశించారు. కొన్ని సందర్భాల్లో ముందుగా గుర్తించని సామగ్రిని కనుగొనేందుకు స్వయంచాలక సాధనాలను వాడాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు ఆన్‌లైన్ సేవల విస్తృత పరిధిని కవర్ చేస్తాయి. ఈ బాధ్యతలు ప్లాట్‌ఫామ్‌ల నిర్వహణ విధానాలను మార్చవచ్చని అంచనా. బ్రిటన్ జూన్‌లో 16 ఏళ్లలోపు పిల్లలు టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ మరియు ఎక్స్ వంటి ప్లాట్‌ఫామ్‌లను వాడకుండా నిషేధించే ప్రణాళికను ప్రకటించింది. ఆ ప్రణాళికను అమలు చేయడానికి ముందే ఈ కొత్త చర్యలు తీసుకుంటున్నారు. ఈ చర్యలు పిల్లలకు వారి బాల్యాన్ని తిరిగి ఇస్తాయని బ్రిటన్ ప్రభుత్వం చెప్పింది. ఓఫ్కామ్ ప్రకారం ఆన్‌లైన్‌లో బాల లైంగిక దోపిడీ సామగ్రి విస్తృతంగా వ్యాపిస్తోంది. కృత్రిమ మేధలో వచ్చిన పురోగతి ఈ సమస్యను మరింత తీవ్రం చేసిందని నియంత్రణ సంస్థ పేర్కొంది. ఈ పరిస్థితే కొత్త కఠిన నిబంధనల అవసరాన్ని పెంచిందని ఓఫ్కామ్ తెలిపింది. ఓఫ్కామ్ ఆన్‌లైన్ సేఫ్టీ గ్రూప్ డైరెక్టర్ ఆలివర్ గ్రిఫిత్స్ ఈ అంశంపై స్పందించారు. ప్లాట్‌ఫామ్‌ల్లో బాల లైంగిక దోపిడీపై పరిశ్రమ కొంత పురోగతి సాధించిందని ఆయన అంగీకరించారు. అయినప్పటికీ తగినన్ని చర్యలు తీసుకోవడం లేదని నియంత్రణ సంస్థ సంతృప్తిగా లేదని ఆయన చెప్పారు. ఈ వ్యాఖ్యలు కంపెనీలపై మరింత ఒత్తిడిని పెంచుతాయని అంచనా. కొత్త నిబంధనలు అమలులోకి వస్తే ప్లాట్‌ఫామ్‌లు తమ భద్రతా చర్యలను సమీక్షించుకోవాల్సి ఉంటుంది. ఈ మార్పులకు ఎలా సిద్ధమవుతారన్నది రాబోయే నెలల్లో స్పష్టమవుతుంది. ఓఫ్కామ్ నిర్ణయం బ్రిటన్‌లో ఆన్‌లైన్ భద్రతా చట్టం అమలులో కీలక దశగా భావిస్తున్నారు. ఇతర దేశాలు కూడా ఇలాంటి నియంత్రణలను పరిశీలించే అవకాశం ఉంది. ప్లాట్‌ఫామ్‌ల సమీక్ష ప్రక్రియ ఎలా ముందుకు సాగుతుందో చూడాలి. కొత్త నిబంధనల అమలు తీరు పిల్లల ఆన్‌లైన్ రక్షణపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఓఫ్కామ్ తదుపరి దశలను ఎలా చేపడుతుందో వేచి చూడాల్సి ఉంది. ఈ మార్పులు ప్లాట్‌ఫామ్‌ల నిర్వహణ విధానాలపై నేరుగా ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఎలన్ మస్క్‌కు పెద్ద ఎదురుదెబ్బ



వాషింగ్టన్(ఈఎంఎస్). ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు ఎలన్ మస్క్ అంతరిక్ష సంస్థ స్పేస్‌ఎక్స్‌కు శుక్రవారం స్టార్‌షిప్ రాకెట్ పరీక్షలో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఒకే మిషన్‌లో రాకెట్‌లోని రెండు భాగాలను తిరిగి పొందాలనే ప్రయత్నంలో కంపెనీ విజయం సాధించలేకపోయింది. పరీక్ష సమయంలో సూపర్ హెవీ బూస్టర్ ఖాడీలో పడిపోయింది. సాంకేతిక సమస్య కారణంగా దానిని తిరిగి పొందే ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఈ మిషన్ మొదటిసారిగా స్టార్‌షిప్ బూస్టర్, పై భాగం రెండింటినీ సురక్షితంగా తిరిగి పొందే లక్ష్యంతో చేపట్టారు. ఇది స్పేస్‌ఎక్స్ ఇప్పటివరకు చేపట్టిన అత్యంత ప్రతిష్టాత్మక స్టార్‌షిప్ పరీక్ష. సుమారు 22 గంటల ఈ మిషన్ ప్రధాన ఉద్దేశ్యం రాకెట్ రెండు భాగాలను భవిష్యత్తులో విజయవంతంగా వాడుకోవడానికి తిరిగి తీసుకురావడం. స్పేస్‌ఎక్స్ పూర్తి స్టార్‌షిప్ రాకెట్‌ను పూర్తిగా పునర్వినియోగానికి అనువుగా మార్చాలని ప్రణాళిక వేసింది. కంపెనీ అభిప్రాయం ప్రకారం అది జరిగితే అంతరిక్ష ప్రయోగ ప్రక్రియ వేగంగా, సులభంగా మారవచ్చు. దీనివల్ల చంద్రుడు, మంగళ గ్రహ భవిష్యత్ మిషన్లకు బడీ సహాయం లభిస్తుంది. ఈ పరీక్ష విజయవంతమైతే, కక్ష్యలోకి పంపిన రాకెట్ అన్ని భాగాలను తిరిగి పొంది మళ్లీ వాడే దిశగా ఇది మొదటి బడీ విజయం అయ్యేది. ఎలన్ మస్క్‌కు రాకెట్ పూర్తి పునర్వినియోగ సామర్థ్యం చాలా కీలకం. ఆయన అభిప్రాయం ప్రకారం చంద్రుడిపై స్థావరం నిర్మించడానికి, మనుషులను మంగళ గ్రహానికి చేరవేయడానికి తరచుగా, తక్కువ వ్యవధిలో రాకెట్ ప్రయోగాలు అవసరం. సెప్టెంబర్‌లో జరిగిన పరీక్షలో స్టార్‌షిప్ మొదటిసారి భూమి కక్ష్యను చేరుకుంది. అయితే అప్పుడు కంపెనీ ఏ భాగాన్ని తిరిగి పొందే ప్రయత్నం చేయలేదు. ఈసారి కంపెనీ రెండు భాగాలను తిరిగి పొందాలనే లక్ష్యం పెట్టుకుంది. సూపర్ హెవీ బూస్టర్ ఖాడీలో పడటంతో ఆ ప్రణాళిక పూర్తి కాలేదు. ప్రస్తుతం స్పేస్‌ఎక్స్ రాబోయే నెలల్లో ఫ్లోరిడా నుంచి స్టార్‌షిప్ ప్రయోగాలు ప్రారంభించాలని యోచిస్తోంది. కంపెనీ అభిప్రాయం ప్రకారం ప్రయోగ మౌలిక సదుపాయాల విస్తరణ, రాకెట్ అన్ని భాగాల పునర్వినియోగం దాని కార్యకలాప సామర్థ్యం పెంచడానికి అవసరం. ప్రస్తుతం స్పేస్‌ఎక్స్ చిన్న ఫాల్కన్ రాకెట్లను అనేక ముఖ్యమైన అంతరిక్ష మిషన్లలో వాడటం కొనసాగుతుంది. వాటిలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వ్యోమగాములను పంపడం, స్టార్‌లింక్ ఉపగ్రహాలను ప్రయోగించడం ఉన్నాయి.

వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

పిల్లల ప్రజావాణి కి స్పందన!

- పిల్లల సమస్యలను అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్

- సమస్యల పరిష్కారం కోసం అధికారులకు ఆదేశం: కలెక్టర్

హనుమకొండ, నవంబర్ 16 (వుదయం జిల్లా ప్రతినిధి):



14 నవంబర్ బాలల దినోత్సవం పుర స్కరించుకొని ఈ నెల 20 వరకు నిర్వహించ తలపెట్టిన కార్యక్రమాలలో భాగంగా...జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ – జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో సోమవారం రోజున కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన పిల్లల ప్రజావాణి కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పాల్గొని..51 అర్జీలు స్వీకరించి..సత్వర పరిష్కారం కోసం చర్యలు తీసుకోవా లని సంబంధిత శాఖల అధికారులకు తెలియచేశారుపిల్లల ప్రజావాణి లో... తాగునీటి వసతి,ఆధార్ కార్డులు,పాఠ శాల సమీపంలో పాన్ షాప్/ మద్యం దుకాణాల వలన ఇబ్బంది,హాట్ వాటర్ ఫెసిలిటీ,న్యూ బిల్డింగ్,బ్రేక్ ఫాస్ట్/ మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని, కుల ధృవీకరణ పత్రం కావాలని మొదలుగు సమస్యల పరిష్కారం కోరుతూ 51 అర్జీలను వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ని నేరుగా కలిసి తెలియ చేసారు పిల్లల ప్రజావాణి కార్యక్రమం జిల్లా సంక్షేమ అధికారి ఎం విశ్వజ,బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సిహెచ్ అవంతి, ఇంచార్జి డిసిపిఓ ఎస్ ప్రవీణ్ కుమార్, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ ఎస్ భాస్కర్, వివిధ శాఖల అధికారుల తదితరులు పాల్గొన్నారు.

పిల్లల మాటకు విలువ ఇద్దాం.. వారి అభిప్రాయాలను గౌరవిద్దాం

ప్రజావాణి నిర్వహణ, పరిష్కార విధానాన్ని విద్యార్థులకు వివరించిన కలెక్టర్

బాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదికగా 'పిల్లల ప్రజావాణి'

జిల్లావ్యాప్తంగా అందిన 32 దరఖాస్తులు.. కలెక్టరేట్‌లో 10, మండలాల్లో 22 వినతులు

ములుగు, నవంబర్ 16 (వుదయం ప్రతినిధి):



బాలల హక్కుల పరిరక్షణ, వారి సమ స్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తూ ములుగు జిల్లా యంత్రాంగం వినూత్నంగా 'పిల్లల ప్రజావాణి' కార్యక్ర మాన్ని నిర్వహించింది. బాలల దినోత్స వం, బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర బాల ల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూనిసెఫ్ భాగస్వా మ్యంతో ''నా రోజు.. నా హక్కులు.. నా భవిష్యత్'' నినాదంతో సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఈ కార్యక్ర మాన్ని చేపట్టారు. జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు స్వయంగా విద్యార్థుల నుంచి వినతిపత్రాలను స్వీక రించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులతో ఆయన నేరుగా మాట్లాడి, బడుల్లో మరియు వారు నివసించే ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలు ఎలాంటి భయం, సంకోచం లేకుండా తమ సమస్యలను చెప్పుకునేం దుకు స్నేహపూర్వక వాతావరణంలో ప్రత్యేక డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రతి సోమవారం మండల, జిల్లా స్థాయిల్లో ప్రజావాణి నిర్వహించే తీరు, వివిధ శాఖల అధికారుల బాధ్యతలు, అర్హత కలిగిన దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించే విధానం మరియు ప్రభుత్వ అనుమతి అవసర మైన అంశాలను రాష్ట్ర స్థాయికి నివేదిం చే ప్రక్రియను కలెక్టర్ విద్యార్థులకు ప్రత్య క్షంగా వివరించారు.

విద్యార్థులు సమర్పించిన అర్జీలను పరి శీలించి, జిల్లా స్థాయిలో పరిష్కరించ గల సమస్యలపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన పిల్లల ప్రజావాణికి మొత్తం 32 దరఖాస్తులు అందాయి. ఇందులో కలెక్టరేట్‌లో నిర్వ హించిన కార్యక్రమంలో 10 దరఖా స్తులు రాగా, జిల్లాలోని 10 మండల కేంద్రాల్లో నిర్వహించిన పిల్లల ప్రజావా ణిలో 22 దరఖాస్తులు నమోదయ్యాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు, జిల్లా సంక్షేమ అధికారిణి ప్రేమలత, డీఎస్పీ కిషోర్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె. ఓంకార్, మిషన్ కోఆర్డినేటర్ ఏ. రమాదేవి, బాలల పరిర క్షణ విభాగం, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సూర్యాపేట బిడ్డకు జాతీయ గౌరవం - డా. ఆనందరావు వాఘ్మారేకు బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డు

ఢిల్లీ కరోల్ బాగ్ ఎమ్మెల్యే విశేష్ రవి చేతుల మీదుగా అవార్డు ప్రదానం



సూర్యాపేట, నవంబర్ 16: వుదయం ప్రతినిధి

సూర్యాపేట బిడ్డ, ప్రముఖ వైద్యులు, సామాజిక సేవకులు డా. ఆనందరావు వాఘ్మారే కి జాతీయ స్థాయిలో అత్యు న్నత గౌరవం దక్కింది. భారత రాజధాని న్యూఢిల్లీలో నవంబర్ 15, 2026 నాడు జరిగిన జాతీయ స్థాయి అవార్డుల ప్రదా నోత్సవంలో ఢిల్లీ కరోల్ బాగ్ నియోజక వర్గ ఎమ్మెల్యే శ్రీ విశేష్ రవి చేతుల మీదుగా ఆయనకు "బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డు – 2026" ను ఘనంగా అందజేశారు. డా. ఆనందరావు వాఘ్మారే కేవలం వైద్యులు మాత్రమే కాదు, మానవత్వానికి నిదర్శనం. గత 10 సంవత్సరాలుగా ఆయన చేస్తున్న సేవలు మహోన్నతమైనవి. సొంత ఖర్చులతో అనాథాశ్రమాన్ని నిర్వహిస్తూ, పేద, అనాథ పిల్లలకు ఉచితంగా భోజనం, వసతి, పాఠశాల విద్య అందిస్తున్నారు. నిరుద్యోగ యువత కోసం స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ను ప్రారంభించారు. 10వ తరగతి, ఇంట ర్మీడియట్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకు ఉచితంగా శిక్షణ, భోజనం, వసతి కల్పించి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. క్రమం తప్పకుండా ఉచిత వైద్య శిబిరాలు (హెల్త్ క్యాంప్స్) నిర్వహిస్తూ, వైద్యం చేయించుకోలేని పేద, నిరుపేదలకు ఉచితంగా చికిత్స అందిస్తూ వారి ప్రాణాలను కాపాడుతున్నారు. ఈ విశేష సేవలను గుర్తించిన జాతీయ జ్యూరీ ఆయనను ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపిక చేసింది. డా. ఆనందరావు వాఘ్మారే కి జాతీయ అవార్డు రావడంపై సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా హర్షాతిరే కాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజావాణి అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి: కలెక్టర్

జనగామ, నవంబర్ 16 (వుదయం ప్రతినిధి):



ప్రజావాణిలో వివిధ సమస్యలతో వచ్చే ప్రజల అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించా లని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమ వారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాల యంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్హాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఫిర్యాదులను స్వీకరించి, పరిశీలించా రు. ఈ సందర్భంగా (298) అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖ ాస్తులను సంబంధిత శాఖల అధికా రులకు కేటాయిస్తూ, ప్రజా సమస్యలపై తగిన చర్యలు తీసుకొని, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అధి కారులకు సూచించారు. ప్రజావాణి దర ఖాస్తుల పరిష్కారాలను వేగవంతం చేయాలని, పెండింగ్ లో లేకుండా దర ఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించా లని ఆదేశించారు. ఈరోజు ప్రజావాణికి వచ్చిన కొన్నింటి దరఖాస్తుల వివరా లిలా ఉన్నాయి..జిల్లాకు చెందిన వివిధ జర్నలిస్టు సంఘాలు, వార్తాపత్రికలు, మీడియా సంస్థల ప్రతినిధులు, వార్తా పత్రికలు, మీడియా సంస్థలకు వచ్చే అర్హత గల ప్రకటనల ఆదాయంలో 10 శాతం వాటాను జర్నలిస్టుల పెన్షన్, సంక్షేమ నిధికి కేటాయించాలని, ప్రభుత్వం తర పున అదనంగా 3 శాతం వాటా అందిం చాలని, ప్రత్యేక బ్యాంకు ఖాతా ఏర్పాటు చేసి, పారదర్శక ఆడిటింగ్‌తో నిధిని నిర్వహించాలని, అర్హులైన పనిచేస్తున్న, పదవీ విరమణ చేసిన జర్నలిస్టులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించేలా నిపుణుల కమిటీ ఏర్పాటుచేయాలని మనవి చేస్తూ దరఖాస్తు చేసుకున్నారు. జనగామ పట్ట ణానికి చెందిన గజ్జెల నరేష్, తన కుమా రుడు గజ్జెల సుధాన్స్‌కు 91 శాతం వినికిడి లోపం ఉన్నందున దివ్యాంగుల పిం ఛన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తూ దరఖాస్తు చేసియున్నారు. పాలకుర్తి మండలం, సిరిసన్నగూడెం గ్రామానికి చెందిన సంసి కొమురమల్లు, తన పట్టా భూమికి సంబంధించి ఇతరులు అక్ర మంగా పట్టా చేసుకున్నారని, ఈ మేరకు విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయగలరని విన్నవిస్తూ ఆర్జీ ద్వారా కోరారు. జఫర్ గఢ్ మండలం, తిమ్మంపేట గ్రామానికి చెందిన మంద రాజయ్య, తన భూమికి సంబంధించి తనకు బదులుగా తన సోదరుడి పేరున పట్టా నమోదైందని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయవలసిందిగా కోరుతూ దరఖాస్తు అందించారు. పటేల్ గూడెం గ్రామం, లింగాల ఘనపురం మండలా నికి చెందిన జోగు యాదయ్య, వికలాం గుల పింఛను ఇప్పించగలరని అభ్యర్థి స్తూ వినతిపత్రం అందజేశారు. ఈ ప్రజావాణిలో జెడ్పీ సీఈవో బలరామ రావు, డీఆర్డీఓ భాస్కర్, సీపీఓ చిన కోట్యా నాయక్, ఎస్ఈ ఎస్పీడీసీఎల్ సంపత్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికా రులు, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత – కలెక్టర్



సూర్యాపేట నవంబర్ 16 వుదయం ప్రతినిధి

బాలల హక్కులను పరిరక్షించడం, వారి జీవన విధానానికి సురక్షితమైన వాతావ రణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బాలల హక్కుల పరిర క్షణ వారోత్సవాల్లో భాగంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమ వారం ఐడీఓసీ కార్యాలయంలో బాలల ప్రత్యేక ప్రజావాణి నిర్వహించారు. ఈ ప్రత్యేక ప్రజావాణిలో బాలల నుంచి 22 వినతులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాలల నుంచి 22 దరఖాస్తులు అంది నట్లు వెల్లడించారు. బాలలు తమ సమ స్యలను ఎలాంటి భయం, సంకోచం లేకుండా స్వేచ్ఛగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాలల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపేందుకు ప్రజావాణి ప్రాంగణంలో ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డీసీపీయూ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు పేర్కొన్నారు. విద్య, వైద్యం, పోషకాహారం, బాలల రక్షణ, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలకు సంబంధిం చిన సమస్యలను బాలలు ప్రత్యేక డెస్క్ ద్వారా నేరుగా అధికారులకు తెలియజే శారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్వో ప్రేమ్ రాజు, జెడ్పీ సీఈవో శిరీష, డీఆర్డీఓ పీడీ సన్యాసయ్య, డీడబ్ల్యూవో నరసింహా రావు, బాలల సంరక్షణ అధికారి రవికు మార్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినతులు, దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి.. కలెక్టర్

ఖమ్మం వుదయం బ్యూరో , నవంబర్ -16:

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్



ప్రజల నుంచి స్వీకరించిన వినతులు, దరఖాస్తులను జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదే శించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డిలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఏదులా పురం మున్సిపాలిటీ ఎస్సీ కాలనీకి చెందిన పి. వెంకన్న తనకు వినికిడి సమస్య ఉందని, సదరం సర్టిఫికెట్ జారీ చేసి వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డీఆర్డీఓకు పంపిస్తూ అవస రమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొ రేషన్ పరిధిలోని కైకొండాయిగూడెం గ్రామానికి చెందిన ముస్లిం ప్రతినిధులు తమ గ్రామంలో 40 కుటుంబాలు నివ సిస్తున్నాయని, అంత్యక్రియలు నిర్వహిం చేందుకు స్థలం లేక ఇబ్బందులు పడు తున్నామని తెలిపారు. గ్రామంలోని సర్వే నంబర్ 223/ఏలో ఉన్న 3 ఎకరాల 3 గుంటల ప్రభుత్వ భూమిలో ఒక ఎకరం కబ్రస్థాన్ కోసం కేటాయిం చాలని కోరుతూ దరఖాస్తు సమర్పిం చారు. దీనిపై తహసీల్దార్‌కు పంపిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశిం చారు. చింతకాని మండలం పాతర్ల పాడు గ్రామానికి చెందిన ఏ. మునయ్య తనకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించా లని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ హౌసింగ్‌కు పంపిస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముదిగొండ మండలం బాణాపురం గ్రామానికి చెందిన వేముల వెంకటేష్ తన కుమారులకు ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్య అందేలా ఫీ రీయింబ ర్స్‌మెంట్ వచ్చేలా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా విద్యాశాఖ అధికారి, సంక్షేమ శాఖ అధికారులకు పంపిస్తూ పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. రామమూర్తి, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్



యాదాద్రి భువనగిరి జిల్లా వుదయం ప్రతినిధి:

సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్య క్రమంలో జిల్లా కలెక్టర్,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 147 అర్జీలను స్వీకరించారు. ప్రజావా ణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్ప టికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. పిల్లల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిర క్షణ కమిషన్ బాలల హక్కుల వారోత్స వాల్లో భాగంగా సాధారణ ప్రజావాణితో పాటు బాలల ప్రత్యేక ప్రజావాణి జిల్లా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అందులో రెవిన్యూ శాఖ 71, మండల పరిషత్ 17, గ్రామీణ అభివృద్ధి 11, సంక్షేమ శాఖ 8, సర్వే ల్యాండ్స్ 7, మున్సిపాలిటీ 7, విద్య 5, హౌసింగ్ 4, ఉపాధి కల్పన 4, ఇరిగేషన్ 3, వైద్య ఆరోగ్య శాఖ 2, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ 2, ఎల్.డి.యం, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఎస్సీ సంక్షేమం, బి.సి సంక్షేమం, సమాచార శాఖ, ఆర్టీసీ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జెడ్పీ సీఈఓ శోభా రాణి, హౌసింగ్ పీడీ అలివేలు , జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత..

విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం!

ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి:

టి ఏ జి ఎస్ జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్



భూపాలపల్లి నవంబర్ 16 వుదయం ప్రతినిధి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా:జయ శంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు అనేక సబ్జెక్టులకు ఉపాధ్యా యులు లేకపోవడం దుర్మార్గమని, దీనివల్ల ఆదివాసీ విద్యార్థుల చదువులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ విమ ర్శించారు. జిల్లాలోని మాదారం ఆశ్రమ పాఠశాల: బయోసైన్స్, మ్యాథ్స్ ఉపా ధ్యాయులు లేరు. ముకునూరు ఆశ్రమ పాఠశాల: మ్యాథ్స్, ఇంగ్లీష్, హిందీ ఉపాధ్యాయులు లేరు. పెగడపల్లి ఆశ్రమ పాఠశాల: హిందీ ఉపాధ్యాయుడు లేరు. మహాదేవపూర్ గర్ల్స్ ఆశ్రమ పాఠశాల: సోషల్, హిందీ ఉపాధ్యా యులు లేరు. భూపాలపల్లి గర్ల్స్ ఆశ్రమ పాఠశాల: హిందీ ఉపాధ్యాయుడు లేరు ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులకు కీలక మైన సబ్జెక్టుల్లో విద్యాబోధన జరగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని ఖాళీలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఉపాధ్యాయు లను నియమించకపోవడం వల్ల విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడే ప్రమాదం ఉందని రాజేందర్ పేర్కొ న్నారు. ముఖ్యంగా పరీక్షల సమయంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీ విద్యార్థులకు నాణ్య మైన విద్య అందిం చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను పరిష్క రించాలని కోరుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వ హించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి, ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేసినట్లు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ తెలిపారు. ప్రభుత్వం, సంబంధిత గిరిజన సంక్షేమ శాఖ అధి కారులు తక్షణమే స్పందించి ఉపాధ్యా యుల నియామకాలు చేపట్టాలని, ఆదివాసీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులను కదిలించి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలకు కోనుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కంటి సభ్యులు మేకల రాజు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

ఈనెల 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

నల్గొండ

డిసెంబర్ 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ..

జిల్లాలోని అన్ని కుటుంబాలు దరఖాస్తు చేసుకోవాలి: కలెక్టర్



కుటుంబాన్ని పోషించే వ్యక్తి మరణించి నప్పుడు ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. జిల్లాలోని అన్ని కుటుంబాలు ఈ పథకా నికి దరఖాస్తు చేసుకోవచ్చని, నవంబర్ 19 నుంచి డిసెంబర్ 20 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుపై సోమవారం కలెక్టరేట్ నుంచి మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహ సిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబాన్ని పోషించే వ్యక్తి 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉంటే ఈ పథకానికి అర్హులని తెలిపారు. కుటుంబ పోషకుడు మరణించినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురి కాకుండా భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని వివరించారు. వయసు ధ్రువీకరణకు ఆధార్ కార్డు సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి కుటుంబం ఈ పథ కానికి దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి బీమా పొందే వ్యక్తిగా ఉంటారని, కుటుంబ సభ్యులు నామినీలుగా ఉండ వచ్చని తెలిపారు. ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను కూడా సూచించవ చ్చని, కుటుంబ పెద్ద నామినీల వివరా లను సమర్పించాలని చెప్పారు. కుటుంబ పోషకుడు మరణించినట్ల యితే రూ.5 లక్షల జీవిత బీమా అందజే స్తారని వెల్లడించారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఎలాంటి ఛార్జీలు, ఫీజులు లేదా ప్రీమియం చెల్లిం చాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఉన్న ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకోవ చ్చని, రేషన్ కార్డు లేని కుటుంబాలకు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. నవంబర్ 19న రాష్ట్రవ్యా ప్తంగా ఈ పథకం ప్రారంభమవుతుం దని, డిసెంబర్ 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ఇందుకోసం ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయంలో, మున్సిపల్ వార్డు కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారు లను ఆదేశించారు. ప్రతి కేంద్రానికి ఒక సెంటర్ ఇన్‌చార్జిని నియమించాలని, ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. మూడు నుంచి నాలుగు క్లస్టర్లకు ఒక సూపర్‌వై జర్‌ను నియమించి, గ్రామపంచాయ తీల వారీగా పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. జిల్లాలో సుమారు 4 లక్షల 86 వేల కుటుంబాలు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ వెల్లడించారు. రేషన్ కార్డు ఆధారంగా ఆన్‌లైన్ దరఖాస్తుల్లో ముందుగానే కొన్ని వివరాలు నమోదు అయి ఉంటాయని చెప్పారు. దరఖాస్తుల వివరాలను నమోదు చేసే సమయంలో కుటుంబ పోషకుడు, నామినీల వివరా లను తప్పనిసరిగా జాగ్రత్తగా పరిశీ లించి నమోదు చేయాలని సూచించారు. నామిని మైనర్ అయినట్ల యితే బీమా పొందే వ్యక్తి సమ్మతించిన వ్యక్తిని నామినీగా ఏర్పాటు చేసుకోవ చ్చని తెలిపారు. దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డులను జత చేయాలని, వాటిని మొబైల్ యాప్ లేదా వెబ్ పోర్టల్ ద్వారా అప్‌లోడ్ చేయాలని చెప్పారు. హార్డ్ కాపీలను ఎంపీడీవో కార్యాలయంలో భద్రపరచాలని ఎంపీ డీవోలను ఆదేశించారు. దరఖాస్తుదా రుల నుంచి ఇటీవల తీసిన ఫొటోలు లేదా ఎలాంటి డిక్లరేషన్ అవసరం లేదని, దరఖాస్తు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఉంటే సరిపోతుందని స్పష్టం చేశారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఈ పథకంపై ప్రతి కుటుంబానికి అవగా హన కల్పించాలని, ముందుగానే గ్రామాల్లో దండోరా వేయించాలని అధి కారులను ఆదేశించారు. నవంబర్ 19 నుంచి డిసెంబర్ 20 వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని, మండల ప్రత్యేక అధికారులు ప్రతిరోజూ స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఒకేసారి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని తెలిపారు. ఈ పథకం పర్యవేక్షణ బాధ్య తలను ఎంపీడీవోలు, ఎంఈవోలు, తహ సిల్దార్లు, ఏఈపీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీవోలు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, సీపీఓ శ్రీనివాస్ నాయక్, డీపీవో తరుణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

హనుమకొండ, నవంబర్ 16 (వుదయం ప్రతినిధి):

ఈ నెల 22న నిర్వహించనున్న పల్స్ పోలియో (సబ్ నేషనల్ ఇమ్యూనైజేషన్ డే) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని హనుమ కొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన

కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

ప్రతి కుటుంబానికి 5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లక్ష్యం: కలెక్టర్

జగిత్యాల నవంబర్ 16 (వుదయం ప్రతినిధి)

నవంబర్ 19 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు

జగిత్యాలలో 2,83,458 కుటుంబాల నమోదు లక్ష్యం

20 మండలాలు 5 మున్సిపాలిటీల పరిధిలో 481 శిబిర కేంద్రాల ఏర్పాటు

రాష్ట్రప్రభుత్వం నవంబర్ 19 నాడు ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం (ఐకేజేబిపి) ద్వారా ప్రతి అర్హులైన కుటుంబానికి 5 లక్షల రూపాయల జీవిత బీమా భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబంలోని సంపాదించే సభ్యునికి జీవిత బీమా రక్షణ కల్పించడం ద్వారా ఆ కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు నవంబర్ 19 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న ఈ పథకంలో అర్హులైన ప్రతి కుటుంబాన్ని నమోదు చేసేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. పథకం ఉద్దేశం అర్హతలు నమోదు విధానం అవసరమైన పత్రాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు.

పథకం అర్హతలు బీమా నిబంధనలు

ఈ పథకం కింద ఒక్కో అర్హులైన కుటుంబానికి 5 లక్షల రూపాయల జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు కుటుంబంలో సంపాదించే సభ్యుని వయస్సు 18 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉండాలని వివరించారు వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకుంటారని తెలిపారు ఆధార్ కార్డులో కేవలం పుట్టిన సంవత్సరం మాత్రమే నమోదై ఉన్న సందర్భంలో జూలై 1వ తేదీని పుట్టిన తేదీగా పరిగణిస్తారని పేర్కొన్నారు.పథకంలో ఒకసారి నమోదు చేసుకున్న తర్వాత బీమాదారుడు వయోపరిమితిని దాటినా కనీసం ఒక సంవత్సరం పాటు పూర్తి బీమా రక్షణ లభిస్తుందని తెలిపారు. ఇతర జిల్లాలకు చెందిన ఆహార భద్రత కార్డు కలిగిన కుటుంబాలు కూడా జగిత్యాల జిల్లాలోని తమకు సమీపంలోని శిబిర కేంద్రంలో నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. అర్హత కలిగిన కుటుంబాలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

జిల్లాలో నమోదు లక్ష్యాలు శిబిర కేంద్రాల ఏర్పాటు

జగిత్యాల జిల్లాలో మొత్తం 2,83,458 కుటుంబాలను ఈ పథకంలో నమోదు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో 385 గ్రామ పంచాయతీల ద్వారా సుమారు2,01,038 కుటుంబాలను ఐదు మున్సిపాలిటీల పరిధిలోని 136 వార్డుల ద్వారా 82,420 కుటుంబాలను నమోదు చేయాల్సి ఉందని వివరించారు. పట్టణ ప్రాంతాల్లోని కుటుంబాలు జిల్లా మొత్తం లక్ష్యంలో సుమారు 29 శాతం ఉన్నాయని తెలిపారు. నమోదు ప్రక్రియ సులభంగా ప్రజలకు అందుబాటులో ఉండేలా జిల్లా వ్యాప్తంగా మొత్తం 481 శిబిర కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున 385 శిబిర కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో 96 శిబిర కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ప్రతి అర్హులైన కుటుంబానికి సమీపంలోనే నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని శిబిరాల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

శిబిరాల పర్యవేక్షణ అధికారుల బాధ్యతలు

ప్రతి నాలుగు శిబిర కేంద్రాలకు ఒక పర్యవేక్షకుడిని నియమించే విధంగా జిల్లాలో సుమారు 121 మంది పర్యవేక్షకులను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ప్రతి శిబిరానికి గ్రామ పంచాయతీ కార్యదర్శి లేదా వార్డు అధికారి ఇన్చార్జిగా వ్యవహరించాలని ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ ఒక హెల్ప్ డెస్క్ ఇన్చార్జిని అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లా కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తూ శిబిరాల షెడ్యూల్ను ఆమోదించడం నమోదు ప్రక్రియను పర్యవేక్షించడం ప్రతి రోజూ పురోగతిని సమీక్షించడం చేస్తారని తెలిపారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జిల్లా స్థాయి అధికారులు మండల ప్రత్యేక అధికారులు సమన్వయంతో మండల స్థాయిలో పథకం అమలును పర్యవేక్షించాలని పేర్కొన్నారు. తహసీల్దార్లు ఎంపీడీఓలు డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లు గ్రామ పంచాయతీలు పట్టణ ప్రాంతాల్లో సమన్వయ బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు తమ మున్సిపాలిటీల పరిధిలో శిబిరాల నిర్వహణను పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు వార్డు అధికారులు శిబిర ఇన్చార్జులుగా వ్యవహరిస్తూ స్థానికంగా ప్రజలకు సమాచారం అందించడం దరఖాస్తుల స్వీకరణ సిబ్బంది



పర్యవేక్షించడం ప్రతి రోజూ పురోగతిని సమీక్షించడం చేస్తారని తెలిపారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జిల్లా స్థాయి అధికారులు మండల ప్రత్యేక అధికారులు సమన్వయంతో మండల స్థాయిలో పథకం అమలును పర్యవేక్షించాలని పేర్కొన్నారు. తహసీల్దార్లు ఎంపీడీఓలు డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లు గ్రామ పంచాయతీలు పట్టణ ప్రాంతాల్లో సమన్వయ బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు తమ మున్సిపాలిటీల పరిధిలో శిబిరాల నిర్వహణను పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు వార్డు అధికారులు శిబిర ఇన్చార్జులుగా వ్యవహరిస్తూ స్థానికంగా ప్రజలకు సమాచారం అందించడం దరఖాస్తుల స్వీకరణ సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

శిబిరాల్లో కల్పించాల్సిన సౌకర్యాలు

ప్రతి శిబిరంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు కుర్చీలు తాగునీరు విద్యుత్ సౌకర్యం పవర్ బ్యాకప్ ఇంటర్నెట్ కనెక్షన్ ప్రింటర్ అవసరమైన దరఖాస్తు ఫారాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. వృద్ధులు దివ్యాంగులు బలహీన వర్గాలకు చెందిన వ్యక్తులు శిబిరాలకు వచ్చినప్పుడు వారికి ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక సహాయం అందించాలని పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు వివరాలు నింపడంలో సహాయం చేయాలని పత్రాల పరిశీలన ఆధార్ ధ్రువీకరణ నామినీ వివరాల నమోదు వంటి ప్రక్రియలను సులభతరం చేయాలని సూచించారు. ప్రతి శిబిరంలో ప్రజల సందేహాల నివృత్తికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు.

మీ సేవ ద్వారా నమోదు ప్రక్రియ

ఆహార భద్రత కార్డు (ఎఫ్ఎస్సి) కలిగిన కుటుంబాలకుమీ సేవద్వారా రేషన్కార్డు నంబర్ ఆధారంగా ముందుగా వివరాలు నమోదైన దరఖాస్తు ఫారం అందుబాటులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుదారులు ముందు గా అందులో నమోదైన కుటుంబ వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు ఉంటే సరి చూసుకోవాలని సూచించారు. అనంతరం బీమాదారుని ఎంపిక చేసి నామినీ వివరాలు నమోదుచేసి దరఖాస్తుపై సంతకం చేయాలని తెలిపారు. సంతకం చేసిన దరఖాస్తును శిబిరంలో సమర్పించాల్సి ఉంటుందని అనంతరం మీ సేవ ద్వారా సంతకం చేసిన ఫారాన్ని అప్లోడ్ చేసి రసీదు పొందవచ్చని వివరించారు ఆహార భద్రత కార్డు లేని కుటుంబాలు కూడా ఈ పథకంలో కొత్తగా నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అటుపంటి కుటుంబాలుశిబిరంలో ఖాళీ దరఖాస్తు ఫారం తీసుకుని అవసరమైన వివరాలను నింపి బీమాదారుని ఆధార్ కార్డు ప్రతిని జతచేసి సంతకంతో సమర్పించాలని సూచించారు. మీ సేవలో 'ఎఫ్ ఎస్ సి లేదు' అనే ఆప్షన్ ను ఎంపిక చేసి ఆధా ర్ ఓటీపీ ద్వారా ధ్రువీకరణ చేయాల్సిఉంటుందనితెలిపారు. కుటుంబ సభ్యుల వివరాలు బీమాదారుని వివరాలు నామినీ వివరాలను నమోదు చేసి రసీదు పొందవచ్చని పేర్కొన్నారు.

దరఖాస్తుకు అవసరమైన పత్రాలు

పథకంలో నమోదు చేసుకునే సమయంలో బీమాదారుని ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతిని తప్పనిసరిగా తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు కుటుంబ సభ్యులందరి ఆధార్ నంబర్లు ఆహార భద్రత కార్డు లేదా రేషన్ కార్డు (ఉంటే) మొబైల్ నంబర్ నామినీకి సంబంధించిన వివరాలను అందుబాటులోఉంచుకోవాలని సూచించారు. నామినీ మైనర్ అయిన సందర్భంలో అపాయింటీ ఆధార్ కార్డు వివరాలను కూడా సమర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తు సంఖ్య కేటాయింపులో ఆహార భద్రత కార్డు కలిగిన కుటుంబాలకు రేషన్ కార్డు నంబరునే దరఖాస్తు సంఖ్యగా కేటాయిస్తారని తెలిపారు. రేషన్ కార్డులేని కుటుంబాలకు జిల్లా కోడ్ మండల కోడ్ గ్రామ పంచాయతీ లేదా వార్డు కోడ్ క్రమ సంఖ్య ఆధారంగా ప్రత్యేక దరఖాస్తు సంఖ్య కేటాయిస్తారని వివరించారు.

నామినీ ఎంపికలో పాటించాల్సిన నిబంధనలు

బీమాదారుడు దరఖాస్తు సమయంలో నామినీ వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను ఎంపిక చేసుకున్న సందర్భంలో ప్రతి నామినీకి కేటాయించే క్లెయిమ్ శాతాల మొత్తం 100 శాతంగా ఉండాలని తెలిపారు. నామినీ వివరాలను నమోదు చేసే సమయంలో ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. రేషన్ కార్డులో కుటుంబ సభ్యుని పేరు లేని సందర్భంలోనూ సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి లేదా వార్డు అధికారి ధ్రువీకరణ ఆధారంగా ఆ సభ్యుని వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కాబట్టి అర్హులైన కుటుంబాలు అవసరమైన వివరాలను సమర్పించి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.

ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమాలు

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు సర్పంచులు స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి పథకం లక్ష్యం అర్హతలు నమోదు విధానం అవసరమైన పత్రాల గురించి వివరించాలని తెలిపారు.నవంబర్ 17, 18 తేదీల్లో జిల్లాలోని అన్ని గ్రామాలు పట్టణ వార్డుల్లో డప్పు చాటింపు ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.

సర్పంచులు వార్డు సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రతి ఇంటికి పథకం సమా చారం చేరవేయాలని తెలిపారు. ప్రజలు తమకు సమీపంలోని శిబిర కేంద్రం ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారో తెలుసుకునేలా ముందస్తు సమాచారం అందించాలని పేర్కొన్నారు. పత్రికలు టెలివిజన్ సోషల్ మీడియా పోస్టర్లు కరపత్రాలు ఆడియో వీడియో సందేశాల ద్వారా పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదు: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు

నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి)16 నవంబర్ 2026

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవ రావు తో కలిసిఆయన పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు



సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను సమర్పించారు. సోమవారం కలెక్టరేట్లో పిల్లల సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేకంగా పిల్లల ప్రజావాణి ఏర్పాటు చేశారు. ఈ పిల్లల ప్రజావాణికి పలువురు తమ వినతులు సమర్పించారు. ఇండియాబుక్ ఆఫ్ రికార్డ్ ఘనత సాధించిన చిన్నారికి అదనపు కలెక్టర్ అభినందన: ఐదేళ్ల వయసులోనే ఏక కాలంలో రెండు చేతులతో రాసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డు ఘనత సాధించిన చిన్నారిని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవరావు అభినందించారు. నిర్మల్ గ్రామీణ మండలం వెంగ్వాపేట్ గ్రామానికి చెందిన నాళం శ్రవణ్ కుమార్, గౌతమి దంపతుల కూతురు నిద్యాన ఇండియా బుక్ ఆఫ్ రికార్డు ఘనత సాధించింది. అదనపు కలెక్టర్ చిన్నారిని అభినందించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారిని భవిష్యత్తులో మరింత ప్రోత్సహించాలని చెప్పారు. ఈ ప్రజావాణి లోడిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి హెల్తీ రన్ – 5Kలో యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి – కలెక్టర్

పెద్దపల్లి, నవంబర్ 16 (వుదయం ప్రతినిధి)

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా నవంబర్ 29న హెల్తీ రన్ నిర్వహణ

YES FOR LIFE – SAY NO TO DRUGS నినాదంతో ప్రజల్లో అవగాహన కార్యక్రమం

హెల్తీ రన్ – 5K పోస్టర్ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా నవంబర్ 29, 2026 (ఆదివారం) నిర్వహించనున్న పెద్దపల్లి హెల్తీ రన్ – 5K కార్యక్రమంలో యువత, విద్యార్థులు,జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకోరారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తన ఛాంబర్లో పెద్దపల్లి హెల్తీ రన్ – 5K కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, YES FOR LIFE – SAY NO TO DRUGS అనే నినాదంతో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పెద్దపల్లి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాల పై కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు. ఈ రన్ అండ్ వాక్ కార్యక్రమం ద్వారా డ్రగ్స్కు వ్యతిరేకంగా బలమైన సామాజిక సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, రిజిస్ట్రేషన్ పూర్తిగా ఉచితమని కలెక్టర్ పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ప్రజావాణికి విశేష స్పందన: 148 ఫిర్యాదులు స్వీకరణ

కామారెడ్డి, నవంబర్ 16 (వుదయం ప్రతినిధి):



జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, కామారెడ్డి ద్వారా నిర్వహించిన "పిల్లల ప్రజావాణి (PILLALA PRAJAVANI)" కార్యక్రమానికి పిల్లల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమం ద్వారా మొత్తం 148 ఫిర్యాదులు, వినతులు స్వీకరించడం జరిగింది.బాలలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై పిల్లలు తమ ఫిర్యాదులను అందజేశారు. స్వీకరించిన 148 ఫిర్యాదులను సంబంధిత అంశాల వారీగా పరిశీలించి,సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, బాలలకు సంబంధించిన సమస్యలను ఎవరైనా నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని అధికారులు సూచించారు.బాలల రక్షణ, సంక్షేమం మరియు హక్కుల పరిరక్షణ కోసం జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని, బాలల సమస్యల పరిష్కారంలో ప్రజలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు భాగస్వాములు కావాలని కోరారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు అధికారులతో సమీక్షలో కలెక్టర్

నిజామాబాద్, నవంబర్ 16 :



రాష్ట్రంలో డిసెంబర్ నెలలో ప్రతిష్టాత్మకంగా జరుగనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026 లో భాగంగా నిజామాబాద్ జిల్లాలో డిసెంబర్ 13 నుండి ఐదు రోజుల పాటు టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీలు కొనసాగుతాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఖేలో ఇండియా క్రీడా పోటీలను పురస్కరించుకుని కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం సంబంధిత అధికారులతో క్రీడల నిర్వహణ ఏర్పాట్లపై సెల్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్ జాజు ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత జిల్లాల కలెక్టర్లతో సమీక్ష జరిపారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా జరిగే ఖేలో ఇండియా పోటీలకు సంబంధించి టేబుల్ టెన్నిస్ కోసం నిజామాబాద్ జిల్లాను ఎంపిక చేయడం ఎంతో గొప్ప విషయం అని అన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. మాక్లూర్ మండలం దాస్నగర్ సమీపంలోని నవ్య భారతి గ్లోబల్ స్కూల్ స్టేడియంలో ఖేలో ఇండియా గేమ్స్ లో భాగంగా టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీలు జరుగుతాయని అన్నారు. దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల నుంచి హాజరయ్యే క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సమకూర్చాలని, వసతి, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు తదితర అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా, ఖేలో ఇండియా గేమ్స్ ను వేదికగా మలుచుకుని క్రీడలపై విద్యార్థులలో, యువతలో మరింత ఆసక్తి పెంపొందించేలా జిల్లాలో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. దీనిపల్ల యువత మత్తు పదార్థాలు వంటి వాటికి దూరంగా ఉండేలా కృషి చేసినట్లు అవుతుందన్నారు. అన్ని పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు తెలిసేలా లోగో, మస్కట్ లను ప్రదర్శించాలని, సెల్ఫీ పాయింట్ లు ఏర్పాటు చేయాలని, క్విజ్, పెయింటింగ్, డ్రాయింగ్ వంటి పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రాంతాల్లో కూడా ఫ్లెక్సీలు, లోగోలు, మస్కట్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఐ.డీ.ఓ.సీ, ఓల్డ్ కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లు, పార్కులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు తదితర ప్రముఖ ప్రాంతాల్లో మస్కట్, లోగోతో కూడిన కటౌట్లు, స్టాండీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న అన్ని మార్గాల ద్వారా ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026కు విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు.

ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ, యువజన సంఘాలు, క్రీడా సంఘాల భాగస్వామ్యంతో ఖేలో ఇండియా రన్, వాకథాన్ లేదా సైక్లోథాన్ వంటి కార్యక్రమాలను చేపట్టి క్రీడల ప్రాధాన్యతను చాటాలన్నారు. సమీక్షలో ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీవైఎస్ఓ పవన్ కుమార్, ఇంచార్జి డీఈఓ సాయాగౌడ్, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియాపై విస్తృత ప్రచారం చేపట్టాలి



ఆసిఫాబాద్, (వుదయం ప్రతినిధి):

రాష్ట్రంలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్నఖేలో ఇండియా క్రీడలపై జిల్లాలో విస్తృత ప్రచారం చేపట్టాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు.

సోమవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, క్రీడల శాఖ కార్యదర్శి వాణి ప్రసాద్, ఎండీ సోని బాలదేవితో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో మంత్రి మాట్లాడారు. జిల్లాలో ర్యాలీలు నిర్వహించడంతో పాటు మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి యువత, క్రీడాకారులను భాగస్వాములను చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ నుంచీ కలెక్టర్ కె.హరిత హాజరు అయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సేవల, క్రీడా శాఖ అధికారి అశ్వక్ అహ్మద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

165 మందికి కొత్త పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ: మంత్రి అడ్లూరి

ధర్మపురి నవంబర్16 (వుదయం ప్రతినిధి):



అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణ అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకువచ్చి అన్ని రంగాల్లో పట్టణాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు.ధర్మపురి మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన నూతన చేయూత సామాజిక భద్రత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డులకు చెందిన 165 మంది నూతన పింఛను దారులకు మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ గత పదేళ్ల పాలనలో అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందిస్తున్నామని తెలిపారు.

రేషన్కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీతో పాటు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తూ వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తది తర అర్హులకు చేయూత పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు పింఛన్లు పొందని అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విడతలవారీగా ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.ధర్మపురి అభివృద్ధి బాధ్యతనాదే అన్నారు. ధర్మపురి పట్టణ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని మంత్రి తెలిపారు. పుష్కరాల అభివృద్ధి పనుల కోసం నిధులు విడుదల చేయించి, పనులు సైతం ప్రారంభించామని వెల్లడించారు. ధర్మ పురికి అవసరమైన నిధులను తీసుకువచ్చి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రసూనాంభ, పీడీ డీఆర్డీఏ రఘువరన్, మున్సి పల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి రాజేష్, వైస్ చైర్మన్ రామన్న, కౌన్సిలర్లు మున్సిపల్ మేనేజర్ గంగాధర్, వివిధ గ్రామాల సర్పం చులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత ఫెన్షన్ అందించాలి:మాజీ మంత్రి ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ నవంబర్ 16 (వుదయం ప్రతినిధి):

మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

జిల్లా గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకులుగా
ఆర్. రవీందర్ బాధ్యతల స్వీకరణ



మహబూబ్‌నగర్.
మహబూబ్‌నగర్ జిల్లా గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకులుగా ఆర్. రవీందర్ శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు .ఈ సందర్భంగా సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు మొక్కను అందజేశారు. అదిలాబాద్ లో పని చేస్తున్న ఆయన ను డిప్యూటెషన్ పై మహబూబ్ నగర్ గనులు,భూ గర్భ శాఖ శాఖ సహాయ సంచాలకులు(పూర్తి అదనపు బాధ్యతలు) గా నియమిస్తూ గనులు,భూ గర్భ శాఖ
సంచాలకులు ఆదేశాలు జారీ చేశారు

జిల్లాలో గనులు, భూగర్భ శాఖ పరిధిలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, శాఖాపరమైన అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా శాఖ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

పేద రైతు భూమిపై కబ్జా కన్ను!


- రూ.9 లక్షల అప్పుకు ఎకరం భూమి, కోళ్లఫారం వివాదంలోకి!
- కోర్టులో కేసు ఉన్నా ఆగని గొడవలు.. కోళ్లఫారం ధ్వంసం, చెట్ల నరికివేతపై ఆరోపణలు!
- యాలాల్ ఎస్సై తీరుపై రైతు ఆవేదన.. జిల్లా ఎస్పీ జోక్యానికి డిమాండ్!

వికారాబాద్ నవంబర్ 16 (వుదయం బ్యూరో)

అప్పు కోసం భూమిని ఆధారంగా పెడితే చివరకు ఆ భూమే చేజారే పరిస్థితి వచ్చిందంటూ ఓ పేద రైతు కుటుంబం కన్నీటిపర్యంతమవుతోంది. వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం పగిడ్యాల్ గ్రామానికి చెందిన బర్ల వెంకటేశం కుటుంబం తమ ఎకరం భూమి, కోళ్లఫారాన్ని కొందరు వ్యక్తులు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తోంది. న్యాయం కోసం పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తోంది.

రూ.9 లక్షల అప్పు.. భార్య పేరిట రిజిస్ట్రేషన్!

పగిడ్యాల్ గ్రామంలోని సర్వే నంబర్ 96అ4/1/2లో ఉన్న ఎకరం భూమిని ఆధారంగా ఉంచి, పిట్ల నరేష్



మధ్యవర్తిత్వంతో తాండూరుకు చెందిన దూడల వెంకటేశం గౌడ్ వద్ద రూ.9 లక్షలు తీసుకున్నట్లు బాధితుడి తండ్రి బర్ల అడివయ్య తెలిపారు.కొంతకాలం వడ్డీ చెల్లించామని, అసలు తిరిగి చెల్లించేందుకు గడువు కోరామని పేర్కొన్నారు. అయితే తమకు తెలియకుండానే మధ్యవర్తి నరేష్ తన భార్య పిట్ల పద్మమ్మ పేరిట భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు.

కోర్టులో కేసు.. కోళ్లఫారంలో విధ్వంసం!

భూమి వివాదంపై వికారాబాద్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఓఎస్ నంబర్ 381/2025 కేసు పెండింగ్‌లో ఉన్నట్లు బాధితులు తెలిపారు. అయినప్పటికీ కొందరు కోళ్లఫారంలోకి ప్రవేశించి పరదాలు, ఫీడర్లు, డ్రింకర్లు తగులబెట్టి కోళ్లను చంపారని ఆరోపించారు. నవంబర్ 12న పొలంలోని బోరు, వేప చెట్లను సైతం నరికివేశారని పేర్కొన్నారు.

పోలీసుల తీరుపై అనుమానాలు!

నవంబర్ 10న యాలాల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని బాధిత కుటుంబం ఆరోపించింది. ఎస్సై విట్టల్ రెడ్డి తమతో బెదిరింపు ధోరణిలో మాట్లాడారని అడివయ్య పేర్కొన్నారు. కుల సంఘాల నాయకుల అండతో భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తులు, పోలీసుల అధికారిక వివరణ తెలియాల్సి ఉంది.

ఎస్పీ స్పందించాలి.. రైతుకు న్యాయం చేయాలి!

భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు, కోర్టు ఉత్తర్వులు, ఆస్తుల ధ్వంసంపై ఫిర్యాదులను పరిశీలించి నిష్పక్షపాత విచారణ జరిపించాలని బాధిత కుటుంబం కోరుతోంది. స్థానిక ఎస్సైపై ఆరోపణలు ఉన్నందున ఉన్నతాధికారితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తోంది. భూమి హక్కులను కోర్టు తేల్చాల్సి ఉన్నా, ఆస్తుల ధ్వంసంపై ఫిర్యాదులను పోలీసులు పరిశీలించాల్సిందే. పేద రైతుకు న్యాయం ఎప్పుడు? జిల్లా ఎస్పీ స్పందన ఏమిటి? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.



ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి: జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.

- నిష్పక్షపాత విచారణతో బాధితులకు న్యాయం చేయాలి.
- విచారణ పురోగతిని ఎప్పటికప్పుడు ఫిర్యాదుదారులకు తెలియజేయాలి..
- పోలీసు అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం.


మెదక్, నవంబర్ 16: (వుదయం ప్రతినిధి.)

ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు.
ఈ సందర్భంగా బాధితులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణిలో ప్రధానంగా భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు, వేధింపులకు సంబంధించిన అర్జీలు వచ్చాయి. వీటిపై వెంటనే క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, చట్టప్రకారం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎస్పీ సూచించారు.ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదా జాప్యం జరగకూడదని ఆయన స్పష్టం చేశారు. విచారణ ఏ దశలో ఉందో బాధితులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. పోలీసు శాఖపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా పారదర్శకత, జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించి, నాణ్యమైన సేవలు అందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.
బాధితులకు సత్వర న్యాయం అందించడమే పోలీసుల లక్ష్యం కావాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయకుండా పారదర్శకంగా విచారణ జరపాలని ఎస్పీ తెలిపారు.

భూ కేటాయింపుల వివాదం హైకోర్టుకు..

- సంగారెడ్డి కలెక్టర్ సహా అధికారులకు షోకాజ్ నోటీసులు
- న్యాల్కల్ మండలంలో 1.26 గుంటల భూమి కేటాయింపుపై న్యాయపోరాటం

సంగారెడ్డి, నవంబర్ 16:వుదయం.



సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం గుని ఒట్టి గ్రామంలోని భూ కేటాయింపుల వ్యవహారం హైకోర్టుకు చేరింది.సర్వే నంబర్ 5/25/1లోని 1.26 గుంటల భూమిని నిబంధనలకు విరుద్ధంగా కేటాయించారంటూ బొమ్మదేశెట్టి అనే వ్యక్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ సహా సంబంధిత అధికారులకు అడ్మిషన్‌కు ముందు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.ఈ మేరకు బాధితుడు దాఖలు చేసిన రిట్ పిటిషన్ (డబ్ల్యూపీ నం.36337/2026)ను అక్టోబర్ 28న జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ విచారించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎ. సాన్ సంతోష్ కుమార్ వాదనలు వినిపించారు.సదరు భూమి కేటాయింపుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ 2026 మార్చి 24న రాష్ట్ర ప్రభుత్వంతో పాటు జిల్లా కలెక్టర్, ఆర్డీవోలకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదని పిటిషనర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.భూ కేటాయింపు తెలంగాణ అసైన్డ్ భూముల (బదిలీల నిషేధం) చట్టం 1977తో పాటు రాజ్యాంగంలోని 14, 21వ అధికరణలకు విరుద్ధంగా ఉందని ఆరోపించారు.
ఈ కేసులో రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్డీవో, నవాల్కల్ తహశీల్దార్‌తో పాటు భూ కేటాయింపుతో సంబంధం ఉన్న మరో ముగ్గురిని ప్రతివాదులుగా చేర్చారు.తాను సమర్పించిన ఫిర్యాదుపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలని పిటిషనర్ హైకోర్టును కోరారు. దీంతో ప్రతివాదులకు న్యాయస్థానం షోకాజ్ నోటీసులు జారీ చేసింది.
ఫిర్యాదు చేసినా స్పందన కరువైందన్న బాధితుడు ఇప్పుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఈ భూ కేటాయింపుల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. హైకోర్టు నోటీసుల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఎలాంటి వివరణ ఇస్తారో వేచి చూడాలి.

గత ప్రభుత్వాల హయాంలో

అమలైన ప్రజా సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, ప్రజా ప్రభుత్వం అదనంగా
సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



- నవంబర్ 19వ తేదీ నుంచి ఇందిరా కుటుంబ జీవిత బీమా యోజన పథకం ద్వారా ప్రతి కుటుంబానికి భరోసా కల్పించనున్నాం
- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం – రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి

వనపర్తి నవంబర్ 16 వుదయం ప్రతినిధి

పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో 715 నూతన చేయూత పెన్షన్ లబ్ధిదారులకు మంజూరీ పత్రాల పంపిణీ*

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..గత ప్రభుత్వాల హయాంలో అమలైన ప్రజా సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, ప్రజా ప్రభుత్వం అదనంగా మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. గతంలో ఎన్టీఆర్ హయాంలో రెండు రూపాయలకే కిలో బియ్యం, జనతా వస్త్రాలు వంటి పథకాలు ప్రవేశపెట్టగా, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 108 అంబులెన్స్ సేవలు, రూ.200 పెన్షన్, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్ వంటి పథకాలు అమలయ్యాయని గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు అమలయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం గత ప్రభుత్వాల సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు.
మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు వైద్యసాయం, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్, రైతుభరోసా, రైతుబీమా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.
ఈ నెల 19వ తేదీన ప్రారంభించనున్న ఇందిరా కుటుంబ జీవిత బీమా యోజన పథకం ద్వారా ప్రతి కుటుంబానికి భరోసా కల్పించనున్నామని, కుటుంబ పెద్ద మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థికసాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకం గురించి ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని కోరారు.
ప్రస్తుతం కరవు పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలని, విద్యుత్తును ఆదా చేయాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు.
ప్రస్తుతం వనపర్తి జిల్లాలో సుమారు 70 వేల మంది లబ్ధిదారులకు చేయూత పెన్షన్ల ద్వారా ప్రతి నెలా రూ.17 కోట్లను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. తాజాగా జిల్లా వ్యాప్తంగా మరో 8,500 మంది నూతన లబ్ధిదారులు పెన్షన్ల జాబితాలో చేరారని వెల్లడించారు. పెబ్బేరు మండలం,మున్సిపాలిటీ పరిధిలో గతంలో 5,250 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉండగా, తాజాగా మరో 730 మందిని అర్హులుగా గుర్తించి ఎంపిక చేసినట్లు వివరించారు. నూతనంగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే ప్రతి నెలా పెన్షన్ నగదు జమ అవుతుందని, లబ్ధిదారులు ఈ మొత్తాన్ని తమ అవసరాలకు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.అనంతరం ముఖ్య అతిథులు నూతనంగా ఎంపికైన చేయూత పెన్షన్ లబ్ధిదారులకు మంజూరీ పత్రాలను అందజేశారు. అదేవిధంగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) చెక్కులను పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ ఎ.శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్‌పర్సన్ సుమిత్ర, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, పి. డి. డిఆర్డీఓ ఉమాదేవి, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, నూతన పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల నుంచి లంచం తీసుకున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి



- ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ నాయకుడు కురువ పల్లయ్య

గద్వాల, నవంబర్ 16 (వుదయం కరస్పాండెంట్)

అయిజ మండలం తుప్పత్రాల గ్రామంలో రైతుల నుంచి రూ.10 వేల లంచం తీసుకున్నారనే ఆరోపణలపై సంబంధిత అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కురువ పల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇద్దరు అధికారులు ఒక్కొక్క రైతు నుంచి రూ.5 వేల చొప్పున డబ్బులు తీసుకున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే రైతు సంఘాలతో కలిసి కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు స్వామి,మహేష్,రఘు తదితరులు పాల్గొన్నారు.

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి: జిల్లా కలెక్టర్

నారాయణపేట టౌన్ నవంబర్ 16 (వుదయం ప్రతినిధి)





జిల్లాలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి హాల్‌లో వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె పలు అంశాలపై సమీక్షించి సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన గ్రామాలను తప్పనిసరిగా సందర్శించి, ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించేలా చిన్న సమావేశాలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ నెల 27వ తేదీన అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని, ప్రతి ప్రత్యేక అధికారి తప్పనిసరిగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. అలాగే ఈ నెల 17 నుంచి 26వ తేదీ వరకు దేవాలయాలు, మసీదులు, పాఠశాలలు, కళాశాలలు, మహిళా సంఘాలు, వివిధ కార్యాలయాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు చురుకుగా పాల్గొని కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన వివరాలతో ప్రెస్ నోట్లు విడుదల చేయాలని సూచించారు.ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం...రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ నెల 19వ తేదీ నుంచి పథకం రిజిస్ట్రేషన్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన ఒక వ్యక్తిని బీమా పొందే వ్యక్తిగా ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎంపిక చేసిన వ్యక్తికి రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు. కుటుంబ సభ్యులు తమకు నచ్చిన నామినీని ఎంపిక చేసుకోవచ్చని, నామినీకి అందాల్సిన వాటాలను కూడా నిర్ణయించుకోవచ్చని తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు మండల స్థాయి ప్రత్యేక అధికారులు సమన్వయకర్తలుగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో ఏర్పాటు చేసే శిబిరాల నిర్వహణ, దరఖాస్తుల స్వీకరణ, డిజిటల్ నమోదు,పత్రాల స్కానింగ్,భద్రపరచడం,సంబంధిత సంస్థలకు పంపించడం వంటి బాధ్యతలను స్పష్టంగా కేటాయించాలన్నారు.ప్రతి అధికారి తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు. ఆన్‌లైన్ హాజరు,నిబ్బంది వివరాలపై ఆదేశాలు...అన్ని శాఖల అధికారులు తమ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను,వారి ఆన్‌లైన్ హాజరు నమోదును పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఉద్యోగి గ్రిడ్ పనులు పూర్తి చేయాలి.తెలంగాణ ఫైబర్ గ్రిడ్‌కు సంబంధించి ముఖ్యంగా పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనులకు సంబంధించిన వర్క్ ఆర్డర్లు వెంటనే జారీ చేయాలని, కార్యాలయాలు ఐడీఓసీకి మారినప్పటికీ మండల కార్యాలయాల్లో పెండింగ్ పనులను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. పనుల అమలులో జాప్యం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అన్ని శాఖల అధికారుల సమిష్టి కృషి అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు.ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత పెంచాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడు రాష్ట్రాల్లో విస్తరించిన అల్ప్రజోలం ముఠా గుట్టు రట్టు

- రూ.38 లక్షల విలువైన మత్తు పదార్థం పట్టివేత : జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్

నాగర్‌కర్నూల్, నవంబర్ 16 (వుదయం బ్యూరో) :





తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో విస్తరించి అక్రమంగా అల్ప్రజోలం తయారు చేసి విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును నాగర్‌కర్నూల్ జిల్లా పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి. పాటిల్, ఐపీఎస్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు.బిజినపల్లి షెడ్డులో దాడి.. నలుగురు అరెస్ట్ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "బిజినపల్లి మండలంలోని ఓ వ్యవసాయ పొలంలో రేకుల షెడ్డులో అల్ప్రజోలం తయారవుతుందనే పక్కా సమాచారం మాకు అందింది. దాని ఆధారంగా 15వ తేదీన బిజినపల్లి ఎస్సై శంషుద్దీన్, సిబ్బంది బిజినపల్లి శివారులోని సర్వే నెం.455లోని షెడ్డుపై దాడి చేశారు. అక్కడ తయారీలో ఉన్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నాం. వారి వద్ద నుండి 2.6 కిలోల అల్ప్రజోలం, తయారీ పరికరాలు స్వాధీనం చేసుకుని NDPS యాక్ట్ కింద కేసు నమోదు చేశాం" అని తెలిపారు.జైలులో నేర్చుకున్న విద్య.. మూడు రాష్ట్రాల నెట్‌వర్క్

"విచారణలో సంచలన విషయాలు బయటపడ్డాయి. ప్రధాన నిందితుడు నిరంజన్ రెడ్డి జైలులో ఉన్న హనుమంతు రెడ్డి వద్ద అల్ప్రజోలం తయారీ విధానం నేర్చుకున్నాడు. కర్ణాటక రాయచూరుకు చెందిన వేణుగోపాల్ రెడ్డి ముడిసరుకులు సరఫరా చేస్తే, జగన్ మోహన్ రెడ్డి వాటిని తెప్పించి ఆంధ్రప్రదేశ్‌లోని కూనర్‌పల్లికి చెందిన వెంకట కృష్ణ రెడ్డికి అందించేవాడు. అక్కడ 1 నుంచి 3 దశల వరకు ప్రాసెస్ చేసిన మెటీరియల్‌ను బిజినపల్లికి తెచ్చి 4, 5 దశల్లో పూర్తిస్థాయి అల్ప్రజోలంగా మార్చి సుభాష్ గౌడ్ ద్వారా కల్లు కాంపౌండ్లకు విక్రయించేవారు" అని ఎస్పీ వివరించారు.
ఏపీలో దాడి.. మరో ఇద్దరు అరెస్ట్
"నిందితులు ఇచ్చిన సమాచారంతో మా బృందాలు ఆంధ్రప్రదేశ్‌లోని కూనర్‌పల్లి గ్రామంపై దాడి చేసి వెంకట కృష్ణ రెడ్డి, రాజశేకర్ రెడ్డిలను అరెస్ట్ చేసి తయారీ సామగ్రిని సీజ్ చేశాయి. మొత్తం ఆరుగురిని రిమాండ్‌కు తరలించాం. కీలక నిందితుడు వేణుగోపాల్ రెడ్డి పరారీలో ఉన్నాడు. అతన్ని త్వరలోనే పట్టుకుంటాం" అని ఎస్పీ స్పష్టం చేశారు.
రూ.38 లక్షల సొత్తు స్వాధీనం
"ఈ కేసులో మొత్తం రూ.38 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నాం. ఇందులో రూ.26 లక్షల విలువైన 2.6 కిలోల అల్ప్రజోలం, రూ.12 లక్షల విలువైన తయారీ పరికరాలు, కెమికల్స్, పౌడర్, 6 మొబైల్ ఫోన్లు ఉన్నాయి" అని తెలిపారు.
"ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన నాగర్‌కర్నూల్ డీఎస్పీ ఆధ్వర్యంలోని సీఐ అశోక్ రెడ్డి, సీసీఎస్ సీఐ శంకర్, బిజినపల్లి ఎస్సై శంషుద్దీన్, కేయూఎం ఎస్సై, సీసీఎస్, ఐడి పార్టీ సిబ్బందిని అభినందిస్తున్నాను. జిల్లాలో మత్తు పదార్థాల తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయి అని అన్నారుఈ మీడియా సమావేశంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎస్పీ బుర్రి శ్రీనివాసులు, సీఐ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై జరిగిన ప్రమాదం కుట్రపూరిత చర్యగా అనుమానం –

- తీవ్రంగా ఖండించిన బిసి జెఎసి జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బ కరుణాకర్ ముదిరాజ్

బిజినపల్లి వుదయం ప్రతినిధి అక్టోబర్16



తీన్మార్ మల్లన్నపై జరిగిన ప్రమాదాన్ని కుట్రపూరిత చర్యగా అనుమానిస్తూ బిసి జెఎసి నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బ కరుణాకర్ ముదిరాజ్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ప్రమాదానికి కారణమైన వారిని గుర్తించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి బిజినపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. తీన్మార్ మల్లన్నపై జరిగిన ప్రమాదం వెనుక వాస్తవాలను వెలికితీసి, దోషులకు చట్టపరంగా తగిన శిక్ష విధించాలని పోలీసులను కోరినట్లు పేర్కొన్నారు. ప్రజా నాయకులపై ఇలాంటి ఘటనలు జరగడం ఆందోళనకరమని, ఈ విషయాన్ని పోలీసులు అత్యంత ప్రాధాన్యతతో తీసుకొని నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని అబ్బ కరుణాకర్ ముదిరాజ్ కోరారు.

టీపీటీఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షునిగా అమ్మన నరసింహారెడ్డి

- నూతన అధ్యక్షుడికి దుబ్బాక మండల శాఖ అభినందనలు

వుదయం, సిద్దిపేట /దుబ్బాక ప్రతినిధి



తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) సిద్దిపేట జిల్లా నూతన అధ్యక్షునిగా అమ్మన నరసింహారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికవడం పట్ల దుబ్బాక మండల శాఖ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు జి. నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జి. రాజు ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దుబ్బాక మండలంలోని ఎంపీపీఎస్ నంబర్1 పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న అమ్మన నరసింహారెడ్డి 2005లో నాటి ఏపీటీఎఫ్‌లో సామాన్య కార్యకర్తగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారని తెలిపారు. 2011లో దుబ్బాక మండల ప్రధాన కార్యదర్శిగా, 2014లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం టీపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శిగా, 2017లో జిల్లా కార్యదర్శిగా, 2019 నుంచి ఇటీవల వరకు జిల్లా ఉపాధ్యక్షునిగా వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేశారని కొనియాడారు.ఆయన నిరంతర పోరాట పటిమ, నిబద్ధతకు గుర్తింపుగా నవంబర్ 14, 2026న నిర్వహించిన జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశంలో జిల్లా అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం దుబ్బాక మండలానికే గర్వకార



ఫిర్యాదుల పరిష్కారంలో జవాబుదారీతనం పాటించాలి : అదనపు కలెక్టర్ సంగీత .

ప్రజావాణికి 75 వినతులు .

సంగారెడ్డి, నవంబర్ 16:- వుదయం.

ప్రజల నుంచి అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, ప్రతి ఫిర్యాదుపై అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలని అదనపు కలెక్టర్ సంగీత సూచించారు. ఏ ఒక్క వినతినీ నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతాయుతంగా పరిష్కారం చూపాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంగీత ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు చేశారు.

కార్యక్రమంలో మొత్తం 75 వినతులు అందాయి. వీటిలో సంగారెడ్డి డివిజన్ నుంచి 16, నారాయణఖేడ్ డివిజన్ నుంచి 3, కలెక్టరేట్ పరిధిలో 56 వినతులు నమోదయ్యాయి. జహీరాబాద్, అందోల్ డివిజన్ల నుంచి ఎలాంటి వినతులు అందలేదని అధికారులు తెలిపారు . వివిధ శాఖల్లో ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ముఖ్యమంత్రి ప్రజావాణికి సంబంధించిన అర్జీలను సైతం ప్రాధాన్యతతో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో అవసరమైన విచారణ చేపట్టి, బాధితులకు సంతృప్తికరమైన పరిష్కారం అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమాజంలోని ప్రతి పేదవాడికి విద్య, వైద్యం, సామాజిక భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- **చేయూత పింఛన్లతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కల్లుగీత, చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా**
- **అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు**
- **రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

సంగారెడ్డి జిల్లాప్రతినిధి , నవంబర్ 16:-వుదయం



సమాజంలోని ప్రతి పేదవాడికి విద్య, వైద్యం, సామాజిక భద్రత కల్పించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా సామాజిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేయూత పింఛన్లను మంజూరు చేస్తోందని తెలిపారు.

సోమవారం అందోల్ మండలం సంగుపేట ఎక్స్ రోడ్డులోని శ్రీలక్ష్మీదేవి గార్డెన్స్‌లో నిర్వహించిన నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందోల్‌జోగిపేట మున్సిపాలిటీతో పాటు అందోల్, చౌటకూర్, పుల్కల్, వట్‌పల్లి మండలాలకు చెందిన నూతన పింఛన్ లబ్ధిదారులకు మంజూరు ప్రొసీడింగ్స్‌ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4.50 లక్షల చేయూత పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో 18 వేలకుపైగా, అందోల్ నియోజకవర్గంలో 3 వేలకుపైగా నూతన పింఛన్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కల్లుగీత, చేనేత కార్మికులకు చేయూత పింఛన్లు ఆర్థిక భరోసా కల్పిస్తూ గౌరవప్రదమైన జీవితానికి తోడ్పడతాయని అన్నారు.

దేశ చరిత్రలోనే తొలిసారిగా పేదలకు సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పాటు అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. అందోల్ నియోజకవర్గంలో 4 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు సుమారు వెయ్యి ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని వివరించారు. సొంత స్థలం ఉన్న పేదలకు ఇళ్లు మంజూరు చేయడంతో పాటు, స్థలం లేని నిరుపేదలకు కూడా ఇళ్లు మంజూరు చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి కోటీశ్వరులుగా ఎదగాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు పెద్దఎత్తున బ్యాంకు లింకేజీ రుణాలు, వడ్డీ లేని రుణాలు అందిస్తూ ప్రోత్సహిస్తోందని మంత్రి తెలిపారు. మహిళా సంఘాలు తీసుకున్న రుణాలపై వడ్డీ చెల్లించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటోందన్నారు. ఇందిరమ్మ క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, ట్రోన్ల నిర్వహణ వంటి వివిధ రంగాల్లో మహిళలకు అవకాశాలు కల్పిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతోందని పేర్కొన్నారు.హుమ్నాపూర్‌లో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.యువతకు స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అందోల్ నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ ప్రాంతంలో కనీసం 10 నుంచి 15 పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు. సింగూరు, అందోల్ ప్రాంతాల్లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. మెట్ట ప్రాంతాలకు సైతం సాగునీరు అందించాలనే లక్ష్యంతో పెద్దారెడ్డిపేట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా కొనసాగిస్తూ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, ప్రభుత్వం సమాజంలోని చివరి వ్యక్తికి కూడా సంక్షేమ ఫలాలు అందేలా పని చేస్తోందని అన్నారు. జిల్లాలో ప్రస్తుతం 1,48,562 మంది లబ్ధిదారులకు ప్రతి నెల రూ.32.73 కోట్ల పింఛన్లు అందిస్తున్నట్లు వివరించారు. తాజాగా మరో 18,591 మందికి నూతనంగా చేయూత పింఛన్లు మంజూరు చేయగా, వీరికి ప్రతి నెల రూ.4.24 కోట్ల పింఛన్ అందించనున్నట్లు తెలిపారు.

అందోల్ నియోజకవర్గంలో కొత్తగా 3,130 మందికి చేయూత పింఛన్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరుకాలేక మంజూరు ప్రొసీడింగ్స్ పొందని లబ్ధిదారులు సంబంధిత మండల కార్యాలయాల్లో వాటిని తీసుకోవచ్చని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, ఆర్డీవో రమేష్ బాబు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి జగదీష్, డీఆర్‌డీఏ ఏపీడీ సూర్యారావు, మున్సిపల్ కమిషనర్, అందోల్, చౌటకూర్, పుల్కల్, వట్‌పల్లి మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, గ్రామ సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, నూతన పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



కుట్కనూరు పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలి

- **కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ సర్పంచ్ బెంజిమెన్**
- **త్వరలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు లేదా విద్యా వాలంటీర్‌ను ఏర్పాటు చేస్తాం: కలెక్టర్ హామీ**

అయిజ నవంబర్ 16 (వుదయం ప్రతినిధి)

అయిజ మండలం కుట్కనూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న ఉపాధ్యాయుల కొరతను వెంటనే పరిష్కరించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కోరుతూ గ్రామ మాజీ సర్పంచ్ బెంజిమెన్ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు వినతిపత్రం సమర్పించారు.

గ్రామంలోని పాత, కొత్త ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యాబోధనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా కొత్త పాఠశాలకు అదనంగా ఒక ఉపాధ్యాయుడిని నియమించి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే ప్రభుత్వ ఉపాధ్యాయుడిని లేదా విద్యా వాలంటీర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు మాజీ సర్పంచ్ బెంజిమెన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీలర్ బందె నవాజ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బస్ స్టాండ్‌లో 'చైల్డ్ హెల్ప్ లైన్ 1098' హెల్ప్ డెస్క్ ప్రారంభం



మహబూబ్ నగర్

ఆపదలో ఉన్న చిన్నారులకు తక్షణ రక్షణ, సహాయం అందించే లక్ష్యంతో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని బస్ స్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'చైల్డ్ హెల్ప్ లైన్ 1098' హెల్ప్ డెస్క్‌ను సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, బస్ స్టాండ్‌కు వచ్చే ప్రయాణికులలో తప్పిపోయిన పిల్లలు, బాల కార్మికులు లేదా ఆపదలో ఉన్న చిన్నారులను గుర్తించి వారికి తక్షణమే భద్రత కల్పించడంలో ఈ హెల్ప్ డెస్క్ కీలక పాత్ర పోషించాలన్నారు. కేంద్రం నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని, సిబ్బంది పనివేళలకు సంబంధించిన విధుల పట్టికను (షిఫ్ట్ చార్ట్) స్పష్టంగా రూపొందించి అక్కడ ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు.



ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి (డీడబ్ల్యూఓ), ఆర్టీసీ రీజినల్ మేనేజర్ (సంతోష్ కుమార్), డిపార్ట్‌మెంట్ మేనేజర్, కృష్ణ మూర్తి అండ్ మాధవ రావు డిప్యూటీ ఆర్ఎం, అశోక్ అసిస్టెంట్ డిపో మేనేజర్, రెండో పట్టణ ఎస్సై, బాలల సంక్షేమ సమితి (సీడబ్ల్యూసీ) సభ్యులు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డీసీపీఓ), డీసీపీయూ సిబ్బంది, చైల్డ్ హెల్ప్ లైన్ సమన్వయకర్త మరియు సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల కదం.. సమ్మెకు సై..!


- **డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెకు పిలుపు..**
- **అదనపు కలెక్టర్ నగేష్‌కు సమ్మె నోటీసు అందజేత.**
- **రూ. 18 వేల ఫిక్స్‌డ్ వేతనం, రూ. 50 లక్షల బీమాకు డిమాండ్.**

మెదక్, నవంబర్ 16: (వుదయం ప్రతినిధి.)

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆశా వర్కర్లు సమరశంఖం పూరించారు. ఫిక్స్‌డ్ వేతనం రూ. 18,000 చెల్లించాలని,పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ బీఆర్టీయూ యూనియన్ల ఆధ్వర్యంలో సోమవారం మెదక్ కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును అదనపు కలెక్టర్ నగేష్‌కు అందజేశారు.

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం, కోశాధికారి కే. నర్సమ్మ, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు జుబేద్, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్యామల, సమత మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 20 ఏళ్లుగా ఆశా వర్కర్లు క్షేత్రస్థాయిలో అహర్నిశలు సేవలందిస్తున్నా, ప్రభుత్వం కనీస వేతనం నిర్ణయించకుండా కేవలం పారితోషికాలతోనే సరిపెడుతోందని విమర్శించారు. విధి నిర్వహణలో ఎవరైనా మరణిస్తే కనీసం అంత్యక్రియల ఖర్చులు కూడా ఇవ్వని దయనీయ స్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 సమ్మె సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, రూ. 18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఆ హామీని విస్మరించడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే ఆశా వర్కర్ల సమస్యల సాధన కమిటీతో చర్చలు జరిపి కింది డిమాండ్లను పరిష్కరించాలని నాయకులు కోరారు. ఆశా వర్కర్లకు నెలకు రూ. 18,000 ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలి.





రెండవ పీఆర్సీ అమలు చేయాలి. రూ. 50 లక్షల ప్రమాద బీమా, జీవిత బీమా సౌకర్యం కల్పించాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ. 5 లక్షలు వేతనంలోసగం పెన్షన్ అందించాలి.ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే డిసెంబర్ 15, 2026 నుండి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా నాయకులు రాణి, పెంటమ్మ, స్వప్న, సుజాత, సావిత్రి, దేవమ్మ, లక్ష్మి, కవిత, మంజుల, పుష్ప, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

సూర్య షష్టి వ్రతం ఎంతో ప్రాముఖ్యతమైనది....

- **శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్.....**

వుదయం

శివ్వంపేట నవంబర్ 16....

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామ వాస్తవ్యులు ప్రముఖ సంఘ సేవకులు శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ వ్యవస్థాపకులు హైకోర్టు సీనియర్ న్యాయవాది పెద్దగౌని జిన్నారం శివకుమార్ గౌడ్ కార్తీక మాసంలో సూర్య షష్టి వ్రతం ప్రాముఖ్యత గురించి ఇలా వివరించారు. సూర్యుడు ఈ సృష్టికి ప్రాణాధారం శక్తికి ప్రతిక. ఆరోగ్యం . దీర్ఘాయువు. తేజస్సు మరియు సకల ఐశ్వర్యాల కోసం సూర్యభగవానుడి నీ ఈ రోజున పూజిస్తారు.

సూర్య కిరణాలకు రోగాలను నశింపజేసే శక్తి ఉందని ముఖ్యంగా కంటి సంబంధిత సమస్యలు చర్మవ్యాధులు తొలగిపోతాయి. సంతాన ప్రాప్తి కోసం పిల్లల రక్షణ మరియు వారి దీర్ఘాయువు కోసం చట్టి మాతాను ప్రార్థిస్తూ తల్లులు కఠినమైన అపవాసం ఉంటారు.

మహాభారత కాలంలో కర్ణుడు సూర్యుడిని ఆరాధించి వీరుడిగా ప్రసిద్ధి చెందడం అలాగే పాండవులు తమ రాజ్యాన్ని తిరిగి పొందడానికి ఈ వ్రతాన్ని ఆచరించినట్లు చెప్పబడింది. కార్తీక మాసంలో శుక్లపక్ష చవితి నుండి సప్తమి వరకు నాలుగు రోజుల పాటు ఈ వ్రతాన్ని అత్యంత నిష్ఠతో ఆచరిస్తారు. ఇందులో నాహాయ్. ఖాయ్. కార్న . సంధ్య అర్ఘ్యం . సప్తమించే సూర్యుడికి అర్ఘ్యం సమర్పించడం ద్వారా జీవితములో సుఖదుఃఖాలను ప్రారంభాలను ముగింపులను సమానంగా స్వీకరించాలని పకృతి సందేశాన్ని ఈ వ్రతం అందిస్తుంది అని వారు వివరించారు.



విచ్చలవిడిగా బెల్ట్ షాపులు... పట్టించుకోని ఎక్సైజ్ శాఖ.

- **వివరణ అడిగితే బెల్ట్ షాపుల పేర్లు చెప్పమంటున్న అధికారులు...**
- **నారాయణఖేడ్ లో ప్రజల ఆగ్రహం.**

నారాయణఖేడ్, నవంబర్ 16 (వుదయం)

నారాయణఖేడ్ మండలంలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా నడుస్తున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంతో పాటు మండలంలోని ప్రతి గ్రామంలోనూ సాయంత్రం అయితే చాలు మద్యం బెల్ట్ షాపుల వద్ద జనం బారులు తీరుతున్నారని, యువత, కూలీలు, రైతులు మద్యానికి బానిసలై కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనల ప్రకారం లైసెన్స్ షాపుల్లో మాత్రమే మద్యం అమ్మాలి. కానీ ఇక్కడ మాత్రం కిరాణా షాపులు, పాన్ షాపులు, డాబాల చాటున బెల్ట్ షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. రాత్రి



ఆలస్యం వరకూ మద్యం విక్రయాలు జరుగుతున్నా అధికారులు దాడులు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఈ విషయంపై ఎక్సైజ్ అధికారులను వివరణ అడిగితే, "బెల్ట్ షాపులు ఎక్కడున్నాయో పేర్లతో సహా చెప్పండి, అప్పుడు చర్య తీసుకుంటాం" అని సమాధానం చెప్పడం మరింత విస్మయానికి గురిచేస్తోంది. అక్రమ మద్యం విక్రయాలను గుర్తించి అరికట్టాల్సిన బాధ్యత అధికారులదా? లేక ప్రజలదా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. జీతాలు తీసుకుంటున్న అధికారులు ఫీల్డ్ లోకి రాకుండా, ప్రజలనే ఇన్ఫార్మర్లుగా మార్చాలని చూడటం సిగ్గుచేటని మండిపడుతున్నారు.

గ్రామాల్లో బెల్ట్ షాపుల వల్ల గొడవలు, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ కలహాలు పెరిగిపోయాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల చదువులు, కుటుంబాల బతుకులు నాశనమవుతున్నా పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నారు.

ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, నారాయణఖేడ్ మండలంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బెల్ట్ షాపులు ఎక్కడున్నాయో ప్రజలకు కాదు, అధికారులకే బాగా తెలుసు... కళ్లు మూసుకుంటే కుటుంబాలు కుప్పకూలుతాయి. ఇకనైనా ఎక్సైజ్ శాఖ మేల్కొంటుందా?.



క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్న యువ క్రీడాకారులను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

(రంగారెడ్డి జిల్లా /కొత్తూరు, నవంబర్ 16 (వుదయం)

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు మండల పరిధిలోని కొడిచెర్లతండా యువకులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రోత్సహిస్తూ. గ్రామ సర్పంచ్ శాంతి విష్ణు నాయక్ ఆధ్వర్యంలో యువకులకు క్రికెట్ టోర్నమెంట్ కిట్టు బహుమతిగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శాంతి విష్ణు నాయక్ మాట్లాడుతూ ఈ తరం యువత ఉల్లాసంగా ఉత్సాహంగా యువతకు ప్రోత్సహిస్తూ ప్రతిఫలం వారి ఊజాల భవిష్యత్తులకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొత్తూరు మండల ఎస్టీ సెల్ జైపాల్ నాయక్, గ్రామ కమిటీ అధ్యక్షులు రాము నాయక్, గ్రామ యువకులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దారిపొడవునా నరకయాతన.. భక్తులకు తప్పని కంకర పరీక్ష!

- **నెలలు గడుస్తున్నా నత్తనడకనే విద్యాల డబుల్ లైన్ రోడ్డు పనులు**
- **కంకర పరిచి వదిలేయడంతో దుమ్ము, ధూళితో వాహనదారుల అవస్థలు**
- **కార్తీక మాసంలోనూ ప్రసిద్ధ రామేశ్వరాలయానికి కష్టాల ప్రయాణం**
- **తక్షణమే స్పందించి పనులు పూర్తి చేయాలని భక్తులు, స్థానికుల వేడుకోలు**

షాద్‌నగర్, నవంబర్ 16,(వుదయం):

శివ శివ ఎంత పని అయిందయ్యా.. నీ దర్శనం చేసుకోవాలంటే ఈ కంకర దారిలో నరకయాతన అనుభవిస్తూ రావాల్సిందేనా..? అంటూ ప్రసిద్ధి గాంచిన రామేశ్వరాలయానికి వచ్చే భక్తులు ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రహదారి విస్తరణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో, నిత్యం వందలాది మంది ప్రయాణికులు, శివభక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.





అట్టహాసంగా ప్రారంభం.. ఆపై అటకెక్కిన పనులు జాతీయ రహదారి ఎన్ హెచ్ 44 నుండి విద్యాల వరకు డబుల్ లైన్ రహదారి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గతంలో ఈ పనులను అట్టహాసంగా ప్రారంభించారు. దీంతో తమ దశాబ్దాల కష్టాలు తీరాయని స్థానికులు, వాహనదారులు సంతోషించారు. కానీ, వారి ఆశలు ఎంతో కాలం నిలవలేదు. పనులు మొదలై నెలలు గడుస్తున్నా నేటికీ తారు రోడ్డు జాడ లేదు. రోడ్డుపై కేవలం కంకర పరిచి వదిలేయడంతో, రహదారి మొత్తం రాళ్లమయంగా మారింది.

ప్రమాదాలకు నిలయంగా కంకర దారి

కంకర రాళ్లు తేలి ఉండటంతో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కిందపడి గాయాల పాలు అయ్యే ప్రమాదం లేకపోలేదు. భారీ వాహనాలు వెళ్లినప్పుడు లేచే దుమ్ము, ధూళితో వెనుక వచ్చే ప్రయాణికులకు దారి కనిపించని పరిస్థితి నెలకొంది. రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళ్లే రోగులు, గర్భిణీలు ఈ గుంతలు, కంకర రోడ్డుపై ప్రయాణించలేక నరకయాతన అనుభవిస్తున్నారు.

కార్తీక మాసంలోనూ కానరాని చొరవ

శ్రీరాముడు నడయాడిన పుణ్యక్షేత్రంగా, ఉత్తర రామేశ్వరంగా పేరుగాంచిన రామేశ్వరాలయానికి నిత్యం వందలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ముఖ్యంగా ప్రస్తుతం పరమ పవిత్రమైన కార్తీక మాసం కావడంతో ఆలయానికి భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులు, ఆలయానికి వెళ్లే ప్రధాన దారి ఇలా అధ్వాన్నంగా ఉండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఆర్ అండ్ బీ అధికారులు మొద్దునిద్ర వీడి, కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి నిలిచిపోయిన డబుల్ లైన్ రోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని పరిసర గ్రామస్తులు, ప్రయాణికులు, శివభక్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

సరేర్ స్కూల్ ఆక్సిడమీ చిల్డ్రన్స్ డే సెలబ్రేషన్



బొల్లారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ 16 : వుదయం

ఎస్ ఆర్ పాఠశాల విద్యార్థుల క్రికెట్ ప్రభంజనం బొల్లారం బాలల దినోత్సవం సందర్భంగా శనివారం ఎస్సార్ ఎడ్యుకేషనల్ అకాడమీలో స్పోర్ట్స్ మినిట్ కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా 14 ఎస్ ఆర్ అనుబంధ పాఠశాలల మధ్య వివిధ క్రీడా పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ క్రీడా పోటీలో ఓపెనింగ్ సెరమనీకి అల్వాల్ మండలం ఎంఈఓ గారైన మురళీకృష్ణ గారు రావడం జరిగింది. ఈ క్రీడా పోటీలలో బొల్లారం విద్యార్థులు,క్రికెట్ టగ్ ఆఫ్ వార్ క్రీడలలో విజృంభించి ఘనంగా విజయం సాధించారు. విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికి తీసి, వారికి ప్రోత్సాహాన్ని అందించిన యాజమాన్యాన్ని ఉపాధ్యాయులందరినీ పీఈటీలందర్నీ అభినందిస్తూ హైదరాబాద్ పాఠశాలల డిజిఎం శ్రీమతి కె. రాధికా రెడ్డి గారు, దిల్ సుక్ నగర్ జోనల్ ఇంచార్జ్ బి .రాధికా రెడ్డి గారు కొంపల్లి జోనల్ ఇన్చార్జ్ మనోహర్ గారు, బొల్లారం ప్రిన్సిపల్ మీరు ఆశాలత గారు మరియు 14 అనుబంధ పాఠశాలల ప్రిన్సిపల్స్ విద్యార్థులందరికీ బహుమతులు అందించి కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.

చక్కని ఆరోగ్యం

ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఒమెగా 3 కొవ్వులు



మన శరీరానికి అత్యంత అవసరమైన మంచి కొవ్వులలో ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు ఒకటి. ఇవి గుండె ఆరోగ్యం నుంచి మెదడు పనితీరు వరకు అనేక కీలక వ్యవస్థలు సమర్థవంతంగా పని చేయడంలో ఎంతో సహాయపడతాయి. అయితే శరీరం ఈ పోషకాలను స్వయంగా తయారు చేసుకోలేదు కనుక ఆహారం లేదా సప్లిమెంట్ల ద్వారా తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న గుండె జబ్బులు, మానసిక ఒత్తిడి, చర్మ సమస్యలు వంటి వాటిని తగ్గించడంలో ఒమెగా-3 కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు రక్తంలో ట్రైగ్లిసరైడ్స్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. రక్తనాళాల్లో ప్లాక్ పేరుకుపోయే ప్రక్రియను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. అలాగే రక్తపోటును నియంత్రించడంలో కూడా ఉపయోగపడతాయని పేర్కొంటున్నారు. అందువల్ల గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో ఇవి కీలకంగా పనిచేస్తాయి.మెదడు పనితీరుకు..మెదడు నిర్మాణంలో కూడా ఒమెగా-3 ముఖ్యమైన భాగంగా ఉంటుంది. ముఖ్యంగా DHA అనే రకం మెదడు గ్రే మ్యాటర్‌లో ఎక్కువగా ఉండి నాడుల పనితీరుకు సహాయపడుతుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ఆలోచనా స్పష్టత పెరగడంలో ఇవి ఉపయోగపడతాయని చెబుతున్నారు. వయస్సు పెరిగే కొద్దీ వచ్చే మతిమరుపు సమస్యలు, అల్జీమర్స్ వంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఒమెగా-3 పాత్ర ఉందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. శరీరంలో దీర్ఘకాలిక వాపులను తగ్గించే గుణాలు కూడా ఒమెగా-3లో ఉన్నాయి. ఆర్థరైటిస్ వంటి ఇన్‌ఫ్లమేటరీ సమస్యల లక్షణాలను తగ్గించడంలో ఇవి ఉపయోగకరంగా ఉంటాయి. అంతర్గత ఇన్‌ఫ్లమేషన్ (వాపు) తగ్గడం వల్ల ఇతర దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం కూడా తగ్గుతుంది. చర్మం, కళ్ల ఆరోగ్యానికి కూడా ఒమెగా-3 మేలు చేస్తుంది. చర్మానికి తేమను అందించి మొటిమలు తగ్గించడంలో సహాయపడుతుంది. చర్మ కాంతిని మెరుగుపరచడంలో కూడా ఇది పాత్ర పోషిస్తుంది. కళ్ల ఆరోగ్యాన్ని కాపాడటంలో కూడా ఈ ఫ్యాటీ ఆమ్లాలు ఉపయోగపడతాయి.వీటిల్లో లభిస్తుంది, ఎంత అవసరం..

మానసిక ఆరోగ్యంపై కూడా ఒమెగా-3 సానుకూల ప్రభావం చూపుతుంది. ఇవి మెదడులో ఇన్‌ఫ్లమేషన్ తగ్గించడమే కాకుండా సెరటోనిన్ స్థాయిలను ప్రభావితం చేసి డిప్రెషన్, ఆందోళన వంటి సమస్యల లక్షణాలను తగ్గించడంలో సహాయపడతాయి. ఒమెగా-3 ని సహజంగా పొందేందుకు సాల్మన్, మాకెరెల్, సార్డిన్స్, హెర్రింగ్ వంటి కొవ్వు ఎక్కువగా ఉన్న చేపలను ఆహారంలో చేర్చుకోవాలి. ఫ్లాక్స్ సీడ్స్, చియా సీడ్స్, వాల్‌నట్స్, సోయాబీన్స్ వంటి వృక్షాధార ఆహారాల్లో కూడా ఒమెగా-3 లభిస్తుంది. పాలకూరలో కూడా కొంతమేర ఈ పోషకం ఉంటుంది. సాధారణంగా రోజుకు 250 నుంచి 500 మిల్లీగ్రాముల వరకు ఒమెగా-3 తీసుకోవాలని సూచిస్తున్నారు. గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారికి రోజుకు 1000 మిల్లీగ్రాములు వరకు అవసరమవుతాయి. ఇన్‌ఫ్లమేషన్ సమస్యలు ఉన్నవారికి 2000 మిల్లీగ్రాములు లేదా అంతకంటే ఎక్కువ అవసరమయ్యే అవకాశం ఉంటుంది. అయితే అధిక మోతాదులు తీసుకునే ముందు వైద్యుల సలహా తీసుకోవడం అవసరం. రక్తాన్ని పలుచన చేసే మందులు వాడుతున్నవారు లేదా రక్తస్రావ సమస్యలు ఉన్నవారు ఒమెగా-3 సప్లిమెంట్లు తీసుకునే ముందు జాగ్రత్త వహించాలి. ఈ సప్లిమెంట్లను కొవ్వు ఉండే ఆహారంతో కలిసి తీసుకుంటే శరీరం వాటిని మెరుగ్గా గ్రహిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

హైహీల్స్ ధరించే మహిళలు తప్పక తెలుసుకోవాల్సిన విషయాలు



హైహీల్స్ ను ఫ్యాషన్‌లో భాగంగా చాలా మంది మహిళలు రోజువారీ జీవితంలో ఉపయోగిస్తుంటారు. ఉద్యోగాలు, పార్టీలతోపాటు ప్రత్యేక సందర్భాల్లో ఇవి ఆకర్షణీయంగా కనిపించేందుకు సహాయపడతాయని భావిస్తారు. అయితే ఎక్కువసేపు, తరచుగా హైహీల్స్ ధరించడం వల్ల శరీర భంగిమ, కాళ్ల సమతుల్యత, ఎముకల ఆరోగ్యం పై ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరం సహజంగా తల, వెన్నెముక, నడుము, పాదాలు సమతుల్యంగా పనిచేసేలా నిర్మాణమైంది. కానీ హైహీల్స్ ధరించినప్పుడు పాదం వెనుక భాగం ఎత్తుగా ఉండటం వల్ల శరీర బరువు ముందుభాగానికి మళ్లుతుంది. దీంతో శరీరం సమతుల్యత కోసం వెన్నెముక, మోకాళ్లు, నడుము తమ స్థానాలను మార్చుకోవాల్సి వస్తుంది. ఈ మార్పులు ఎక్కువ కాలం కొనసాగితే నడుము భాగంపై ఒత్తిడి పెరిగి నొప్పి, గట్టిపడిన భావన రావచ్చని నిపుణులు చెబుతున్నారు. మెడ, భుజాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. హైహీల్స్ తరచుగా ఉపయోగించే వారిలో కాళ్ల అలసట, కాలి కండరాల బిగుతు వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయని వైద్యులు చెబుతున్నారు. శరీర సమతుల్యతపై ప్రభావం..అంతేకాకుండా హైహీల్స్ వల్ల శరీర సమతుల్యత కూడా దెబ్బతినే అవకాశం ఉంటుంది. పాదం నేలను తాకే భాగం తగ్గిపోవడం వల్ల నిలబడటం, నడవడం కష్టమవుతుంది. ముఖ్యంగా మెట్లు, అసమాన ఉపరితలాలపై జారి పడే ప్రమాదం పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆర్థోపెడిక్ పరిశీలనల ప్రకారం హైహీల్స్ ఎక్కువగా వాడేవారిలో కాలి మడమ మెలికలు, పాదం ముందుభాగంపై అధిక ఒత్తిడి, కాలి కండరాల బలహీనత వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయని చెబుతున్నారు. దీర్ఘకాలంగా వాడటం వల్ల పాదాల ఆకృతిలో కూడా మార్పులు రావచ్చని పేర్కొంటున్నారు. హైహీల్స్ ధరించినప్పుడు కాలి వెనుక భాగంలోని కండరాలు చిన్న స్థితిలోనే ఎక్కువసేపు ఉండాల్సి వస్తుంది. దీని వల్ల అవి గట్టిపడి, ఫ్లాట్ ఫుట్‌వేర్ ధరించినప్పుడు అసౌకర్యం కలిగించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా అకిలీస్ టెండన్ గట్టిపడటం వల్ల నడక తీరు కూడా ప్రభావితమవవచ్చని హెచ్చరిస్తున్నారు. పాదాలపై శరీర బరువు ముందుభాగానికి ఎక్కువగా పడటం వల్ల బనియన్స్, హామర్ టోస్ వంటి సమస్యలు క్రమంగా అభివృద్ధి చెందుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఇవి ఒక్కసారిగా కాకుండా సంవత్సరాల పాటు ఒత్తిడి వల్ల ఏర్పడేఅవకాశం ఉందని చెబుతున్నారు. తరచూ శ్రేయస్కరం కాదు..అయితే అప్పుడప్పుడు హైహీల్స్ ధరించడం వల్ల పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చు. కానీ రోజూ గంటల తరబడి ఉపయోగించడం వల్ల సమస్యలు పెరిగే ప్రమాదం ఉంటుంది. హైహీల్స్ ప్రభావాన్ని తగ్గించేందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. తక్కువ ఎత్తు ఉన్న హీల్స్ ఎంపిక చేసుకోవడం, రోజంతా ఒకే ఫుట్‌వేర్ వాడకుండా మధ్యలో మారుస్తూ ఉండటం, కాళ్లకు సరైన సపోర్ట్ ఇచ్చే పాదరక్షలు ఉపయోగించడం మంచిది. కాలి కండరాలు, పాదాలకు స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయడం ద్వారా వంపుదనం, బలం పెరుగుతుంది. అలాగే ఎక్కువసేపు నిలబడాల్సిన ఉద్యోగాల్లో సౌకర్యవంతమైన ఫుట్‌వేర్‌కు ప్రాధాన్యం ఇవ్వడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. శరీర భంగిమ, నడక, పాదాల ఆరోగ్యం వంటి అంశాలపై చిన్న చిన్న అలవాట్లు కూడా దీర్ఘకాల ప్రభావం చూపుతాయని నిపుణులు తెలియజేస్తున్నారు.

బేకింగ్ వంటకాలు.. చక్కగా రావాలంటే!



కేక్స్, కుకీస్, బ్రెడ్, పఫ్స్.. ఇలాంటి బేకింగ్ ఐటమ్స్‌ని ఇంట్లో తయారుచేసుకున్నప్పుడు.. చాలామందికి బయటి మాదిరిగా పర్‌ఫెక్ట్‌గా రావు. ఇందుకు వీటిని తయారుచేసే క్రమంలో మనకు తెలియకుండా చేసే కొన్ని చిన్న చిన్న పొరపాట్లే కారణమంటున్నారు నిపుణులు. కాబట్టి ఇలాంటి వంటకాల్ని తయారుచేసేటప్పుడు కొన్ని చిట్కాల్ని దృష్టిలో ఉంచుకుంటే.. పదార్థం పర్‌ఫెక్ట్‌గా రావడమే కాదు.. దాని రుచీ మరింత పెరుగుతుందంటున్నారు. ఇంతకీ ఏంటా టిప్స్? తెలుసుకుందాం రండి..

ఒక వంటకం పర్‌ఫెక్ట్‌గా కుదరాలంటే.. అందులో వాడే పదార్థాల కొలతలు చాలా ముఖ్యం. బేకింగ్ ఐటమ్స్‌కూ ఇది వర్తిస్తుంది. ఈ క్రమంలో ఆయా పదార్థాల్ని కొలిచే కప్స్, స్పూన్లు వాడడం మంచిది. వీటికి బదులుగా డిజిటల్ వెయింగ్ స్కేల్‌ను ఉపయోగిస్తే మరీ మంచిది. అలాగే తడి, పొడి పదార్థాల్ని కొలవడానికి వేర్వేరు కప్స్/స్పూన్స్ ఉపయోగించాలి. అప్పుడే పదార్థం కోసం కచ్చితమైన కొలతల్ని తీసుకోగలుగుతాం. వంటకం గురించి తెలుసుకోవడానికి పుస్తకంలో చదివినా, యూట్యూబ్‌లో చూసి చేసినా.. దానికి సంబంధించిన తయారీ విధానం అందులో చెప్పినట్లుగానే కచ్చితంగా పాటించాలి. అలాకాకుండా మధ్యమధ్యలో మన సొంత ప్రయోగాలు చేస్తే వంటకం పర్‌ఫెక్ట్‌గా కుదరదు. కొంతమంది పొడి పదార్థాల్ని జల్లెడ పట్టకుండానే వాడేస్తుంటారు. కానీ దానివల్ల కూడా వంటకం కుదరకపోయే అవకాశాలున్నాయంటున్నారు నిపుణులు. అందుకే జల్లెడ పట్టడం మర్చిపోకూడదంటున్నారు. బేకింగ్ వంటకాల్లో తేనె, నెయ్యి, మేపుల్ సిరప్.. వంటి చిక్కటి పదార్థాల్ని వాడతాం. అయితే వాటిని కొలిచి తీసుకునే క్రమంలో.. అవి ఆయా కప్పులు/స్పూన్ల అంచులకు అంటుకుపోతాయి. తద్వారా కొలత సరిగ్గా రాదు. ఈ సమస్య లేకుండా ఉండాలంటే.. ముందు కొలతల స్పూన్లు/కప్పుల లోపలి భాగంలో నాన్‌స్టిక్ కుకింగ్ స్ప్రేను స్ప్రే చేస్తే సరిపోతుంది. బేకింగ్ చేసే వంటకం మృదువుగా రావాలన్న ఉద్దేశంతో.. పిండి మిశ్రమాన్ని పదే పదే ఎక్కువసేపు కలుపుతుంటారు. అయితే దీనివల్ల కుకీస్ వంటి వంటకాలు గట్టిగా వస్తాయి. కాబట్టి పిండి కలిపేటప్పుడు ఇది గుర్తుపెట్టుకోవాలి. తడి, పొడి పదార్థాల్ని కలిపేటప్పుడు పిండి మిశ్రమంలో ముద్దలు ఏర్పడడం సహజం. అవి ఏర్పడకుండా ఉండాలంటే.. పొడి పిండిలో తడి పదార్థాల్ని కొద్దికొద్దిగా వేస్తూ కలుపుతుండాలి. తద్వారా కేక్స్, కప్ కేక్స్.. వంటివి మృదువుగా వస్తాయి. వంటకాన్ని బట్టి అవెన్‌ను పది నిమిషాల ముందే ప్రి-హీట్ చేసుకోవడం ముఖ్యం. అలాగే ఉష్ణోగ్రత, రెసిపీ సమయాన్ని కరక్ట్‌గా సెట్ చేసుకున్నాకే పదార్థాన్ని అవెన్‌లో ఉంచాలి. ఇక వంటకం పూర్తయ్యాక, తిరిగి ఉపయోగించుకునే ముందు అవెన్‌ను శుభ్రం చేయడం వల్ల దాన్నుంచి దుర్వాసనలు రాకుండా.. అవి మనం తయారుచేస్తోన్న వంటకంపై ప్రతికూల ప్రభావం చూపకుండా జాగ్రత్తపడచ్చు. కొన్నిసార్లు బేకింగ్ వంటకంలో వాడే అన్ని పదార్థాలూ అందుబాటులో ఉండకపోవచ్చు. దాంతో వాటిని వదిలేసి వంటకం తయారుచేస్తుంటాం. దీనివల్ల కూడా వంటకం కచ్చితంగా కుదరదు. అందుకే ఆయా వంటకాల తయారీకి అవసరమైన పదార్థాలన్నీ సమకూర్చుకున్నాకే ప్రారంభించడం మంచిది అంటున్నారు నిపుణులు.

నాలుకపై కనిపించే రంగు, మచ్చలను బట్టి ఎలాంటి వ్యాధులు ఉన్నాయో ఇలా చెప్పవచ్చు..



మన శరీరంలో ఏదైనా సమస్య ప్రారంభమైతే ముందుగా కొన్ని చిన్న సంకేతాల రూపంలో కనిపిస్తుంది. ఇలా సంకేతాలను చూపించే వాటిలో నాలుక కూడా ఒక ముఖ్యమైన సూచికగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. నాలుక రంగు, పైపొర, ఆకారం, మచ్చలు వంటి మార్పులు శరీర ఆరోగ్య పరిస్థితిపై సంకేతాలు ఇవ్వగలవని వైద్యులు సూచిస్తున్నారు. సాధారణంగా నిర్లక్ష్యం చేసే ఈ మార్పులు కొన్నిసార్లు పోషకాహార లోపాలు లేదా ఇతర ఆరోగ్య సమస్యలకు సూచన కావచ్చని చెబుతున్నారు. ఆరోగ్యకరమైన నాలుక సాధారణంగా లేత గులాబీ రంగులో ఉంటుంది. ఇది సరైన పోషకాహారం, తగినంత నీరు తీసుకోవడం, మంచి నోటి పరిశుభ్రతను సూచిస్తుంది. పలుచని తెల్లటి పొర ఉండటం సహజమని నిపుణులు చెబుతున్నారు.Healthఐరన్, విటమిన్ బి12 లోపం ఉంటే..నాలుక చాలా పలుచగా లేదా తెల్లగా కనిపిస్తే అది ఐరన్ లోపం, విటమిన్ బి12 కొరత లేదా రక్తహీనతకు సంకేతం కావచ్చు. కొన్నిసార్లు దీర్ఘకాలిక అలసట లేదా శరీరంలో శక్తి లోపాన్ని కూడా ఇది సూచిస్తుందని చెబుతున్నారు. నాలుకపై మందమైన తెల్లని పొర కనిపిస్తే అది నోటి పరిశుభ్రత సరిగా లేకపోవడం, డీహైడ్రేషన్, ధూమపానం వంటి కారణాలతో అయ్యే అవకాశాలు ఉంటాయి. అలాగే ఫంగల్ ఇన్ఫెక్షన్, ఐరన్ లేదా విటమిన్ బి12 లోపం వంటి సమస్యలకు కూడా ఇది సంకేతం కావచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. నాలుకపై పసుపు రంగు పొర కనిపించడం సాధారణంగా మృత కణాలు, బ్యాక్టీరియా లేదా ఆహార అవశేషాలు పేరుకుపోవడం వల్ల జరుగుతుంది. ఇది ఎక్కువగా తాత్కాలికమే అయినప్పటికీ, కొన్నిసార్లు జీర్ణ సమస్యలు లేదా జాండిస్ వంటి సమస్యలకు కూడా సూచనగా భావించాలి.నాలుక గాఢ ఎరుపు రంగులో ఉంటే..అలాగే నాలుక గాఢ ఎరుపు లేదా స్ట్రాబెర్రీ రంగులో కనిపిస్తే అది విటమిన్ బి12 లోపం లేదా వాపుకు సంకేతం అవుతుంది. కొన్ని ఇన్ఫెక్షన్లు, ముఖ్యంగా స్కార్లెట్ ఫీవర్, కవాసాకి వ్యాధి వంటి సమస్యల్లో కూడా ఇలా కనిపించే అవకాశం ఉందని చెబుతున్నారు. కొంతమందిలో నాలుకపై మ్యాప్‌లా కనిపించే ఎర్రని మచ్చలు ఉంటాయి. దీనిని జియోగ్రాఫిక్ టంగ్ అని అంటారు. ఇది సాధారణంగా హానికరం కాదు, అంటువ్యాధి కూడా కాదు.


మనసు దాగుడు మూతలు ఆడుతోందా?



ఉదయం ఎంతో ఉత్సాహంగా ఉండే మనసు... మధ్యాహ్నానికి చిరాకుగా, సాయంత్రానికి బాధగా మారడం... ఇందుకు పెద్ద కారణాలేవీ లేకపోవడం... స్త్రీల జీవితాల్లో సాధారణమే. నిజానికి ఈ మూడ్ స్వింగ్స్‌ని ప్రతి మహిళా ఏదో ఒక దశలో ఎదుర్కొంటుంది. ఎందుకంటే, హార్మోన్ల అలజడి, బాధ్యతల ఒత్తిడి వల్ల జరిగే సహజమైన ప్రక్రియ ఇది. నిద్రలేమి, పోషకాహార లోపం ఇందుకు తోడు అవ్వొచ్చు. అయితే, ప్రధానంగా నెలసరి రావడానికి వారం రోజుల ముందు, గర్భధారణ సమయంలో, మెనోపాజ్ దశలో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తుంది. దీంతో చిన్న విషయానికే కస్సుబుస్సులాడటం, ఊరకే కన్నీళ్లు ఉబికి రావడం వంటి ఉద్వేగాలెన్నో కనిపిస్తాయి.

అయితే, సమస్య అర్థమైనా దీని తీవ్రతను మాత్రం చాలామంది గుర్తించరు. మీరలా చేయకండి... జీవనశైలిలో తగిన మార్పులు చేసుకోండి. ఉదయాన్నే అరగంట పాటు నడక, యోగా లేదా ధ్యానం చేయండి. రక్తంలో చక్కెర స్థాయిలు పడిపోకుండా సమయానికి భోజనం చేయండి. ఆకుకూరలు, పండ్లు, తృణధాన్యాలు, డ్రై ఫ్రూట్స్ వంటివి డైట్‌లో చేర్చుకోండి.. వేపళ్లు, పంచదార ఉండే పదార్థాలను తగ్గించండి. రాత్రి త్వరగా పడుకోవడం అలవాటు చేసుకోండి. సన్నిహితులతో మాట్లాడటం, సంగీతం వినడం, పుస్తకాలు చదవడం వంటి నచ్చిన వ్యాపకాలకు సమయం కేటాయించండి. అయినా మార్పు రాకపోతే కుంగుబాటు బారిన పడ్డారని గుర్తించండి. ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించండి. అప్పుడే త్వరగా దాన్నుంచి బయటపడి సంతోషంగా జీవితాన్ని గడపగలరు.

నిద్ర పట్టడం లేదా..



అర్ధరాత్రి దాటినా మెలకువగానే ఉంటున్నారా.. ఫోన్ చూస్తూనో, పని చేసుకుంటూనో నిద్రను వాయిదా వేస్తున్నారా.. ఇది దీర్ఘకాలంలో అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు నిద్రసరిపోక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆఫీసు పనులు, ఇంటి పనులతో సతమతమవుతూ నిద్రకు దూరమవుతున్నారు. ఉదయాన్నే ఆఫీసుకు పరిగెత్తాలనే ఉద్దేశంతో రాత్రి ఎక్కువ సమయం మేల్కొని ఇంటి పనులు పూర్తి చేసుకునే మహిళలే ఎక్కువ ఉన్నారు. అయితే రాత్రుళ్లు ఆలస్యంగా నిద్రపోవడం వల్ల ఉదయం వేళ మబ్బుగా, అలసటగా అనిపిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అందుకే నిద్రపోవడానికి కనీసం ఒక గంట ముందు వీటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. తద్వారా మనస్సు ప్రశాంతంగా ఉండటంతోపాటు నిద్ర బాగా పడుతుందని సలహా ఇస్తున్నారు. నిద్రపోయే ముందు 30-60 నిమిషాల పాటు ఎలాంటి పరికరాలు వాడకుండా ఉండేలా సమయాన్ని కేటాయించుకోవాలని స్లీప్ ఫౌండేషన్ అనే సంస్థ చెబుతుంది.కాఫీలు వద్దుసాయంత్రం వేళల్లో కెఫీన్‌కు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ టైంలో కెఫీన్‌ను స్వల్ప మోతాదులో తీసుకున్నా నిద్రపోవడం కష్టమవుతుందని, నిద్ర నాణ్యత దెబ్బతింటుందని చెబుతున్నారు. అందుకే సాయంత్రం వేళలో కాఫీకి బదులుగా చామంతి, పుదీనా లేదా రూయిబోస్ వంటి హెర్బల్ టీని తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. అలాగే సహజంగా నిద్రపడుతుంది.అతిగా తినొద్దుపడుకునే ముందు ఎక్కువ మోతాదులో ఆహారం తీసుకోవడం లేదా కొవ్వు పదార్థాలు ఉన్న ఆహారాన్ని తినడం వల్ల జీర్ణక్రియపై భారం పడుతుంది. దీనివల్ల మీరు ప్రశాంతమైన నిద్రకు దూరమవుతారు. అందుకే రాత్రి భోజనాన్ని నిద్రపోయే సమయానికి కనీసం మూడు గంటల ముందు తీసుకోవాలని హార్వర్డ్ హెల్త్ పబ్లిషింగ్ చెబుతుంది. ఒకవేళ పడుకునే ముందు ఏదైనా తినాలనిపిస్తే కొన్ని బాదం పప్పులు లేదా ఒక గ్లాసు వెచ్చని పాలు తాగడం మంచిది.తేలికపాటి స్ట్రెచింగ్నిద్రపోయే ముందు తేలికపాటి స్ట్రెచింగ్ చేయడం వల్ల శరీరంలోని కండరాలలో ఒత్తిడి తగ్గి, నాడీ వ్యవస్థ ప్రశాంతంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇది పారాసింపథెటిక్ నాడీ వ్యవస్థను సరిచేసి శరీరాన్ని గాఢనిద్రకు సిద్ధం చేస్తుంది. కనుక ఈ చిట్కాను పాటించి చూడండి.పగటి నిద్రను నివారించడంపగటిపూట కాసేపు నిద్రపోవడం మంచిదే. కానీ సాయంత్రం పూట ఆలస్యంగా పడుకుంటే మాత్రం.. రాత్రి నిద్ర పట్టడం కష్టమవుతుందంటున్నారు నిపుణులు. ఒకవేళ మీకు సాయంత్రం నిద్రమత్తుగా అనిపిస్తే, పడుకునే బదులుగా నెమ్మదిగా నడవడం, తేలికపాటి రీడింగ్ లేదా ప్రశాంతమైన సంగీతాన్ని వినడం లాంటి చేయాలని సూచిస్తున్నారు. పగటిపూట ఎక్కువసేపు కునుకు తీయడం రాత్రి నిద్రకు ఆటంకం కలిగిస్తుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.బ్లూ లైట్ ప్రభావంమొబైల్, టీవీలకు దూరంగా ఉండటంతో పాటు పడుకోవడానికి ఒక గంట ముందు ఇంట్లో వెలుతురును తగ్గించుకోవాలంటున్నారు నిపుణులు.

అంతేకాదు తరచూ జలుబు, దగ్గు లాంటి ఇన్ఫెక్షన్లకు దారితీస్తుందని అంటున్నారు. అలాగే జ్ఞాపకశక్తిపైనా కూడా ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అందుకే రాత్రిపూట త్వరగా నిద్ర పోవాలంటే కొన్ని అలవాట్లను అలవరచుకోవాలి. అవేంటో ఈరోజు తెలుసుకుందాం...చాలా మంది మహిళలు ఇంటి పని అంటే తమ పనే అనుకుంటారు. అన్ని పనులు ఒక్కరే చేసుకుంటుంటారు. ఇదే అలవాటుగా మారి చివరకు నిద్రపోవాలన్నా నిద్రపట్టని పరిస్థితి వస్తుంది. దీని వల్ల శారీరకంగానే కాదు మానసికంగానే అలసిపోయే అవకాశం ఉంటుంది. కాబట్టి భర్త, పిల్లలకు ఇంటి పనులు కేటాయించాలి. ఏదో ఒక పని వారికి చెప్పి చేయించాలి. అప్పుడు మీకూ విశ్రాంతి తీసుకునేందుకు సమయం దొరుకుతుంది. సమయానికి నిద్రపోయే వీలు కలుగుతుంది. దీంతో పాటు ఇంకా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలంటే...స్క్రీన్ సమయం తగ్గించండి. కొంతమంది నిద్రపోయే ముందు ఫోన్ చూసిగానీ నిద్రపోరు. అలాంటి వారు స్క్రీన్ సమయాన్ని పూర్తిగా తగ్గించుకోవాలని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల మొబైల్, టీవీ లేదా లాప్‌టాప్‌ల నుంచి వచ్చే బ్లూ లైట్ మెలటోనిన్ ఉత్పత్తికి అంతరాయం కలగదంటున్నారు.

ఉల్లికాడలతో ఆరోగ్యం..

ఉల్లికాడలు ఆరోగ్యానికి ఎంతో మేలు కలిగిస్తాయిని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. దీన్ని రెగ్యులర్ గా తీసుకోవడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.ఇది షుగర్ లెవెల్స్ ను అదుపులో ఉంచుతుంది. ఉల్లికాడలో యాంటీ బాక్టీరియల్ లక్షణాలు అధికంగా లభిస్తాయి. దీని కారణంగా వాతావరణంలో వచ్చే జలుబు, జ్వరం వంటి సమస్యల నుంచి బయటపడవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఉల్లికాడలలోని యాంటి హిస్టమైన్ ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది. కీళ్ళనొప్పులు, ఉబ్బస చికిత్సకు ఔషధంగా పని చేస్తుంది. ఉల్లికాడ జీర్ణ క్రియను నియంత్రించడంలో ఉపయోగపడు తుంది.ఇది చర్మం మెరుపును పెంచుతుందని చర్మ నిపుణులు చెబుతున్నారు. ఉల్లికాడలు చెడు కొలెస్ట్రాల్ లెవెల్స్‌ను తగ్గించడంలో ఏంతో మేలు చేస్తాయి. వీటిలోని కెమోఫెరాల్ అనే ఫ్లవనాయిడ్ రక్తనాళాలపై ఒత్తిడి లేకుండా, రక్తం సాఫీగా సరఫరా అయ్యేట్లు చేస్తుంది.ఉల్లికాడలను తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. ఆస్టియోపొరోసిస్ వంటి ఎముకల వ్యాధుల బారిన పడకుండా సమస్యను తగ్గిస్తుంది. వీటిల్లోని ఫొలేట్లు గుండె జబ్బులను అదుపులో ఉంచుతాయి. ఉల్లికాడలలో విటమిన్ సి, విటమిన్ బి2, థయామిన్ లు అధికంగా లభిస్తాయి. ఉల్లికాడలలో కాపర్, ఫాస్పరస్, మెగ్నీషియం, పొటాషియం, క్రోమియం, మాంగనీసు, ఫైబర్ ఉంటాయి. ఉల్లికాడలోని సల్ఫర్ కాంపౌండ్ బ్లడ్ ప్రెజర్ స్థాయిలను నియంత్రించడానికి సహాయ పడుతుంది.



అందానికి ఐస్ మంత్రం...

ఈ తరం ఆలోచనలు కాస్త వైవిధ్యంగా ఉంటున్నాయి. పైకి ఆధునికంగా కనిపిస్తున్నా మినిమలిజంవైపే మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా చర్మ సౌందర్యం విషయానికి వస్తే, రసాయనాలతో కూడిన ఖరీదైన క్రీముల కంటే సహజసిద్ధమైన, తక్షణ ఫలితాలనిచ్చే వాటికే ఓటేస్తున్నారు. అలా వచ్చిందే ఈ స్కిన్ ఐసింగ్ ట్రెండ్ కూడా. ముఖాన్ని ఐస్ వాటర్‌లో ముంచడం లేదా ఐస్ క్యూబ్స్‌తో మసాజ్ చేయడమే ఈ కోల్డ్ థెరపీ స్టైల్. కొరియన్ బ్యూటీ సీక్రెట్స్‌లో ఒకటైన ఈ పద్ధతిని నేటి యువత ఇష్టంగా అనుసరిస్తోంది. సెలబ్రిటీలు సైతం తమ మార్నింగ్ స్కిన్‌కేర్ రొటీన్‌లో దీనికి ప్రాధాన్యం ఇస్తుండటంతో జెన్‌జీల బ్యూటీ ప్రపంచంలో టాప్ ట్రెండ్‌గా నిలిచింది. రీల్స్, సెల్ఫీల్లో ఎప్పుడూ ఫ్రెష్‌గా కనిపించాలనుకునే యువత దీన్ని బెస్ట్ ఆప్షన్‌గా ఎంచుకుంటున్నారు. ఐస్ మసాజ్ వల్ల రక్త ప్రసరణ జరిగి... తక్కువ సమయంలోనే ముఖం తాజాగా, కాంతిమంతంగా కనిపిస్తుంది. ఓపెన్‌పోర్స్ మూసుకుంటాయి. చర్మం మృదువుగా మారి, మేకప్ వేసుకోవడానికి చక్కటి బేస్ సిద్ధమవుతుంది. ఇలా ఒకటా రెండా... ఎన్నెన్నో ప్రయోజనాలు... అలాగని కేవలం నీటితోనే కాదు... గ్రీన్‌టీ, రోజ్‌వాటర్, కలబంద, కీరదోస-నిమ్మరసం... వంటి వాటితోనూ ఈ యాంటీ ట్యాన్ క్యూబ్స్ తయారు చేస్తున్నారు. అయితే ఈ ఐస్ ముక్కల్ని నేరుగా కాకుండా వస్త్రంలో కట్టి ఉపయోగించడం, ఎక్కువ సేపు ఒకే ప్లేస్‌లో ఉంచకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.

సెన్సెక్స్ ▼ 81,592.45

నిఫ్టీ ▼ 25,144.30

గోల్డ్ 1,35,809 (10 గ్రాములు)
సిల్వర్ 1,78,000 (1 కిలో)
చమురు 8,346 (రూ. బ్యారెల్)

యూస్ డాలర్ $ 94.2400
బ్రిటన్ పౌండ్ £ 124.4628
యూరో € 103.8619
జపాన్ యెన్ ¥ 0.5879

ఎస్ బి ఐ రూ. 1,992.90
NTPC రూ. 3,937.70
Bharti Airtel రూ. 2,106.00
Grasim రూ. 3,034.00
Hindalco రూ. 943.60
Tata Motors Passenger Vehicles రూ. 287.40



ఎన్విడియా మాజీ సీఈఓ జెన్సన్ హువాంగ్ తిరిగి సీఈఓ పదవి..



ఎన్విడియా మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జెన్సన్ హువాంగ్ మళ్లీ ఆ పదవిలోకి తిరిగి రావడాన్ని పరిశీలిస్తున్నారని ఫైనాన్షియల్ టైమ్స్ ఆదివారం నివేదించింది. ఈ విషయంపై ఆయన సన్నిహితులతో చర్చించారని, పరిచయస్తుల సమాచారం ఆధారంగా ఆ పత్రిక పేర్కొంది. తిరిగి రావడానికి మద్దతు కూడగట్టేందుకు సిలికాన్ వ్యాలీ ఎగ్జిక్యూటివ్లతో 'వార్ రూమ్' ఏర్పాటు చేస్తున్నట్లు హువాంగ్ సన్నిహితుడొకరు చెప్పారు. ఈ ప్రయత్నాలకు హువాంగ్ మద్దతు ఉందని ఆ వ్యక్తి తెలిపారు. వైట్ హౌస్ మద్దతు కూడా పొందేందుకు ప్రయత్నిస్తామని ఆయన అన్నారు. టెక్ రంగంలో ఫ్రాంటియర్ ల్యాబ్స్ వెలుపల ఉన్న ముఖ్యులంతా హువాంగ్ను ఇష్టపడతారని ఆ వ్యక్తి పేర్కొన్నారు. ఈ నివేదికకు ముందు, ఎన్విడియా బోర్డు బ్రిటిష్ చిప్మేకర్ ఆర్మ్ హోల్డింగ్స్ సీఈఓ రెనే హాస్ను సంప్రదించిందని ఫైనాన్షియల్ టైమ్స్ రాసింది. హువాంగ్ స్థానంలో సంభావ్య వారసుడి కోసం అన్వేషణలో ఈ సంప్రదింపులు జరిగాయి. వ్యాఖ్య కోరినప్పటికీ ఎన్విడియా వెంటనే స్పందించలేదు. గురువారం హువాంగ్ పదవి నుంచి వైదొలిగారు. వివాహేతర సంబంధాల వార్తలు వెలుగులోకి రావడంతో ఆయన తప్పుకున్నారు. వాటిలో ఒకటి అనుమానిత చైనా గూఢచారితో ఉందని చెప్పారు. ఇది చైనాకు అధునాతన ఏఐ చిప్ల ఎగుమతులపై ప్రశ్నలు రేపింది.


టీవీఎస్ కుటుంబ వివాదం లక్ష్మి వాటా కోరారు

మింట్ సీనియర్ బిజినెస్ జర్నలిస్ట్ వరుణ్ సూద్ గత 17 సంవత్సరాలుగా కార్పొరేట్ వ్యవహారాలపై రాస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఐటీ సేవలు, విమానయానం, ఆటో, లోహాలు మరియు గనులు, కాంగ్లోమరేట్ల కవరేజీని పర్యవేక్షిస్తున్నారు. 2005లో బిజినెస్ స్టాండర్డ్లో రిపోర్టర్గా ఆయన కెరీర్ ప్రారంభమైంది. ఇంతకు ముందు ఆయన ఢిల్లీ మరియు ముంబైలోని



న్యూస్రూమ్లలో కూడా పనిచేశారు. ఆయన డీఎన్ఏ, ఫైనాన్షియల్ టైమ్స్, ఎకనామిక్ టైమ్స్లో పనిచేశారు. ప్రస్తుతం ఆయన బెంగళూరులో ఉన్నారు. మింట్లో గత దశాబ్దంలో ఇన్ఫోసిస్, టీసీఎస్, కాగ్నిజెంట్, విప్రోల సీఈవోల ఉత్థాన పతనాలపై రాయడం ఆయనకు అత్యంత గర్వకారణం. ఆయన తొలి పుస్తకం 'అజీమ్ ప్రేమ్జీ: ది మ్యాన్ బియాండ్ ది బిలియన్స్' 2020 అక్టోబర్లో ప్రచురితమైంది. ప్రస్తుతం ఆయన వార్షిక నివేదికలు, విశ్లేషకుల ట్రాన్స్క్రిప్ట్లను ఎక్కువగా చదువుతున్నారు. యాక్సెస్ జర్నలిజం, వ్యాపార నాయకులతో ఇంటర్వ్యూలు తగ్గిపోవడం ఆయనకు ఇష్టం లేని విషయాలు. మింట్ మేనేజింగ్ ఎడిటర్ సతీష్ జాన్ వ్యాపార జర్నలిజంలో 30 సంవత్సరాలకు పైగా అనుభవం కలిగి ఉన్నారు. ఆయన 1996లో ది టెలిగ్రాఫ్లో రిపోర్టర్గా కెరీర్ ప్రారంభించారు. 2022లో మింట్లో చేరడానికి ముందు ఆయన ఎకనామిక్ టైమ్స్, డీఎన్ఏలో పనిచేశారు. మింట్లో ఆయన కార్పొరేట్, బ్యాంకింగ్, మార్కెట్ల కవరేజీని పర్యవేక్షిస్తున్నారు. రిపోర్టింగ్ బృందాలను సమన్వయం చేయడం కూడా ఆయన ప్రధాన బాధ్యతల్లో ఒకటి. పెద్ద వార్తలు, స్కూప్లు పొందడంలో కూడా ఆయన కీలక పాత్ర పోషిస్తారు. ఆయన సహోద్యోగులు ఆయనను గొప్ప కథకుడిగా పేర్కొంటారు. ఆయన ప్రస్తుతం పాడ్కాస్ట్లు, ఏఐ సాధనాలను అన్వేషిస్తున్నారు.

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 12,000 ఉద్యోగాల కోత



జులై 2025లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సుమారు 12,000 ఉద్యోగాలను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఈ కోత సంస్థ శ్రామిక శక్తిలో సుమారు 2 శాతానికి సమానం. ఈ నిర్ణయం ఉద్యోగుల్లో ఆందోళనను పెంచింది. మార్చి 2026 నాటికి సంస్థ నికర ఉద్యోగుల సంఖ్య 23,000 మేర తగ్గింది. ఇప్పటికే ఉద్యోగావకాశాల కోసం కష్టపడుతున్న ఆర్థిక వ్యవస్థలో ఇది పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. ఈ పరిణామం ఉద్యోగ భద్రతపై ప్రశ్నలు లేవనెత్తింది. ఒక సర్వే ప్రకారం భారత్లో ఉద్యోగులు సంస్థలను వీడే రేటు 2025లో 16.2 శాతంగా ఉండగా 2026లో 18 శాతానికి పెరిగింది. ఇదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా టెక్ రంగంలో సుమారు 1.22 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. దీంతో ఉద్యోగ భయం విస్తరిస్తోంది. లింక్డ్ఇన్లో డెస్క్ ఉద్యోగుల్లో భయం స్పష్టంగా కనిపిస్తోంది. చాలా మంది ఇంజనీర్లు, టెక్ నిపుణులు తమ సర్టిఫికెట్లను ప్రదర్శిస్తున్నారు. ఈ సర్టిఫికెట్లలో మెషీన్ లెర్నింగ్, అజెంటిక్ ఏఐ, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటివి ఉన్నాయి. చాలా మంది ఈ కోర్సులను వ్యక్తిగత పొదుపుతో చెల్లించి రాత్రింబవళ్లు శ్రమించి పూర్తిచేస్తున్నారు. లేఆఫ్కు సమాధానంగా ఇప్పుడు రీస్కిల్లింగ్ ఒక సాధారణ మార్గంగా మారింది. అయితే ఈ మార్గం ఎంతవరకు సరిపోతుందన్నది స్పష్టంగా లేదు. అస్థిర పరిస్థితుల మధ్య ఒక ప్రశ్న ముందుకొస్తోంది. రీస్కిల్లింగ్ ఖర్చును వ్యక్తి భరించాలా లేక సమాజం సమష్టిగా భరించాలా అన్నదే అది. ఈ ప్రశ్నకు ఇంకా స్పష్టమైన సమాధానం కనిపించలేదు. ఒక్కో ఉద్యోగి వేతనంలో 15 రోజుల జీతం మాత్రమే ఈ ఖర్చుకు సరిపోదని విశ్లేషణలు సూచిస్తున్నాయి. ఉద్యోగ భద్రతపై చర్చ మరింత ఉధృతం కావచ్చు. ఈ అంశంపై ఇప్పటివరకు స్పష్టమైన విధానం వెలువడలేదు. ఉద్యోగులు అనిశ్చితిలోనే కొనసాగుతున్నారు.

జిమ్మీ టాటా టాటా సన్స్ లిస్టింగ్కు మద్దతు ఇస్తూ నోయెల్ టాటా నియంత్రణపై ఆరోపణ



టాటా సన్స్ను పబ్లిక్ లిస్టింగ్ చేయాలా వద్దా అన్నది ఇప్పుడు కేవలం వ్యాపార ప్రశ్న కాదు. ఆ సంస్థను ఎవరు నియంత్రించాలి, టాటా ట్రస్ట్లు ఎంత అధికారం చలాయించాలి అన్న విషయాలూ ఇందులో ఉన్నాయి. రతన్ టాటా తమ్ముడు జిమ్మీ నావల్ టాటా ఈ వివాదంపై స్పందించారు. ఆయన టాటా సన్స్ లిస్టింగ్కు మద్దతు ఇస్తున్నారు. ఆయన ఎన్. చంద్రశేఖరన్ ఛైర్మన్గా కొనసాగడాన్ని కూడా సమర్థించారు. ట్రస్ట్ ఛైర్మన్ నోయెల్ టాటా అదుపులేని నియంత్రణకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆర్బీఐ లిస్టింగ్ నిబంధనల నుంచి తప్పించుకునేలా పునర్నిర్మాణం జరగకూడదని జిమ్మీ టాటా హెచ్చరించారు. ఆర్బీఐ టాటా సన్స్ను ఉన్నత శ్రేణి ఎన్బీఎఫ్సీగా వర్గీకరించింది. ఆ వర్గంలోని కంపెనీలు మూడేళ్లలోపు స్టాక్ ఎక్స్ఛేంజ్లలో లిస్ట్ కావాలి. ఆ గడువు 2025 సెప్టెంబర్ 17న ముగిసింది. అయితే టాటా సన్స్ ఐపీఓకు వెళ్లలేదు. బదులుగా ఎఫ్వై24లో ₹21813 కోట్ల అప్పును తిరిగి చెల్లించింది. జిమ్మీ టాటా ఈ పరిస్థితుల్లో లిస్టింగ్ మరింత అపసరమని భావిస్తున్నారు.

ఇంధనం, విద్యుత్ ధరల పెరుగుదలే ప్రధాన కారణం

వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం అక్టోబర్లో టోకు ద్రవ్యోల్బణం వేగంగా పెరిగింది. టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) సంవత్సరానికి 12.29 శాతానికి చేరింది. సెప్టెంబర్లో ఇది 11.39 శాతంగా ఉంది. ఈ పెరుగుదలకు ప్రధాన కారణం ఇంధనం, విద్యుత్ ధరల్లో భారీ పెరుగుదల. ఇంధనం, విద్యుత్ విభాగంలో ద్రవ్యోల్బణం అక్టోబర్లో 32.84 శాతానికి చేరింది. సెప్టెంబర్లో అది 25.85 శాతంగా ఉండేది. ముడి పెట్రోలియం, సహజ వాయువు ధరలు వేగంగా పెరగడం దీనికి దారితీసింది. ఈ విభాగంలో ద్రవ్యోల్బణం 70.80 శాతానికి చేరింది. సెప్టెంబర్లో ఇది 57.32 శాతంగా నమోదైంది. ఖనిజ నూనెలు కూడా ప్రధాన ప్రభావం చూపాయి. వీటి ద్రవ్యోల్బణం 45.57 శాతానికి పెరిగింది. అంతకుముందు నెలలో ఇది 40.02 శాతంగా ఉంది. విద్యుత్ ధరల్లో మార్పు కనిపించింది. అక్టోబర్లో విద్యుత్ ద్రవ్యోల్బణం 8.06 శాతంగా నమోదైంది. సెప్టెంబర్లో అది 0.43 శాతం తగ్గుదలను చూపింది. ప్రాథమిక ఆహార వస్తువుల ద్రవ్యోల్బణం అక్టోబర్లో 8.26 శాతానికి చేరింది. సెప్టెంబర్లో ఇది 8.14 శాతంగా ఉంది. మొత్తం ఆహార సూచీ ద్రవ్యోల్బణం మాత్రం స్వల్పంగా తగ్గి 8.58 శాతంగా నమోదైంది.





స్టీఫెన్ థాంప్సన్ స్పిన్నింగ్ వీల్ కిక్ నాకౌట్తో రిటైర్మెంట్ ప్రకటించారు



స్టీఫెన్ థాంప్సన్ మాడిసన్ స్క్వేర్ గార్డెన్లో జరిగిన యూఎఫ్సీ 334లో ఎమోషనల్ వీడ్కోలుతో ఎమ్ఎమ్ఏ నుంచి అధికారికంగా రిటైర్ అయ్యారు. మాజీ వెల్టర్వెయిట్ టైటిల్ ఛాలెంజర్ మూడో రౌండ్లో 2:54 వద్ద చార్లెస్ రాడ్త్కును నాకౌట్ చేసి తన చివరి అద్భుత విజయాన్ని నమోదు చేశారు. ఈ విజయం ఆయన వరుసగా మూడు ఓటముల పరంపరకు ముగింపు పలికింది. 2012లో అన్డిఫీటెడ్ కిక్బాక్సర్గా యూఎఫ్సీలో అడుగుపెట్టిన థాంప్సన్ రిటైర్మెంట్ ప్రకటిస్తూ ఆక్టగాన్లో తన గ్లవ్స్ వదిలేశారు. 43 ఏళ్ల ఆయన ప్రకటన చేస్తున్నప్పుడు కన్నీళ్లు ఆపుకోవడానికి ఇబ్బంది పడ్డారు.

అంతర్జాతీయ క్రికెట్కు కీలక దశలో ఐసీసీ బోర్డు

2028 ఒలింపిక్స్లో క్రికెట్ పునరాగమనం, విస్తృత పోటీల కార్యక్రమం

దుబాయ్ [యూఏఈ], నవంబర్ 16: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ICC) బోర్డు జే షాను వరుసగా రెండోసారి చైర్మన్గా ఏకగ్రీవంగా తిరిగి నియమించినట్లు ప్రకటించింది. ఈ నియామకం ICC డైరెక్టర్ల ప్రతిపాదన మేరకు, బాలీలో జరిగిన బోర్డు సమావేశాల్లో ఖరారైంది. షా నాయకత్వంపై బోర్డుకు ఉన్న విశ్వాసాన్ని ఈ నిర్ణయం ప్రతిబింబిస్తోంది. అంతర్జాతీయ క్రికెట్కు కీలక దశలో ఈ కొనసాగింపు



అవసరమని బోర్డు భావించింది. ప్రైస్ నోట్ ప్రకారం, ప్రపంచ విస్తరణ, అభిమానుల భాగస్వామ్యం, వాణిజ్య అభివృద్ధి ICC వ్యూహాత్మక ప్రాధాన్యతలుగా కొనసాగుతాయి. క్రికెట్ 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్లో మళ్లీ చోటు సంపాదించేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో ఆటగాళ్లకు మరిన్ని అవకాశాలు కల్పించే దీర్ఘకాలిక పోటీల కార్యక్రమాన్ని విస్తరిస్తున్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యం. బోర్డు క్రీడ పునాదులను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నట్లు పునరుద్ఘాటించింది. బోర్డు మహిళల క్రికెట్ వృద్ధిని వేగవంతం చేయాలని నిర్ణయించింది. అసోసియేట్ సభ్యులకు మరిన్ని అవకాశాలు కల్పించడం కూడా ప్రాధాన్యతగా ఉంది. అంతర్జాతీయ క్రికెట్ సమగ్రతను కాపాడటం, స్థిరమైన వాణిజ్య అవకాశాలను అన్వేషించడం కూడా లక్ష్యాల్లో ఉన్నాయి. ఈ చర్యలు ఆటకు దీర్ఘకాలిక భవిష్యత్తును అందించేందుకు ఉద్దేశించినవి. జే షా మాట్లాడుతూ, ICC చైర్గా కొనసాగడం గౌరవంతో పాటు బాధ్యతని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ ప్రయోజనాల కోసం సభ్యులతో కలిసి పనిచేస్తానని చెప్పారు. ఒలింపిక్స్లో క్రికెట్ పునరాగమనం కొత్త ప్రేక్షకులను ఆకర్షించే అవకాశమని ఆయన అన్నారు. కొత్త తరం ఆటగాళ్లు, అభిమానులను ప్రేరేపించేందుకు ఇది మంచి వేదికని చెప్పారు. ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ECB) చైర్మన్ రిచర్డ్ థాంప్సన్ షాకు అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ క్రికెట్ వేగంగా మారుతున్న సమయంలో ఆయన నాయకత్వం కీలకమని అన్నారు. అంతర్జాతీయ క్యాలెండర్ను బలోపేతం చేయడం, ద్వైపాక్షిక క్రికెట్ పోటీతత్వాన్ని కాపాడటం అవసరమని వ్యాఖ్యానించారు. ICC స్వతంత్ర డైరెక్టర్ డాక్టర్ రోస్ రివాజ్ కూడా షా పునర్నియామకాన్ని స్వాగతించారు.

భారత షూటర్లు మూడు ఒలింపిక్ కోటాలు ...

న్యూఢిల్లీ, నవంబర్ 16: లాస్ ఏంజెలెస్ 2028 ఒలింపిక్ క్రీడల కోసం దోహాలో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ ఛాంపియన్షిప్లో భారత్ మూడు కోటా స్థానాలు సాధించింది. లండన్ 2012 నుంచి లాస్ ఏంజెలెస్ 2028 వరకు వరుసగా ఐదు ఒలింపిక్ చక్రాల్లో తొలి అర్హత పోటీలోనే ఇంత మంచి ఫలితం రావడం ఇదే మొదటిసారి. ఈ మూడు స్థానాలూ అన్ని షూటింగ్ విభాగాల్లో పోడియం స్థానాలతోనే వచ్చాయి. జైపాల్ మాలవీయ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్లో రజతం గెలిచి ఖాతా తెరిచారు. నీరజ్ కుమార్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ మూడు పొజిషన్ల



విభాగంలో కాంస్యం సాధించారు. వివాన్ కపూర్ పురుషుల ట్రాప్లో రజతం గెలిచారు. ఎన్ఆర్ఏఐ అధ్యక్షుడు కాళికేశ్ నారాయణ్ సింగ్ డియో ప్రెస్ నోట్లో మాట్లాడుతూ, ఒలింపిక్ చక్రాన్ని మూడు కోటాలతో ప్రారంభించడం అందరికీ పెద్ద ప్రోత్సాహమని చెప్పారు. రైఫిల్, పిస్టల్, షాట్గన్ మూడు విభాగాల్లోనూ పోడియం ఫలితాలు రావడం తనకు ఎక్కువ సంతోషాన్నిచ్చిందని అన్నారు. ఇంత త్వరగా మూడు స్థానాలు రావడం జట్టుపై ఒత్తిడి తగ్గిస్తుందని, లాస్ ఏంజెలెస్ కోసం ప్రణాళికకు స్పష్టమైన మార్గం లభిస్తుందని వివరించారు.

జట్టులో ఇతరులపై ప్రభావం పడే ప్రమాదం

క్రికెట్ ఆస్ట్రేలియాతో సంబంధం కోల్పోవడం చిన్న మూల్యమన్న ఖవాజా

ఉస్మాన్ ఖవాజా తన బాంబ్ షెల్ బాల్టాంపరింగ్ ఆరోపణలతో డెవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్, కామెరూన్ బాన్క్రాఫ్ట్లకు అండగా నిలబడటం, ఇతర ఆటగాళ్ల మీద పడే భారం మధ్య సమతుల్యం పాటించడానికి ప్రయత్నించానని చెప్పారు. సోమవారం విడుదలైన కొత్త పాడ్కాస్ట్లో ఆయన 2018లో మొత్తం జట్టుకు బాల్ టాంపరింగ్ గురించి తెలుసునన్న తన ఆరోపణను సమర్థించుకున్నారు. క్రికెట్



ఆస్ట్రేలియాతో సంబంధం దెబ్బతింటే అది చిన్న మూల్యమేనని ఆయన అన్నారు. ఈ విషయంపై నిజం చెబుతానని ఆరు సంవత్సరాల క్రితమే డేవిడ్ వార్నర్కు మాటిచ్చానని ఆయన వెల్లడించారు. ఖవాజా ఈ అధ్యాయాన్ని వార్నర్కు ఇటీవల వారాల వరకు చూపించలేదని తెలిపారు. స్టీవ్ స్మిత్తో పుస్తకం గురించి తన సంభాషణ మరింత ఇబ్బందికరంగా సాగిందని ఖవాజా చెప్పారు. దక్షిణాఫ్రికా పర్యటన ముగిసే వరకు ఆయన ఈ చర్చను వాయిదా వేశారు. 39 ఏళ్ల ఖవాజా తన ఈ వ్యాఖ్యలను మంగళవారం చేశారు. ఖవాజా తీసుకున్న ఈ నిర్ణయం ఇతర ఆటగాళ్లకు ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం జట్టులో ఆడుతున్న కొందరు ఆటగాళ్లపై కూడా దాని ప్రభావం ఉండవచ్చని ఆయన అంగీకరించారు. తన కుటుంబంపై కూడా దాని భారం పడిందని ఖవాజా తెలిపారు. ఖవాజా మాట్లాడుతూ, తాను అన్యాయంగా చూడబడ్డ ముగ్గురి పక్షాన నిలబడ్డానని చెప్పారు. అయితే అది చేస్తున్నప్పుడు ఇతరులకు కూడా మూల్యం ఉండవచ్చని ఆయనకు తెలుసని అన్నారు. ఈ విషయంలో నియంత్రణ కోసం తన శక్తి మేరకు ప్రయత్నించానని ఆయన తెలిపారు. ప్రస్తుత జట్టులో ఆడుతున్న ఆటగాళ్లపై ప్రభావం ఉండవచ్చని ఖవాజా అంగీకరించారు. అదే సమయంలో తాను బాధితుడిగా నటించడం లేదని ఆయన స్పష్టం చేశారు. తాను ఏ పరిస్థితుల్లోకి అడుగుపెడుతున్నానో తనకు తెలుసని ఆయన వివరించారు. ఈ వివాదం ప్రస్తుతం కొనసాగుతోంది. ఖవాజా పుస్తకం సబ్లో ఈ బాల్ టాంపరింగ్ అధ్యాయం చుట్టూ ఇంకా ప్రభావం కొనసాగుతోంది. ఈ కారణంగా ఆయన వ్యాఖ్యలకు ఇప్పటికీ ప్రాధాన్యం ఉంది. ఖవాజా పాడ్కాస్ట్ ముందు పాట్ కమిన్స్ ఆయనను ఇతరుల జీవితాలతో నిర్లక్ష్యంగా ఆడుకుంటున్నారని ఆరోపించాడు. ఆయన ఈ ఆరోపణలను పూర్తిగా అర్థరహితమని పేర్కొన్నారు.

ఇది పెద్ద ఓటమిగా నిలిచింది...

లండన్ [యూకే], నవంబర్ 16: మాడ్రిడ్లో జరిగిన నేషన్స్ లీగ్ పోరులో ఇంగ్లండ్ జట్టు స్పెయిన్ను 3 2 తేడాతో ఓడించి, ప్రపంచ ఛాంపియన్ల 43 మ్యాచ్ల అజేయ పరంపరకు ముగింపు పలికింది. ఆట చివరి దశలో ఇంగ్లండ్ 10 మంది ఆటగాళ్లతో ఆడాల్సి వచ్చినప్పటికీ విజయం సాధించడం విశేషం. థామస్ టుచెల్ నేతృత్వంలోని జట్టు మంచి ఆరంభం ఇచ్చింది. అయితే సగం ఆట ముగియక ముందే మాత్రమే గోల్ ఖాతా తెరవగలిగింది. హ్యారీ కేన్ పెనాల్టీ స్పాట్ నుంచి ప్రశాంతంగా గోల్ చేశాడు. రెండో అర్ధభాగంలో ఇంగ్లండ్ అదే ఊపును కొనసాగించింది. ఎజ్రీ కోన్సా, బెన్ వైట్ త్వరగా గోల్స్ చేసి 30 వద్ద సందర్శక జట్టును పూర్తి నియంత్రణలో ఉంచారు. అయితే ఆట అనూహ్య మలుపు తిరిగింది. ఎలియట్ ఆండర్సన్కు రెడ్ కార్డ్ ఇవ్వడంతో ఇంగ్లండ్ ఒక ఆటగాడిని కోల్పోయింది. ఆ తర్వాత బంతికి దూరంగా ఉన్నప్పుడు లమిన్ యమాల్ను అడ్డుకోవడంతో స్పెయిన్కు పెనాల్టీ లభించింది. మికెల్ ఓయర్సాబల్ ఆ అవకాశాన్ని ఎలాంటి పొరపాటు లేకుండా గోల్గా మార్చాడు. కొద్దిసేపటికే నికో విలియమ్స్ మరో గోల్ చేసి స్పెయిన్ను ఆట ముగింపులో ఉత్కంఠకు తీసుకెళ్లాడు. చివర్లో జేమ్స్ ట్రాఫోర్డ్ రెండు అద్భుత సేవ్లతో స్పెయిన్ను అడ్డుకుని ఇంగ్లండ్ ఆధిక్యాన్ని కాపాడాడు. ఈ విజయంతో స్పెయిన్ అజేయ పరంపర ముగిసింది. ప్రపంచ, యూరోపియన్ ఛాంపియన్లుగా ఉన్న స్పెయిన్ ఇప్పటివరకు 43 పోటీ మ్యాచ్లలో ఓడిపోలేదు. అయితే ఈ ఫలితంతో నేషన్స్ లీగ్ గ్రూప్లో స్పెయిన్ రెండో స్థానానికి పడిపోయింది. దీంతో వచ్చే ఏడాది క్వార్టర్ ఫైనల్స్లో మరింత కఠినమైన ప్రత్యర్థిని ఎదుర్కోవాల్సి రావచ్చు. స్పెయిన్ కోచ్ డి లా ఫ్యుయెంటే తన జట్టును విమర్శించడానికి నిరాకరించాడు. ఆట తొలి 60 నిమిషాల పాటు అసాధారణ ఇంగ్లండ్ జట్టు చేతిలో స్పెయిన్ వెనుకబడిందని ఆయన అంగీకరించాడు. "ఈ రోజు మేము ఒక అసాధారణ జాతీయ జట్టును ఎదుర్కొన్నాం. ఇప్పటివరకు సాధించిన దాని విలువను ఇది మరింత స్పష్టం చేస్తుంది," అని డి లా ఫ్యుయెంటే ఈఎస్పీఎన్ ప్రకారం చెప్పాడు. ఆయన మాట్లాడుతూ తదుపరి శిక్షణా శిబిరం కోసం ఇప్పటికే ఎదురుచూస్తున్నానని చెప్పాడు. కొత్త సవాలును స్వీకరించడానికి జట్టు ఉత్సాహంగా ఉందని కూడా ఆయన పేర్కొన్నాడు.



బాలయ్యకు డిసెంబర్ సెంటిమెంట్..



వుదయం సినిమా: బాలకృష్ణకు డిసెంబర్ సీజన్ గతంలో విజయాలు, పరాజయాలు రెండింటినీ అందించింది. 'అఖండ'తో భారీ హిట్ అందుకున్న ఆయనకు 'అఖండ 2' నిరాశ మిగిల్చింది. ఇప్పుడు గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'దాదా' డిసెంబర్ 24న విడుదలకు సిద్ధమవుతోంది. గతంలో వీరి కాంబోలో వచ్చిన 'వీరసింహారెడ్డి' హిట్ కావడంతో ఈ సినిమాపై అంచనాలు పెరిగాయి.సినిమా విడుదలకు సరైన సీజన్ ఎంచుకోవడం ఒక ఎత్తయితే, ఆ సమయంలో ప్రేక్షకులను మెప్పించడం మరో ఎత్తు. ముఖ్యంగా స్టార్ హీరోల సినిమాలకు సెలవులు ఎంత ఉపయోగపడతాయో, నెగెటివ్ టాక్ వస్తే అంతే వేగంగా వసూళ్లు పడిపోతాయి. బాలకృష్ణ గత సినిమాలను చూస్తే ఇందుకు కొన్ని డిఫరెంట్ పరిస్థితులు కనిపిస్తాయి. ఒకే నెలలో బ్లాక్‌బస్టర్లు అందుకున్న సందర్భాలు ఉన్నాయి. భారీ అంచనాలతో వచ్చి దెబ్బతిన్న సినిమాలు కూడా ఉన్నాయి.బాలయ్య కెరీర్‌లో డిసెంబర్‌లో వచ్చిన సినిమాల జాబితా చాలానే ఉంది. 1988లో 'రక్తాభిషేకం' హిట్ కాగా, 1990లో 'లారీ డ్రైవర్' సూపర్ హిట్ అందుకుంది. కానీ 1992లో వచ్చిన 'అశ్వమేధం', 2004లో విడుదలైన 'విజయేంద్ర వర్మ' నిరాశపరిచాయి. 2019 డిసెంబర్ 20న వచ్చిన 'రూలర్' కూడా బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్ అయింది. అప్పట్లో బాలయ్య మార్కెట్‌పైనా ఆ సినిమా ప్రభావం పడింది. అయితే 2021 డిసెంబర్ 2న వచ్చిన 'అఖండ'తో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన ఆ సినిమా బాలయ్యకు భారీ విజయం అందించింది. కరోనా తర్వాత తెలుగు రాష్ట్రాల్లో థియేటర్లకు మళ్లీ ప్రేక్షకులను రప్పించిన సినిమాల్లో 'అఖండ' ఒకటిగా నిలిచింది. ఆ విజయంతో బాలయ్య కెరీర్ మరోసారి ఊపందుకుంది. అక్కడి నుంచి వరుస సినిమాలతో మంచి వసూళ్లు అందుకున్నారు. కానీ గత ఏడాది డిసెంబర్‌లో అదే బోయపాటి దర్శకత్వంలో వచ్చిన 'అఖండ 2' మాత్రం మొదటి భాగం స్థాయిలో మెప్పించలేకపోయింది.

వుదయం సినిమా

హీరో తేజ సజ్జా, మౌర్య నిశ్చితార్థం



వుదయం సినిమా: యంగ్ సెన్సేషన్, సూపర్ హీరో తేజ సజ్జా, మౌర్య నిశ్చితార్థం ఘనంగా జరిగింది. ఈ వేడుక హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు, రాజకీయ ప్రముఖులు, తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు స్టార్స్ సమక్షంలో గ్రాండ్ గా జరిగింది. ఈ వేడుక సినీ, రాజకీయ ప్రముఖుల రాకతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ ప్రత్యేక వేడుకకు మెగాస్టార్ చిరంజీవి, తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మంత్రి సీతక్క, హరీశ్ రావు, గంటా శ్రీనివాసరావు తదితర ప్రముఖులు హాజరై కాబోయే దంపతులను ఆశీర్వదించారు. తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు కూడా ఈ వేడుకకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. లెజెండరీ దర్శకుడు కె. రాఘవేంద్రరావు, నిర్మాతలు అల్లు అరవింద్, సురేష్ బాబు, దిల్ రాజు, టీజీ విశ్వ ప్రసాద్, సుస్మిత కొణిదెల, సాహు గారపాటి, వెంకట్ బోయనపల్లి, నటులు శ్రీకాంత్, రవితేజ, నాని, రానా దగ్గుబాటి, అడివి శేష్, సుధీర్ బాబు, వరలక్ష్మి శరత్ కుమార్, నిధి అగర్వాల్, నిహారిక కొణిదెల, రితికా నాయక్, ఇమాన్వి ఈ వేడుకలో పాల్గొన్నారు. అలాగే ప్రముఖ దర్శకులు బి. గోపాల్, అనిల్ రావిపూడి, ప్రశాంత్ వర్మ, శివ నిర్వాణ, నందినీ రెడ్డి, కార్తీక్ ఘట్టమనేని, మారుతి, చందూ మొండేటి, శైలేష్ కొలను, బీవీఎస్ రవి తదితరులు హాజరై తేజ సజ్జా, మౌర్యలకు శుభాకాంక్షలు తెలిపారు.ఆనందం, ప్రేమ, ఆప్యాయతల మధ్య తేజ సజ్జా, మౌర్య తమ జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. డిసెంబర్‌లో డెస్టినేషన్ వివాహం జరగనుంది.

'మన డాక్టర్ బాబే' ప్రీ రిలీజ్



వుదయం సినిమా: శరణ్య, సుధీక్ష సమర్పణలో స్కంద ఫిల్మ్స్ బ్యానర్ మీద కృతాక్షినిర్మాణంలో తెరు చలపతి కుమార్ పువ్వల తెరకెక్కిస్తున్న చిత్రం 'మన డాక్టర్ బాబే'. ఈ మూవీతో శ్రీ స్కంద హీరోగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమాలో మోహన సిద్ధి, శృతి శంకర్, అలీ, రాజీవ్ కనకాల, శాంతి, కోటేశ్వరరావు ప్రముఖ పాత్రలను పోషించారు. ఈ మూవీని నవంబర్ 20న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ మేరకు ఆదివారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ హీరో రాజ్ తరుణ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ ఈవెంట్లో.. అలీ మాట్లాడుతూ .. ''చలపతి మీద నమ్మకంతో శ్రీ స్కంద తన సొంత డబ్బులు పెట్టి 'మన డాక్టర్ బాబే' చిత్రాన్ని నిర్మించాడు. చలపతి, శ్రీ స్కంద కష్టాన్ని నేను చూశాను. చిన్న చిత్రమా? పెద్ద సినిమానా? అని ఆడియెన్స్ పట్టించుకోరు. కథలో బలం ఉంటే, కంటెంట్ ఉండే ప్రేక్షకులు విజయాన్ని అందిస్తారు. 'మన డాక్టర్ బాబే' సినిమాని అందరూ ఆదరించాలని కోరుకుంటున్నాను. నవంబర్ 20న విడుదలవుతోన్న చిత్రాన్ని చూసి సక్సెస్ చేస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు. రాజ్ తరుణ్ మాట్లాడుతూ .. ''మన డాక్టర్ బాబే' చిత్రంతో నిర్మాతగా, హీరోగా వస్తున్న శ్రీ స్కందకి ఆల్ ది బెస్ట్. తెలుగు హీరోయిన్లను చూస్తుండటం ఆనందంగా ఉంది. అలీ గారితో నటించే అదృష్టం రాకపోయినా.. ఆయనతో స్టేజ్ పంచుకునే అవకాశం ఇప్పుడు వచ్చింది. చలపతికి ఈ చిత్రంతో మంచి విజయం దక్కాలి. డైరెక్టర్ హర్ష గారు చలపతి గురించి ఎంతో గొప్పగా చెప్తుంటాడు. కిషోర్ గొప్ప కెమెరామెన్. నవంబర్ 20న 'మన డాక్టర్ బాబే' చిత్రం విడుదల అవుతోంది. థియేటర్లో ఈ సినిమాని చూడండి. ఈ మూవీ మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.హీరో శ్రీ స్కంద మాట్లాడుతూ .. ''మన డాక్టర్ బాబే' సినిమాకి ప్రీమియర్లు వేశాం. చూసిన వారంతా అద్భుతంగా ఉందని మెచ్చుకున్నారు. చలపతి గారు ఈ మూవీని గొప్పగా తెరకెక్కించారు. నవ్విస్తూ మంచి సందేశాన్ని ఇచ్చేలా సినిమాని రూపొందించారు. ఎమోషన్స్ కూడా అందరినీ ఆకట్టుకుంటాయి. చలపతి గారితో పని చేయడం ఆనందంగా ఉంది. కిషోర్ గారు మాకు మంచి విజువల్స్ ఇచ్చారు. అలీ గారితో నటించడం నా అదృష్టం. మా సినిమా ప్రతీ ఒక్కరినీ ఎంటర్టైన్ చేస్తుంది. ఆడియెన్స్ పెట్టే డబ్బులు వృథా కావు.

"ది మేజ్" ట్రైలర్ రిలీజ్ ఈవెంట్




వుదయం సినిమా: తమిళ, తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న హీరో శ్రీరామ్ (శ్రీకాంత్) నటిస్తున్న కొత్త సినిమా "ది మేజ్". ఈ మూవీలో ప్రియాంక, ప్రీతిక శ్రీనివాస్, కమల్ కామరాజు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని డాక్టర్ నైమిష రెడ్డి కసిరెడ్డి సమర్పణలో శ్రౌష కమల ఆర్ట్స్, యూఆర్ క్రియేషన్స్ బ్యానర్స్ పై డాక్టర్ ఉదయ్ కె. రెడ్డి పాల్వాయి, డాక్టర్ కేవీఎస్ఆర్ (కరెడ్డి శ్రీధర్ రెడ్డి), డాక్టర్ భరత్ రెడ్డి గోపు, డాక్టర్ అనిరుధ్ రెడ్డి సోమ నిర్మిస్తున్నారు. "ది మేజ్" చిత్రాన్ని సరికొత్త సైకలాజికల్ థ్రిల్లర్ కథతో దర్శకుడు డాక్టర్ రవికిరణ్ గడలాయ్ రూపొందిస్తున్నారు. త్వరలో ఈ సినిమా గ్రాండ్ పాన్ ఇండియా థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు డైరెక్టర్, ప్రొడ్యూసర్ మధుర శ్రీధర్ రెడ్డి, డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ అతిథులుగా "ది మేజ్" సినిమా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలోడీవోపీ శివకృష్ణ మాట్లాడుతూ – మా మూవీ చాలా బాగా వచ్చింది. మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాం. విజువల్ పరంగా నాకు మంచి గుర్తింపు తీసుకొచ్చే చిత్రమిది. అన్నారు.నటి శ్రీష మాట్లాడుతూ – మా మూవీ ట్రైలర్ మీకు నచ్చిందని అనుకుంటున్నాం. ఈ సినిమాలో హారిక పాత్రలో నటిస్తున్నాను. ఇలాంటి మంచి టీమ్ తో కలిసి వర్క్ చేయడం హ్యాపీగా అనిపించింది. హీరో శ్రీరామ్ ఫ్రెండ్లీగా ఉంటూ మాకు సపోర్ట్ అందించారు. అన్నారు.నిర్మాత డాక్టర్ ఉదయ్ కె. రెడ్డి పాల్వాయి మాట్లాడుతూ – ఈ సినిమా కథ చెప్పినప్పటి కంటే స్క్రీన్ మీద చూసినప్పుడు ఎక్కువ థ్రిల్ అయ్యాను. ఈ సినిమా ప్రివ్యూ చూస్తున్నప్పుడు సెకండాఫ్ చూపు తిప్పుకోలేకపోయాను. అంత గ్రిప్పింగ్ గా రూపొందించారు మా డైరెక్టర్. ఈ సినిమాలో శ్రీరామ్ గారు జాయిన్ అవడంతో మరింత స్ట్రాంగ్ ప్రాజెక్ట్ అయ్యింది. మా చిత్రంలో హీరో శ్రీరామ్, ఇద్దరు హీరోయిన్స్ బాగా పర్ఫార్మ్ చేశారు. నాకు సినిమాలంటే పెద్ద ఆసక్తి ఉండదు. కానీ ఇలాంటి ప్రాజెక్ట్ లలో భాగమవడం సంతోషంగా ఉంది. అన్నారు.నటుడు రవివర్మ మాట్లాడుతూ – ఈ చిత్రంలో తల్వార్ సింగ్ అనే క్యారెక్టర్ లో నటించాను. ఈ సినిమాలో థర్టీ ఇయర్స్ పృథ్వీ గారితో కలిసి కొన్ని కామెడీ సీన్స్ చేశాం కానీ అవి ఎడిటింగ్ లో పోయాయి. కానీ కరెక్ట్ గా కథలో మాత్రం నా సీన్స్ కీలకంగా ఉంటాయి. శ్రీరామ్ గారితో కలిసి ఈ మూవీ చేయడం హ్యాపీగా ఉంది. హ్రితిక శ్రీనివాస్ తో వదలా మూవీలో నటించాను. వివిధ జానర్స్ కలిసిన ఈ సినిమా ప్రేక్షకులకు బాగా నచ్చుతుందని నమ్ముతున్నాం.

'ది సెన్సో' ట్రైలర్ లాంచ్



వుదయం సినిమా: గ్రేస్ గ్రిట్ ఫిల్మ్స్ బ్యానర్ మీద బి.ఎన్. రవి నిర్మాణంలో యశ్ రాజ్, మౌపియ గౌస్వామి, ఈశ్వర్ పెంటి, పూజా రెడ్డి ప్రధాన పాత్రల్లో యశ్ రాజ్ తెరకెక్కించిన చిత్రం 'ది సెన్సో'. ఈ మూవీకి సంబంధించిన ట్రైలర్‌ను సోమవారం నాడు విడుదల చేశారు. ఈ క్రమంలో నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి హీరో ఆకాష్ జగన్నాథ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమానికి చిలుముల మదన్ రెడ్డి, అశోక్ యాదవ్, ప్రభు రావులకోలు, నర్సింగ్, శ్రావణ్ రావులకోలు తదితరులు అతిథులు విచ్చేసి టీంను అభినందించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో..ఆకాశ్ జగన్నాథ్ మాట్లాడుతూ 'నన్ను ఈ మూవీ టీం అప్రోచ్ అయింది. ట్రైలర్ చూశాను. చాలా అద్భుతంగా ఉంది. ఈ మూవీలో హీరో, హీరోయిన్ చాలా బాగున్నారు. ఇలానే ఈ టీం మరిన్ని సినిమాలు తీయాలని, 'ది సెన్సో' చిత్రం విజయం సాధించాలని కోరుకుంటున్నాను. ఈ మూవీకి పని చేసిన అందరికీ ఆల్ ది బెస్ట్' అని అన్నారు.యశ్ రాజ్ మాట్లాడుతూ .. 'మా 'ది సెన్సో' చిత్రాన్ని సపోర్ట్ చేయడానికి వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మాకు ఇది మొదటి మెట్టు. ఈ జర్నీలో సపోర్ట్ చేసిన నా టీంకు థాంక్స్. సినిమా లైఫ్ అంటే చాలా కలర్‌ఫుల్‌గా ఉంటుంది. కానీ ఆ అందమైన జీవితం వెనకాల చాలా ఇబ్బందులు ఉంటాయి. సొసైటీ గురించి నాకు వచ్చిన థాట్ ఈ చిత్రానికి బీజం వేసింది. ఈ మూవీ బేసిక్ హ్యూమన్ ఎమోషన్ నుంచి పుట్టిందే. ఓవర్‌నైట్ స్టార్ అవ్వాలని ఇండస్ట్రీకి రాలేదు. ఇండస్ట్రీకి వచ్చాక నేను చాలా నేర్చుకున్నాను. ఇంకా నేర్చుకుంటాను. మన నిజాయితీయే ఇక్కడ నిలబెడుతుంది. మా నిర్మాత బి.ఎన్.రెడ్డి సహకారం మర్చిపోలేను.

"అరుంధతి నక్షత్రం" ఘనంగా ప్రారంభం



వుదయం సినిమా: ఆది సాయి కుమార్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "అరుంధతి నక్షత్రం". ఈ సినిమాలో మేఘా శెట్టి, మధు దామరాజు హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో సినిమాతో బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకున్న నిర్మాణ సంస్థ 7 పి.ఎం. ప్రొడక్షన్స్, శ్రీ చక్ర మూవీస్ ఎల్ఎల్ పి బ్యానర్స్ "అరుంధతి నక్షత్రం" సినిమాను నిర్మిస్తున్నాయి. ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో చిత్ర దర్శకుడు రాహుల్ శ్రీనివాస్ రూరల్ ఫ్యామిలీ డ్రామా కథతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ చిత్రాన్ని సందీప్ అగరం, అమ్మిత రెడ్డి బాసాని, డా.సూర్యకాంతి కూచిభొట్ల నిర్మిస్తున్నారు. ఈ రోజు హైదరాబాద్ లో "అరుంధతి నక్షత్రం" సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి యాక్టర్ సాయి కుమార్ క్లాప్ ఇచ్చారు. ప్రొడ్యూసర్స్ రమేష్ పుప్పాల, సూర్యకాంతి కూచిభొట్ల కెమెరా స్విచ్చాన్ చేశారు. చిత్ర నిర్మాతలు స్క్రిప్ట్ అందించారు. "అరుంధతి నక్షత్రం" ఆది సాయికుమార్ 28వ సినిమాగా రాబోతోంది. "అరుంధతి నక్షత్రం" సినిమా అనౌన్స్ మెంట్ సందర్భంగా మేకర్స్ స్పెషల్ వీడియో గ్లింప్స్ రిలీజ్ చేశారు. ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో సినిమాను గుర్తుచేసేలా మెమొరీ కార్డ్ లోని ఫొటోస్ ను పోస్టర్స్ గా ప్రింట్ చేసి "అరుంధతి నక్షత్రం" సినిమా రూపొందిస్తున్నట్లు తెలియజేశారు. ఈ అనౌన్స్ మెంట్ వీడియో ద్వారా ఇది ఒక మంచి రూరల్ ఫ్యామిలీ డ్రామా అని అర్థమవుతోంది. ఈ నెలలోనే "అరుంధతి నక్షత్రం" సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించబోతున్నామని, తమ బ్యానర్ కు మరింత పేరు తెచ్చేలా ఈ సినిమా ఉంటుందని ప్రొడ్యూసర్స్ తెలిపారు.

"కెరూబ్" సినిమా ట్రైలర్ విడుదల

వుదయం సినిమా: ఖుషీ ఎంటర్టైన్మెంట్ పతాకంపై విహాన్ కార్తీక్ హీరోగా MJ నాయుడు దర్శకత్వం వహిస్తూ నిర్మించిన చిత్రం "కెరూబ్". గత, వర్తమాన, భవిష్యత్తు అనేవి ట్యాగ్ లైన్స్. ఈ చిత్రానికి సంగీతం సత్య రాధాకృష్ణ అందించగా, రమేష్ తోకల సినిమాటోగ్రఫీ అందించారు. సీనియర్ దర్శకుడు సముద్ర మాట్లాడుతూ... సినిమా టీజర్, ట్రైలర్ చూడగానే.. మన ఫారెస్ట్ లో చేసిన అవతార్ లాగా అనిపించింది. మన తెలంగాణ లో ఇంత అందమైన అడవుకున్నాయా అనిపించింది. మరో రామాయణం అంత హిట్ కావాలని కోరుకుంటున్న. హీరో చాలా అందంగా మరో విజయ్ దేవరకొండ, నాని లాగ ఉన్నాడు. మంచి భవిష్యత్తు ఉంది. ట్రయిలర్ చూస్తుంటే దర్శకుడిలో ఎంతో ప్రతిభ ఉంది అనిపిస్తోంది.ఈచిత్రం ట్రైలర్ ను ఈరోజు విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు, నిర్మాత M.J.నాయుడు మాట్లాడుతూ... నాకు చాలా ఎమోషనల్ గా ఉంది. సక్సెస్ వచ్చినా, ఫెయిల్యూర్ వచ్చినా వాటితో సంబంధం లేదు అనిపిస్తోంది ఈ స్టేజ్ వరకు రావటంతో. కుటుంబం సపోర్ట్ తో ఈ సినిమా చేయగలిగాను. దాదాపు 16 ఏళ్లలో ఈ సినిమా తీయగలిగాను.



Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.